


అసమర్థుని జీవయాత్ర

గోపీచంద్

(1)

RSK01A1489 1

అసమర్థుని జీవయాత్ర

గొల్లపూడి

సహాయం పబ్లిషర్స్

విజయవాడ 2

పరిచురణ సెం.67.
వెల: రు.3-50

ప్రథమ ముద్రణ : 1947
రెండవ ముద్రణ : 1950
మూడవ ముద్రణ : 1955
నాలుగవ ముద్రణ : 1960
అయిదవముద్రణ : 1963

నాన్నగారికి
'ఎందుకు'
అనే ప్రశ్న
నేర్పినందుకు



అచ్చు : "వెంకటరత్నా" విజయవాడ-2.

అసమర్థుని జీవయాత్ర

మొదటి ప్రకరణం

అసమర్థుడు

శ్రీ సీతారామారావు జీవితం విచిత్రమైంది. ఉన్నత శిఖరాగ్రంనుంచి స్వచ్ఛమైన జలంతో భూమిమీదపడి, మలినాన్ని కలుపుకొని, మురికి కూపంలోకి ప్రవహించే సెలయేటిని జ్ఞప్తికి తెస్తుంది. తనలోవొచ్చిన మార్పు ఆ సెలయేటికి తెలుసో తెలియదో మనకు తెలియదు. ఒకవేళ తెలిస్తే, తనలో వొచ్చిన మార్పుకి ఆ సెలయేరు బాధపడుతూవుందో గర్వపడుతూవుందో మనకు తెలియదు.

చూసేవాళ్ళు మాత్రం దాని పతనానికి జాలిపడుతూ వుంటారు. దానికి ఆ జ్ఞానం వుందో లేదోమాత్రం ఎవ్వరూ చెప్పలేరు. పైగా పర్వతాల్లో ప్రవహిస్తూ ఉన్నప్పుడున్న వొడుదుకుల్లేవు అని సంతోషిస్తూ వుందేమో అనిపిస్తుంది

అప్పుడప్పుడు. సీతారామారావు తండ్రి చావుమంచంమీద వుండి "బాబూ మన వంశంపేరు నిలబెట్టు. అంతకంటే నే చెప్పేది ఏమీలేదు" అని సలహాచెప్పాడు. అవే అతని ఆఖరు మాటలు.

ఆ మాటలు విని చుట్టూ వున్నవాళ్ళంతా ఆశ్చర్య పోయారు. "ఆస్థి సంగతి చెప్పలేదు; కుటుంబం మంచి చెడ్డలు చెప్పలేదు; ఇంకేమీ చెప్పలేదు; వంశంపేరు నిల బెట్టమన్నాడు. చూశారా, ఆయన గొప్పతనం?" అని పొగిడారు.

"ఆ గొప్పతనం వాళ్ళ వంశంలోనే ఉంది"అన్నారు అంతా.

నిజంగా వాళ్ళ వంశం గొప్పదే. వాళ్ళ ముత్తాత తాత ఆస్థారికి చెరువు తవ్వించాడు. సత్రం కట్టించాడు, వాళ్ళ తాత నల్లగా వీరభద్రుడికిమల్లే వుండేవాడు. కర్రచేత్తో పట్టుకొని బజార్న నడుస్తుంటే ఎవ్వరికైనా కూర్చునే ప్రాప్తం వుండేదా? ఆడవాళ్ళు తుర్రున ఇళ్ళల్లోకి పరిగెత్తే వాళ్లు. ఆయన పేరుచెపితే చాలు పిల్లలు హడలుకొని మారాం కట్టిపెట్టి కుక్కినపేలయ్యేవాళ్లు. ఆ వూళ్ళో దేవాలయం కట్టించింది ఆయనే. ఇప్పటికీ దేవుడి పెళ్ళికి పీటల మీదకూర్చునే హక్కు వాళ్ళదే. ఈ హక్కు అతని తండ్రి ముప్పయివేలు ఖర్చుపెట్టి, హైకోర్టుదాకా వెళ్ళి నిలబెట్టు కున్నాడు. ప్రతియేటా దేవుని ఉత్సవం తన సొంత ఖర్చు తోనే చేయించేవాడు. అడిగినవాళ్ళకు లేదనకుండా దానం

చేసేవాడు. ఆ వూరిగుండా ఏ పెండ్లివాళ్లు వెళ్ళడం తట
స్థించినాసరే ఒకవూట వాళ్ళ ఇంట్లో బసచేసి ఆయనచేసే
సత్కారాలు అందుకొని, విందారగించి వెళ్లవలసిందే.
వాళ్ళ కమతంలోకి రావాలని ఊళ్లో మాలమాదిగలంతా
ఉవ్విళ్ళూరుతూ వుండేవారు. అజమాయిషీ లేకపోవటం
వల్ల కాజెయ్యటానికి వీలవుతుందని వాళ్ల తాపత్రయం
అని గిట్టనివాళ్ళు అనేమాట నిజమేగాని ఆ కుటుంబంలో
పుట్టిన వాళ్లెవ్వరూ ఆ మాట నమ్మరు.

సీతారామారావు చిన్నతనం నుంచీ తన కుటుం
బాన్ని గురించి అనేకులు గొప్పగా చెప్పుకోవటం వింటూ
వుండేవాడు. కొంతమంది అతని ముఖం ఎదటనే కీర్తిస్తూ
వుండేవాళ్ళు. ఇక తన బంధువుల సంగతి చెప్పనవసరమే
లేదు. తమ ఇళ్ళల్లో జరిగిన కార్యం కగామత్తుల వైభవం
దగ్గర్నుంచి, తమ తాతముత్తాతల శౌర్యం వరకూ వర్ణించి
వర్ణించి జెబుతుండేవారు. అప్పుడతనికి కూడి అయింది—
"డబ్బు దేముంది? మనిషికి కావలసింది పేరు" అని.

అతని వంశాన్ని పొగిడేవాళ్లంతా యీ విషయం
ఏకగీవంగా వొప్పుకున్నారు. "డబ్బు మనల్ని సంపాయిం
చిందా, మనం డబ్బును సంపాయించామా?" అనేవాళ్లు.
"డబ్బు సంపాయించిన వాళ్ళు చాలామంది ఉన్నారు.
వాళ్ళందర్నీ మీతాత ముత్తాతల్ని చెప్పుకున్నట్లు చెప్పు
కుంటున్నారా?" అని ప్రశ్నించేవాళ్ళు.

అతనికి యీ ప్రశ్నలు చాలా గొప్పగా కనుపించేవి.
అతనిలో ప్రవహించేది ఆ వంశంలోనిరక్తమే. ఈవిషయం

తనతండ్రి కర్మకి పదివేలు ఖర్చుపెట్టి అతడు నిరూపించుకున్నాడు.

"తండ్రికి మించిన చెయ్యి" అన్నారు అంతా.

"ఎముక లేని చెయ్యి" అన్నాడు వొక కవి.

పదిరోజులు నిరశాన్నదానం చేశాడు. వొచ్చిన చుట్టాలెవరూ నెలరోజులు పూర్తి కాకుండా వెళ్ళినవాళ్ళు లేరు. అందర్నీ తృప్తిపరచి పంపాడు. ఆ పదిరోజులూ చుట్టుప్రక్కల గ్రామాల్లో వున్న బీదసాదలకు అన్నదానం చేశాడు. బట్టలు పంచిపెట్టాడు. వాటిమీద ఫలానావారి ధర్మం అనికూడా వేయించాడు. ఆ రోజుల్లో అతనిపేరు చెప్పనోనివాళ్ళు లేరు. 'చెప్పకుంటే ఆయన్నే చెప్పనోవాలి' అనుకునేవాళ్ళు.

"మారాజు!" అనేవాళ్లు.

తండ్రి గతించిం తర్వాత అప్పులు యివ్వవలసిన వాళ్ళ విషయంలోకూడా అతను చాలా వుదారంగా ప్రవర్తించాడు. తమ కష్టసుఖాలు, వొచ్చి చెప్పనోనివాళ్ళది పాపం. ఇచ్చిన వాళ్లదగ్గర యిచ్చినట్టు పుచ్చుకున్నాడు. అతను ఒకటేమాట చెప్పాడు—"నేను కోర్టుకి ఎక్కను."

అతని మేనమామ అతనికి నల్భై వేలివ్వాలి. అది కూడా అతను పరిహారం చేసుకున్నాడు. ఒకరోజు మేనమామ వచ్చి తన వూరు తీసికెళ్ళాడు. తన ఇంటికి తీసుకొనివెళ్ళి ఎన్నో మర్యాదలు చేశాడు. అత్తకూడా "రాక రాక వచ్చావు. నువ్వువస్తే చూడుబాబూ, పూర యిల్లుకళ

కళ లాడుతున్నది?" అన్నది. తాను వచ్చినందుకు వాళ్ళు పడిన సంతోషం, వాళ్ళుచేసినమర్యాదలూ చూస్తే అతనికి అమితానందం కలిగింది. నాలుగోరోజు మేనమామ తన కుటుంబపరిస్థితులు చెప్పుకుంటూ "బాబూ! నేనంత డబ్బు యిచ్చుకోలేను. పిల్లలు కలవాణ్ణి. పదియెకరాల మాగాణి— నిక్షేపంలాంటిది రాసిస్తాను, నా కాపరం నిలబెట్టు. నీకీ డబ్బు వొక లెక్కలోది కాదు. చదువుకున్న వాడివి, సమర్థుడివి. రేపటినుంచి ఎంత సంపాదించాలంటే అంత సంపాదించుకోగలవు" అన్నాడు.

"సంపాదించుకోకపోతే మాత్రం నీకు సహాయం చేయకూడదా మామా?"అన్నాడతను. సంపాదించే అవకాశం వుండిగనక యిత్తర్లకు సహాయం చేస్తున్నాడనుకోవటం అతనికి బొత్తిగా బాగాలేదు. సూర్యుని తేజస్సుకుమల్లే, రత్నాలకాంతికిమల్లే దాతృత్వం అతని స్వభావం.

"ఎందుకు చెయ్యకూడదు బాబూ, మేమేం పరాయి వాళ్ళమా?" అంది అత్త.

"పరాయి వాళ్ళకుమాత్రం సహాయం చేయకూడదా అత్తా?"

"అది వేరు"అంది అత్త. కాని తర్వాత ఏమనాలో ఆమెకి తోచలేదు.

"నాయనా! మీ బాబు చచ్చి ఏ స్వర్గాన వున్నాడో వొక్కనాడైనా బాకీసంగతి ఎత్తేవాడేకాదు" అన్నాడు మామ. అతను అప్పటికప్పుడే పది ఎకరాలిస్తానని మాట జారినందుకు పశ్చాత్తాపపడడం మొదలు పెట్టాడు.

"నేను మాత్రం మీ మాట కాదన్నానా?"

"అదుగదీ. నేను చెప్పలా? వాడి గుణమే వేరు" అంది అత్త యింత ముఖం చేసుకొని. ఆమెకు నలభై వేల అప్పు పదియెకరాలతో పోవటమే పట్టరాని సంతోషాన్ని కలిగించింది. భర్తకుమాత్రం ఆమెమీద కోపగవచ్చింది.

"నాయనా, మీనాన్నా నేనూ ఎలావుండేవాళ్ళమో నీకు తెలుసుగా? ఇంటిపనులు అయన వొక్కటికూడా పట్టించుకునేవాడు కాదు. పొలం ఖాతా అంతా నేనే చూచుకునేవాణ్ణి. ఏది ఎంతవచ్చిందనికూడా అడిగేవాడా! మహారాజు మంచి అనిపించుకుని వెళ్ళిపోయాడు.... ...నీకు జ్ఞాపకముందో లేదోగాని నిన్ను నా చేతులతో ఎత్తిపెంచాను బాబూ" అన్నాడు.

"లేకేం మామా?" అన్నాడు సీతారామారావు. అతనికి నిజంగా జ్ఞాపకంలేదు. పెంచే వుంటాడని నమ్మకం. అబద్ధమాడవలసిన అవసర మేమొచ్చింది తన మామకి!

"నా స్వంత తమ్ముడివే అనుకున్నా బాబూ! ఒక రోజు అరుగుమీద ఆడిస్తుంటే కిందపడ్డావు. ఎక్కడ దెబ్బ తగిలిందో అని నా ప్రాణాలు పైనే యెగిరిపోయినయ్యంటే నమ్ము. అప్పు డెట్లా వుండేవాడివి! దొరల్లే నిగనిగ లాడు తుండేవాడివి" అంది అత్త.

వాళ్ళ మంచితనం అతనికి దిగ్భ్రమ కలిగించింది. ఇంత మంచివాళ్ళకీ తన తండ్రికీ చివరిరోజుల్లో ఎందుకు వైరం వచ్చిందా? అని ఆలోచించాడు. తన అస్తిపై పెత్తనం చేస్తూ చాటుగా చాలా డబ్బుతిన్నాడని వూళ్ళోవాళ్ళు

అనుకుంటూవుంటారు-కాని, ఇంత మంచివాడు అటువంటి పని చేస్తాడా? డబ్బేతింటే యింత అప్పు యెందుకవుతుంది? గిట్టనివాళ్ళనేమాటలివి. తనతండ్రికి చెప్పుడుమాటలు వినే స్వభావం వుంది. ఎవ్వరూ లేనిపోని మాటలు చెప్పి తన తండ్రికీ, మేనమామకీ తగాదా పెట్టి వుంటారు.

అత నిలా ఆలోచిస్తూవుంటే మేనమామకి అనుమానం వేసింది అన్నమాట ఎక్కడ జారతాడోనని. అందుకని వెంటనే "సరేబాబూ నీయిష్టమొచ్చినట్లే చెయ్. అన్నీ తెలిసినవాడివి. నీకు నే చెప్పేదేముంది?.... ....మరి ఇవ్వాళే రాతకోతలుపూర్తిచేసుకుందామా?" అనిఅడిగాడు.

సీతారామారావు తనకు రావలసిన నలభై వేలకుగాను పది ఎకరాలు రాయించుకొని పరిష్కారం చేసుకున్నాడు. అత్తా మేనమామలు అతన్ని దీవించి పంపారు. ఊళ్ళో వాళ్ళంతా వూరుబయటికి సాగనంపి సెలవు తీసుకున్నారు.

ఆకోజుల్లో వొకరికి సహాయం చెయ్యామంటే పరమానందంగా వుండేది. ప్రతివాళ్ళూ అతన్ని గౌరవిస్తూ వుండేవాళ్లు. ఇంతకంటే ఏంకావాలి! బతికిన నాలుగురోజులూ యిలా బ్రతికితే చాలదూ! పదిమందితో మంచనిపించుకొని పొమ్మన్నారు పెద్దలు.

"ఇంత చిన్నతనంలో యింత బుద్ధివుండటం ఎక్కడా చూడలేదు" అన్నారు అంతా.

"అది వాళ్ళ వంశంలోనే వుంది" అని వాళ్ళల్లో వాళ్ళే జవాబు చెప్పుకొన్నారు.

తండ్రికోరెక్కు నెరవేర్చాననే ఆనందం, వంశంపేరు నిలబెట్టాననే గర్వం అతనికుండేవి ఆరోజుల్లో.

ఆవూళ్ళోనే రామయ్యఅనే వృద్ధుడొకడుండేవాడు. అతన్ని అంతా 'తాతా' అని పిలుస్తుండేవాళ్ళు. అతనికి సీతారామారావు కుటుంబమంటే తగని అభిమానం.

"బాబూ! కుర్రవాడివి. ప్రపంచానుభవం తక్కువ. కొంచెం తెలిసి మెలగాలి" అని సలహా చెబుతుండేవాడు.

"నేను తెలిసే చేస్తున్నా తాతా!" అనేవాడు సీతారామారావు.

"చేతులో నాలుగురాళ్ళుంటే అంతా మూగుతారు. తరువాత మనమొగం చూచేవాళ్ళుండరు బాబూ!"

"మళ్ళీ మొఖంచూస్తారనే ఆపేక్షతో నే నీపన్ను చెయ్యటంలేదు తాతా! చెయ్యటంకోసమే చేస్తున్నాను."

"పశ్చాత్తాప పడవలసిన పనులేవీ చెయ్యకు బాబూ! పశ్చాత్తాప పడవలసివొస్తే, హృదయంలో తేళ్లూ, జెర్రులూ నివాసం ఏర్పరుచుకుంటాయి. నువ్వప్పుడు మంచిపను లనుకునేవన్నీ ఎదురుతిరుగుతై. ఇప్పుడు నీవల్ల సహాయం పొందేవాళ్ళనే విరోధం చేసుకుంటావు. నీమంచే నీ పతనానికి కారణ మవుతుంది."

"నేను ప్రతిఫలం కోరటంలేదు తాతా!"

"అది వొక్కటే చాలదు బాబూ!" అనేవాడు రామయ్య తాత.

అతడు చిన్నతనంలో చాలా ఫున్నతమైన ఆశయాలు కలిగిఫుండేవాడు. ఆదర్శయుతమైన జీవితం గడపాలని ఊహించుకొంటూ ఫుండేవాడు-నిత్యం ప్రయత్నిస్తూ ఫుండేవాడు. భావనలో, పలుకులో, ప్రవర్తనలో అతని అభిలాష వ్యక్తమవుతూ ఫుండేది.

మిగిలిన వాళ్ళంతా నిత్యజీవితంలోని చిల్లర విషయాల్లో మునిగి తేలుతూఫుంటే అతను వాటికి అతీతంగా ఫుండి ఎప్పుడూ ఏదో ఒకటి ప్రశ్నించుకొంటూ ఫుండేవాడు.

తనచుట్టూ జరుగుతున్న కుటుంబజీవితం అతని మనస్సుని ఎక్కువకష్టపెట్టేది. పెళ్ళిచేసుకోవటం, పిల్లల్ని కనడం ఆరోగ్యంచెడగొట్టుకుని యీసురోమని తిరగటం,పిల్లలకోసం నీచంగా తాపత్రయపట్టం—అతని మెత్తని హృదయానికి గంట్లుపెట్టేవి. కొంతమంది ఆడవాళ్లు కర్కశంగా తిరగటం, నీళ్ళాడేటప్పుడు వాళ్లుపడేబాధ, పిల్లలకు వాళ్ళుచేసే సపర్యలూ చూస్తే అతనికి పరమ అసహ్యంగా ఫుండేది.

ఎంతఆలోచించినా మనుష్యులు ఏసుఖంకోరి పెళ్ళిళ్లు చేసుకుంటున్నారో అతనికిబోధపడేదికాదు. పెళ్ళైననాలుగో రోజునుంచీ భర్త భార్యకు కష్టపెడుతూనే ఫుంటాడు. భార్య కూడా ఫుడతా భక్తిని తానూ అతనికి కష్టం కలిగిస్తూనే

ఉంటుంది. "ఇంత పొద్దుపోయి వచ్చారేం ? అన్నులెండి మీకిప్పుడు కాపరం కావలసి వచ్చిందా?" అంటుంది.

"రత్తమ్మ వదినా-నాసంగతి నీకు తెలుసుగా! కాపరాని కొచ్చి యిన్ని యేళ్ళయింది కదా, ఎన్నడయినా గడపదాటి ఎరుగుదునా ? పరపురుషుడి మొఖమయినా చూచి ఎరుగుదునా? మరెందుకో వారికి నామీద యింత కోపం" అని ప్రచారం మొదలు పెడుతుంది.

అనుక్షణం, 'ఏనుయ్యో, గొయ్యో చూచుకుంటా' నని బెదిరిస్తుంది.

భర్తవిూదకోపం పిల్లల్ని కొట్టి తీర్చుకుంటుంది కాని మానవులుమాత్రం పెళ్ళిళ్ళు మానుకోరు. పోనీ పోరపాటు పడుతున్నామేమో అనుకుంటే అన్నీ తెలిసినవాళ్ళే మూడు నాలుగు పెళ్ళిళ్ళు కూడా వొకదాని తరువాత వొకటి చేసుకోటానికి ఏమాత్రం సంకోచించటంలేదు.

అతనికిమాత్రం కుటుంబజీవితం అమిత రోతగా వుండేది. ఇల్లాలు నీళ్ళాడినప్పుడే కాక సంసార మెప్పుడూ పురిటికంపు కొడుతూవుండేది. కొంతమంది ఆడవాళ్ళు ఎప్పుడో గాబోయే కాన్పుకనే పుట్టబోయే పిల్లవాడికి పక్క కింద కనీ పెళ్ళయిన దగ్గరనుంచీ చిరిగిపోయిన గుడ్డలు పోగు చేస్తూవుంటారు. గర్భిణి వచ్చినప్పటినుంచీ బియ్యం పోసుకొని, తీరిగ్గా కూర్చొని మట్టిగడ్డ లేరుకొని తింటూ వుంటారు. ఇవన్నీ అతనికి కంపరం పుట్టించేవి.

తండ్రులు కూతుళ్ళకు మొగుళ్ళను వెతకటం అతనికి చాలా హేయంగా కనపడేది. మా అమ్మాయి పుట్టిగా

వుంటుంది. పీలగావుండే కుర్రవాడు పనికిరాడని పిల్లతండ్రి చెపుతూవుంటే అతనికి పలు ప్రదర్శనాలు జ్ఞాపకానికివచ్చేవి.

ప్రత్యక్షంగా కళ్ళతో చూస్తూ పెళ్ళి ఎలా చేసుకోవటం ? చేసుకుంటే తన ఆదర్శం ఎలా చెల్లుతుంది ? అందుకని, ఆలోచించి ఆలోచించి, ఏ పరిస్థితుల్లోనూ పెళ్ళి చేసుకోకూడదని నిశ్చయం చేసుకున్నాడు.

స్నేహితులుగానీ బంధువులుగానీ యీ ప్రస్తావన తెస్తే "నా కేమిటి ? పెళ్ళేమిటి ?" అనేవాడు. తననూ అందర్ని చూచినట్లు చూట్టం అతనికి కష్టం వేసేది.

వాళ్ళు తెలివిగా నవ్వుతూ "మేమూ యిట్లా అన్న వాళ్ళమే లేవోయ్" అనేవారు. అతనిమాట నమ్మేవాళ్ళు కాదు. "చెప్పుదూ ! నువ్వు అంగీకరిస్తే రత్నంలాంటి పిల్లను తెచ్చి చేస్తాం" అనేవాళ్ళు.

అతను మనస్సులో కలవరపడి, "నేను సుఖపడటం మీకు ఇష్టంలేదా?" అని గంభీరంగా ప్రశ్నించేవాడు.

"అయితే ఎక్కడన్నా ఏర్పాటు చేశావా యేమిటోయ్ ?" అని ప్రశ్నించేవాళ్ళు, స్నేహితులు చాలా కుతూహలంగా.

అతను గుక్క తిప్పుకొని, "మీకు అర్థంకాదు" అనేవాడు.

* * *

అటువంటి అతను పెళ్ళి చేసుకుంటున్నాడని తెలిసే టప్పటికి స్నేహితులూ బంధువులూ విస్తుపోవటంలో

ఆశ్చర్యం ఏముంది ? ప్రతివాడూ వచ్చి అతన్నే అడిగే వాడు, యదార్థం తెలుసుకోవాలనే ఉద్దేశంతో.

"ఏమోయ్ పెళ్ళి చేసుకుంటున్నావట, నిజమేనా?"

"ఆఁ — చేసుకుంటున్నాను."

"ఏం ఇలాచేశావు ?"

"నేను పెళ్ళికి ఒక నూతనార్థం కల్పిస్తాను."

"ఏమిటది ?"

"నేను మీరుందరికిమల్లే ఈ యంత్రానికి బానిసను అవను. దాన్ని నా సిద్ధాంతానికి వుపయోగించుకుంటాను."

"ఎట్లాగో కొంచెం చెప్పు !"

"మీరే చూస్తారుగా !" అనేవాడు. తన అభిప్రాయాలు వాళ్ళతో చర్చించటానికి అతనికి యిష్టంలేదు.

అసలు సంగతేమంటే: అప్పుడతను గురుకులంలో చదువుకుంటూన్న ఇందిరను ప్రేమించటం జరిగింది. పెళ్ళి చేసుకోకపోతే ఏం చేసేట్టు ? పెళ్ళి చేసుకోకపోతే ఆమె దగ్గరికి రానివ్వదు. పైగా ఆమె తండ్రి పోలీసు ఉద్యోగి. కాబట్టి పిల్లలు కలుగకుండా జాగ్రత్తపడి, తన భార్యక్కూడా స్వాతంత్ర్యం యిస్తే, పెళ్ళిలోవున్న చెడు తనకు అంటదను కున్నాడు. 'ఆమె జీవితం ఆమెది, తన జీవితం తనది. మధ్య మధ్య ఆనంద డోలికలు.... ....' అనుకున్నాడు.

కాని అతను అనుకున్నట్లు యేదీ జరగలేదు. సంవత్సరం తిరిగివచ్చేటప్పటికి పొత్తిగుడ్డలు కరువైనై. తన భార్య బియ్యంలో మట్టిగడ్డలు ఏరటం మొదలుపెట్టింది. అతనికి ఒక అడశిశువు జన్మించింది. ఆనాడు అతను పడ్డ

బాధ పైన భగవంతుడికీ క్రింద భూదేవికీ తెలియాలి. భార్య నొప్పులు పడుతుంటే, "ఈ హింసకు నేనే కారణం; నేను బ్రహ్మరాక్షసిని, మహాపాతకిని" అని తన్ను తాను తిట్టుకుంటూ కన్నీరు కారుస్తూ కూర్చున్నాడు. వారణ యం తం తన్ను వశం చేసుకుంటున్నదని గ్రహించాడు. కాని ఏం లాభం? ఐదు సంవత్సరాలు దాటేటప్పటికి యిద్దరు పిల్లలు కలిగారు; మూడు గర్భస్రావాలు జరిగినై.


అతడు జీవితం చేతులలో కీలుబొమ్మ అయ్యాడు. పరిస్థితులు తారుమారైనాయి. ఉద్యోగం చెయ్యక తప్పింది కాదు. అతని మామ ఒక పెద్దఫరంలో గుమస్తాగిరి యిప్పించాడు. "మా అలుడు .... కొంచెం చాదసుడు. ఒక కంట కనిపెడుతూ ఉండండి" అని మేనేజరుతో చెప్పిపోయ్యాడు.

"ఇకనైనా జాగ్రత్తగా ఉండు. అప్పుడప్పుడూ మేనే జరు ఇంటికి వెళ్ళి వస్తూండు. పెద్దవాళ్ళదర్శనంచేసుకోవడం ఎప్పటికైనా మంచిది" అని అతనికి బోధించి వెళ్ళాడు.

తన మామ సహాయంతో పొట్ట పోసుకోవలసి వచ్చినందుకు చాలా కించపడ్డాడు. తన మామకి తను ఎంత లోకువ అయిఉంటాడు! తనభార్య తనను గురించి ఏమనుకుంటుంది?

స్నేహితులు కొంచె నవ్వులు నవ్వటం మొదలు పెట్టారు. ఒకరిద్దరు "ఇదేనా నీవు పెళ్ళికి కల్పించిన నూతన అర్థం?" అని అడిగారు. "నీ మాట నీవు నిలబెట్టు కున్నావు ... నువ్వు పెళ్ళికి బానిసవయ్యావా ఏమిటి, మామకు అయ్యావు కాని" అన్నాడు కొందరు.

అతనికి మామిదిద కోపం వచ్చింది. అ స్తమానం ఆయన్ని గురించే ఆలోచించేవాడు. ఆయన లేకపోతే అతని కూతురు ఉండేది కాదు: అతని కూతురు వుండకపోతే తనకో పెళ్ళి వుండేది కాదు, తనకు పెళ్ళి లేకపోతే ఈ బాధలు వుండేవి కావు. అతనికి ఒక్క క్షణం ఈ ప్రపంచం మామల మయంగా కనిపించింది. కనపడ కుండా వుండి ఈ ప్రపంచాన్ని నడుపుతున్నాడు వాళ్ళు. అతను ఉద్యోగం చెయ్యలేక పోయ్యాడు.



ఒకరోజు ఆఫీసులో ఎక్కౌంటు పుస్తకం ముందు వేసుకొని లెక్కలు రాయడానికి బదులు మార్జిన్లో ఈ బొమ్మ గీశాడు:-

అది చూచి మేనేజరు మండిపడుతూ- "ఇదేమిటి?" అని అడిగాడు.

"మామ!" అని యికిలించాడు సీతారామారావు.

"ఎవరి మామ?"

"మీ మామకూడా ఇలాగే వుంటాడా ఏమిటి! ఇహిహిహి... ఒకరి మామ ఏమిటి! అందరి మామాను పిల్ల నిచ్చే మామ. చూశారా వీడి తల పెద్దది-కళ్ళు చిన్నవి-

చేతులు సన్నం - ముక్కు పెద్దదే ... ... ఇహ్హిహ్హా ... "
అని తను గీసిన బొమ్మ చూపుతూ చెప్పాడు.

అతనికి అనాళ్ళే ఉద్యోగం ఊడింది అసలే మేనేజరు అతనిమీద కోపంగా వుంటున్నాడు. మొన్న కూతురు రైలుకు వెళుతుంటే బండి తీసుకురమ్మని సీతారామారావుకి చెపితే 'నేనా, బండా? నీకూతురికా!' అన్నాడు. అది మనస్సులో పెట్టుకొని మేనేజరు డిస్‌మిస్ చేశాడు సీతారామారావుని. ఉద్యోగం ఊడిందని తెలియగానే మేనేజరు దగ్గరకు వెళ్ళాడు సీతారామారావు. ప్రాధేయపడ్డానికి వచ్చాడనుకొని బిరబిగిసి కూర్చున్నాడు మేనేజరు.

"ఏదీ మా మామ బొమ్మ" అని అడిగాడు సీతారామారావు.

"ఎందుకు ?"

"మీసాలు పెట్టిపోతాను. పోలీసు ... మీసాలు"
అని చప్పట్లు కొడుతూ, గంతులువేస్తూ అడిగాడు.

మేనేజరుకి ఏమీ తోచలేదు. వెర్రిగాచూస్తూ కూర్చున్నాడు.

"నీ కూతురికి బండి దొరికిందా ?" అని అడిగాడు సీతారామారావు.

"....."

తన ప్రశ్నకు మేనేజరు గుడ్లప్పజెప్పి కూర్చోవటం చూస్తే సీతారామారావుకి హుషారెక్కింది. "కూతుర్ని అల్లుడిదగ్గరకుపంపటం, అల్లుడు గర్భిణిచేసి మళ్ళీ నీకూతుర్ని నీ దగ్గరకు పంపటం, నీవు సీమ్ంతం జరిపించి మళ్ళీ అల్లుడిదగ్గరకు

పంపటం,అతడు మళ్ళీ గర్భిణిచేసి నీదగ్గరకు పంపటం, నీవు నీళ్ళాడించి మళ్ళీ అతనిదగ్గరకు పంపటం, అతను మళ్ళీ నీదగ్గరకు పంపటం, నీవు అతని దగ్గరకు పంపటం-అతను నీదగ్గరకు పంపటం - ఇదేనటయ్యా నువ్వు చేసేపనీ?" అని ముక్కుమీద వేలు వేసుకొని, ఇంటిమీద కప్పు ఎగిరి పోయేటట్లు నవ్వి, వెళ్ళిపోయాడు.

ఇతరులు ఎవరయినా ఉద్యోగం ఎందుకుపోయిందని అడిగితే, 'మామామ డిస్మిస్‌చేయించాడు'అనిచెప్పేవాడు.

ఇక మళ్ళీ అతను ఉద్యోగం కోసం ప్రయత్నించ లేదు. అప్పుడతనికి ఒక్క మామమీదే కాదు, ప్రపంచం మీదే కోపంగా ఉండేది. తనదగర సహాయం పొందినవాళ్ళు తన దగ్గరకు రావటగాంనీ, తనతో మాట్లాడటం గానీ, ఎప్పుడో మానివేశారు. దేవుడికి ఉత్సవం చేయించనందుకు, స్నేహితులలో ఉచితభోజనం ఏర్పాటుచేయించనందుకు నిందించటం మొదలు పెట్టారు. "ఉన్ననాళ్ళూ కన్ను మిన్ను కానకుండా ఖర్చు పెట్టాడు. ఇప్పు డనుభవిస్తున్నాడు" అన్నారు. ఖర్చు పెట్టాడంటే ఎవరికోసం పెట్టాడు? మన కోసం పెట్టాడా? తన పేరుకోసం, పదిమందితో మంచివా డనిపించుకోడానికి పెట్టాడు !" అని ఈసడించేవాళ్ళు.

అతనికి ప్రపంచంమీద కసిగా వుండేది. ఇదివరకు తన్ను ఎరిగిన వాళ్ళతో మాట్లాడ బుద్ధి అయ్యేదికాదు. తన సహాయం పొందినవాళ్ళ కంటపడకుండా తానే తప్పుకు తిరుగుతుండేవాడు. ఉండి ఉండి ఆకసి అనేకవిధాల బయట పడుతుండేది, తరచు భార్య గురి అవుతూవుండేది.

గు ర్రపుబండికి స్టేషన్నుంచి తన ఇంటికి పావలా మామూలు. కాని తనదగ్గిర అర్ధరూపాయి వసూలుచేస్తారు.

"మా రాజులు ఇవ్వాల, మేం తినాల" అంటారు. తను కాదనలేడు. వాళ్ళతో బేరం చెయ్యలేడు? ఇంట్లో వెళ్ళి ఏకో ఒక వంకబెట్టుకొని భార్యతో తగాదా పెట్టుకుంటాడు.

అప్పుడప్పుడూ తప్పక కూరగాయల మార్కెట్టుకి వెళ్తాడు. తను కూరగాయలు తేవటం ఎవరన్నా చూస్తున్నారేమో అని, సంచి మడిచి జేబులో పెట్టుకుని వెళతాడు. అవీ ఇవీ కొనుక్కొస్తాడు. బేరం చెయ్యడు, మంచిచెడులు చూడడు, నాలుగుకొట్లు తిరగడు. ఎవరు ఎక్కడ చూచి పోతారో అని చేతికందినవి కొనుక్కొని వొచ్చేస్తాడు. సంచి గొంతుల వెంటపడి ఇంటికి వొచ్చేస్తాడు. ఇంటికి రాగానే భార్య ఒక్కసారి కూరలుచూచి "అన్నీ పుచ్చులే!" అంటుంది."

అతనికి చిర్రున కోపం వస్తుంది. తనుపడ్డ శ్రమకి ఇదా ప్రతిఫలం!

"వంకాయలు పావలా. ఇంటికి వొచ్చి ఇచ్చిపోతున్నారు!" అంటుంది.

"అయితే నేను డబ్బు కాజేశానంటావా?అంటాడు." పోట్లాడతాడు. ఈగుణం నీవంశంలోనే ఉందంటాడు.

"నీ తండ్రి పోలీసు వుద్యోగికాదూ? నోడిపెట్టలు లంచాలు తీసుకునేవాడు కాదూ? అంతా అంతే అనుకుంటావు."

ఆ డబ్బు చీరె కొనుక్కోమని ఆమెతండ్రి యిచ్చి వెళ్ళిన డబ్బు. అది తనకోసం ఖర్చుపెట్టుకుంటున్నానన్నే లోపల తపన ఈ విధంగా బయటపడుతుంది.

"సాయంకాలానికి బియ్యంలేవు" అంటుంది భార్య.

"నన్నేం చేయమంటావు?"

"తెప్పించండి!" అంటుంది భార్య.

ఈమాటకు తగాదా. కాని ఏమనితగాదా ఆడతాడు? ఈలోకంలో బియ్యం తేవలసిన బాధ్యత భర్తలమీద వున్నమాట నిజమేనాయె! బియ్యం అవసరమనే మాటా నిజమేనాయె!

"తెప్పించండి అంటం ఎందుకూ? తెండీ అనరాదూ! ఎవ్వరు తెచ్చేది? నేనేగా! ఆ సంగతి నీకు తెలియదూ? మనకుతోడు 'తెప్పించండి' అని డాబుసరికూడా ఎందుకూ? నీ డాబుసరితో నాకు చచ్చేరోజు వొచ్చింది."

"ఎందుకండీ అంతకోపం? ఇప్పుడు నేనేమన్నాను?" అంటుంది భార్య.

"కోపమా? పైగా నాకు కోపం అంటున్నావా? గుండెలు మరిగేమాటలు అనేదీనువ్వే, ఏమన్నా అంటేకోపం అనేదీనువ్వే! నువ్వనేమాటలన్నీ బాగున్నాయేం? నేనుసంపాదించటంలేదనేగా నీకీ అలుసు? ఇంతకీ నిన్ను అని ఏం

ప్రయోజనం - నాకు బుద్ధి లేదు!" అని కన్నీరు పెట్టుకుంటాడు.

ఆ రోజుల్లో అతనొక పాట రాశాడు.

పడగొట్టండోయ్
టాజ్ మహల్
తవ్వండయ్యో
తుగ్లక్ గోరీ
చిదిమెయ్యండోయ్
స్త్రీ సౌందర్యం
నలిపెయ్యండోయ్
పువ్వుల మొవ్వలు
దోచెయ్యండోయ్
ధనవంతుల
చంపెయ్యండోయ్
క్షుధార్తుల
రుధిరం రక్తం
చిందాలోయ్!
పుర్రెలు మెదుకులు
నవ్వాలోయ్!

* * *

అతను ప్రస్తుతం ఇల్లు కదలటం లేదు. ఇంటి నాలుగు గోడలే అతని జీవితానికి సరిహద్దులైనై. అతని మనస్తత్వం పూర్తిగా మారిపోయింది. ఏదో పనివున్నట్లు ఎప్పుడూ తిరిగే వాళ్ళని చూస్తే ఒకప్పుడు నవ్వు, ఒకప్పుడు కోపం కలుగుతూ వుండేది. అప్పుడప్పుడూ ఎవ్వరైనా కనబడి "ఏం చేస్తున్నావు?" అని అడిగేవారు.

"ఏముంది చెయ్యటానికి?" అనేవాడు.

ఈ జవాబు వాళ్ళకి విచిత్రంగా కనిపించేది. వాళ్ళు ఒక్క క్షణం నిలబడి ఆలోచించుకోరు. ఆలోచించుకుంటే వాళ్ళకే తెలుస్తుంది. వాళ్ళు అజ్ఞానులు. ఈ ప్రపంచం అజ్ఞానులకోసం చెయ్యబడ్డదే అవటంవల్ల వాళ్ళు సుఖపడుతున్నారు. హాయిగా జీవితం గడుపుతున్నారు.

అంతేగాని ఆలోచించి చూస్తే ఈ ప్రపంచంలో ఏముంది ఏంచెయ్యటానికైనా? యీ ప్రపంచం అనుక్షణం మారుతూవుంటుంది. కాని ఈమార్పు ఎందుకో ఎవ్వరికీ అక్కరకాదు. ఈమార్పుకి ఆదర్శం వున్నట్లు కనపడదు. ఇక మానవుడు చేసేది ఏమిటి?

కొంతమంది 'సంఘ సంస్కరణ,' 'విప్లవం' అంటూ తిరుగుతూ వుంటారు ఏదో ప్రబ్రహ్మాండమైన పనిచేస్తున్నట్లు వాళ్ళ రొమ్ములు విరుచుకొని కేకలు వేసుకుంటూ తిరుగుతూవుంటే, వాళ్ళని చూచినకొద్దీ జాలివేసేది సీతారామారావుకి. ఏమిటి వీళ్ళుచేసేది? సంఘానికి పరిపక్వదశ అనేది లేదుగదా! మరి దేనికోసం వీళ్ళ ఆర్భాటం?

ఒక సమస్యని పరిష్కరిస్తే, ఆ సమస్యాపరిష్కారంలో నుంచే మరొకసమస్య పుట్టుకొస్తుందని పెద్దలు చెప్పుతున్నారు. ఇదే ప్రపంచ పరిణామం అని కూడా అంటున్నారు. కాబట్టి ఎప్పటికప్పుడు మానవుల్ని బాధపెట్టే సమస్య వీదో ఒకటి ఉంటూనే వుంటుంది. కొంతమంది మానవులు బాధపడుతూనే వుంటారు. ఇక వీళ్లుచేసేదేమిటి,

తమ్మ్ల తాము మోసం చేసుకుంటున్నారా? ప్రజలను మోసం చేస్తున్నారా?

మరి ఇంతమంది నాయకులు, ఇంతమంది మేధావంప న్నులు, శాస్త్రవేత్తలు ఉన్నారే-వీళ్ళలతా యీమాత్రం తెలియకేనా ఇన్నికష్టాలు పడుతున్నారు? ఈ ప్రశ్నకు అత నికి వెంటనే జవాబు దొరికింది.

కుతనంలో ఉబలాటంకొద్దీ సంఘానికి సేవచెయ్యా లని బయల్దేరతారు.ఇప్పుడున్న సంఘంలో బాధపడేవాళ్లని చూచి ఉద్ధరిద్దామని బయల్దేరతారు. కొన్నాళ్ళకు తాము చేసే పనిపట్ల ఏమీ లాభంలేదని తెలిసినప్పటికీ వెనకు-తగ్గే అవకాశంవుండదు;లోకులకు యదార్థం చెప్పే ధైర్యం వుండదు.

అప్పటికే సంఘంలో వాళ్ళకు గౌరవస్థానం లభించి వుంటుంది. వాళ్ళమాటలు నమ్మి అనేకకష్టాలకు ఓర్చి అనేకులు వాళ్ళకు అనుచరులై వుంటారు. వాళ్ళకు ఏం చెప్పేటట్టు? 'నేను ఇదివరకు చెప్పింది అంతాతప్పు, అంటే వాళ్ళు ఊరుకుంటారా?అతని మాటలు నమ్మి తాముచేసిన స్వార్థత్యాగం, పడిన కష్టాలు అన్నీ ఒక్కసారి జ్ఞాపకం వొస్తే ఇంకేముంది? కొంపలు కూలిపోవూ?

అందుకని వాళ్ళకు సత్యం తెలిసినా పైకి చెప్పరు. యథాప్రకారం జీవయాత్ర సాగిస్తారు. చచ్చేవరకు తమకు నమ్మకం లేకపోయినా'సంఘసంస్కరణ 'విప్లవం'అంటూనే వుంటారు. ఈ విధంగా ఆలోచిస్తూ ఉండేటప్పటికి అప్పుడు పనిచేస్తున్న సంఘసంస్కర్తలంతా ఒక్కొక్కరే జ్ఞాపకం

వచ్చారు సీతారామారావుకి. ఒక కుర్రవాడు రాజకీయాలలో బాగా పనిచేస్తుండేవాడు. అటువంటి కుర్రవాడికి తన కూతురు నిచ్చి పెళ్ళిచేసి ఒక దేశనాయకుడు అతనిని రాజకీయాలలోనుంచి విరమింపచేసి, ఒక దినపత్రికలో ప్రవేశ పెట్టాడు. మరొక నాయకుడు కూతురికి ఉన్నత విద్యాభ్యాసం ఇప్పించి, రాజకీయాలలో ఎన్నడూ దిగే వీలులేని ఒకడికి ఇచ్చి వివాహం చేశాడు. మరొక దేశనాయకుడు తన కొడుకును ఇన్సూరెన్సు కంపెనీలో పెద్ద ఉద్యోగంలో ప్రవేశపెట్టాడు. తాముచేసే పనిలో, చెప్పేమాటల్లో తమకు నమ్మకముంటే ఈపనులెందుకు చేస్తారు ఆ దేశనాయకులు? అనుకున్నాడు సీతారామారావు. 'వాళ్ళ యిష్టానికి విడిచిపెట్టాం' అంటారు పైకి, కాని వాళ్ళతో మాత్రం 'మేం పడే కష్టాలు చూస్తున్నావుగా-తర్వాత నీయిష్టం!' అంటారు. ఇక వాళ్ళ యిష్టం ఏముంది?

ఈ రహస్యం తెలియని మూర్ఖులు, అమాయకులు, ఏదో వాళ్ళకి ఆ సహాయం చేస్తున్నాం, ఈ సహాయం చేస్తున్నాం అని కష్టపడుతూ వుంటారు. కానిఅన్నీ తెలిసిన తనెందుకు పడాలి? తనకేంపట్టింది? అతనికి వీళ్ళంటేనేకాదు-సంతోషంగా కాలంగడిపే ఎవ్వర్నిచూచినా హాస్యాస్పదంగానే ఉండేది. ఏం చూసుకొని వాళ్ళంత సంతోషపడుతున్నారో అర్థం అయ్యేదికాదు. "కుర్రాళ్ళు, అమాయకులు" అనుకునేవాడు. ఒకప్పుడు రామయ్యతాత తనకు చెప్పినమాటలే తను ఇప్పుడు ఇతరులకు చెప్పటం మొదలు పెట్టాడు. వాళ్ళేమన్నా అంటే "ఒకప్పుడు నేనూ ఇట్లానే

అనుకున్నవాణ్ణి" అనేవాడు. ఒకప్పుడు తనకు తన స్నేహితులు చెప్పినమాటలే ఇప్పుడతను ఇతర్లకు చెపుతున్నాడు.

"ఈ ప్రపంచంలో మనం చెయ్యదగింది ఏమీలేదు" అనేవాడు.

"ఆసంగతి మాకు తెలుసు" అనేవాళ్ళు కొంతమంది కుర్రవాళ్ళు.

"తెలిస్తే మరి మీరేమిటి చేసేవి?"

"మాకు యేది సుఖమనిపిస్తే అది చేస్తున్నాం."

"సుఖమంటే ఏమిటి? సుఖం ఎక్కడుంది? మృగాలకంటే మీరు సుఖంగా ఉన్నారని మీరుచెప్పగలరా? సుఖం బుద్ధిలోవుంటుంది; తృప్తిపట్టాలో ఉంటుంది. రాత్రింబగళ్ళు పొలాల్లో పనిచేసే కూలివాడికంటే ధనవంతుడు సుఖపడుతున్నాడని ఎవ్వరు చెప్పగలరు? సర్వసంగపరిత్యాగికన్నా భోగి సుఖపడుతున్నాడని ఎవ్వరు చెప్పగలరు? అజ్ఞానికంటె జ్ఞాని సుఖపడుతున్నాడని యెవ్వరు చెప్పగలరు? ఆలోచించి చూస్తే ఈ ప్రపంచంలో నిజంగా సుఖపడేది అజ్ఞానే అని తేలుతుంది. అజ్ఞానిని ఆలోచనలు వేధించవు. తినకు అందని ఆదర్శాలతో హైరానపడడు. అతనికున్నసుఖం మరెవ్వరికీ ఉండదు" అనేవాడు.

ఆకర్షవంతంగా అలంకరించుకొని, అందంగా ఉండే ఆడవాళ్ళనిచూస్తే, అతనికి మరీ కంపరం పుట్టేది. "ఏం చూసుకొని వీళ్ళకీ నిక్కు? వీళ్ళూ మామూలు ఆడవాళ్ళకు మల్లే రోజూ కాలకృత్యాలు తీర్చుకునేవాళ్ళేగా!" అనుకునేవాడు.

అతడు అనేక దృశ్యాలు ఊహించుకునేవాడు. ఊహించుకున్నకొద్దీ ఆ ఆడవాళ్ళు ఇళ్ళల్లో చేసేపనులన్నీ వికారంగా కనిపించేవి.

వీళ్ళల్లో ఒకామెకి ఏదోకష్టం వొచ్చింది. మామూలు ఆడదానికి మల్లే ఈ అందమైన ఆకర్షవంతం అయిన స్త్రీ కూడా కళ్ళవెంట నీళ్ళు కార్చుకుంటూ చీదివేస్తూ వుంది.

ఇటువంటి విషయాలన్నీ జ్ఞాపకం తెచ్చుకుని తనలో తాను నవ్వుకునేవాడు. ఇటువంటివాళ్ళు ఆకర్షవంతంగా అలంకరించుకోటానికి సిగ్గువెయ్యదు కాబోలు! పైగా వీళ్ళకి అందంగా వుంటామని ఒకొక్కళ్లకీ పుట్టెడు పుట్టెడు గర్వం. ఎందుకో! మళ్ళీ నవ్వుకునేవాడు.

వీళ్ళవెంట తిరిగే కుర్రవాళ్ళనిచూస్తే అతనికి మరీ మండేది. వాళ్ళకోరిక్కలు తీర్చటమే వీళ్ళపని. వాళ్ళవెనక తిరగటమే వీళ్ళకు గొప్ప. చెంగు తగిలేస్తే చాలు పరవశత్వం పొందుతారు.

"ఎందుకట్లా తిరగటం?"

"ఆమె ఎంత అందంగా ఉంటుం దనుకున్నావు!" అంటూ అంగలారుస్తారు.

"ఏమిటి అందం? మిగిలిన ఆడవాళ్ళలో లేనిదీ, ఆమెలో వున్నదీ ఏమిటి?"

"నీకు తెలియదు"

తాను ప్రేమించినప్పుడు ప్రేమించలా? వీళ్ళందరి కంటే ఎక్కువగానే ప్రేమించాడే! ఏమిటి తనకు తెలియుంది?

"మీరిది చాలా గొప్పవిషయం అనుకుంటున్నారు. పశువులకూ మీకూ భేదం ఏముంది ?పశువులింకానయం" అని చీదరించుకునేవాడు.

"నీకు హృదయంలేదు." అంటారు.

ఈమాటకు అతనికి కోపం వొచ్చేది. యోగిని అయింతర్వాత చింతామణి పాడిన సీసపద్యం పాడబుద్ధి అయ్యేది.

'ఇది ముక్కా అనుకుంటున్నారేమో - కాదు, జలుబు చేసినప్పుడు చూడండి.

ఇవి కళ్ళు అనుకుంటున్నారేమో — కాదు, రెండు తూట్లు.

ఇవి స్తనాలు అనుకుంటున్నారేమో-కాదు,మాంసం ముద్దలు.

ఇది మన్మథస్థానం అనుకుంటున్నారేమో - కాదు, తోలుబొక్క!'

ఈ వేదాంత సారంవాళ్ళకుబోధించి రోగం కుదర్చాలనుకునేవాడుగాని, తన్ను మరీ అసహ్యించుకుంటారేమో నని భయపడి పస్తాయించేవాడు.

తను చదువుకునేరోజుల్లో అడవాళ్లు ఒక పెద్ద బస్సు నిండా ఎక్కి చదువుకోడానికి కాలేజీకి వెళ్తూండేవాళ్ళు. వాళ్ళమధ్య కూర్చోబుద్ధి అయ్యేది అతనికి. తానుకూర్చున్న తర్వాత బస్సు బోల్తాకొట్టాలనీ, ఒకళ్లకు మొహం దోక్కపోవాలనీ, ఒకళ్ళకు బుగ్గలు చీరుకుపోవాలనీ, ఒకళ్లకుకాళ్ళు

విరగాలనీ అనిపించేది. అట్లా తయారైనవాళ్ళని ఊహించుకుంటే అతనికి ఎందుకోగాని చాలా సంతోషంగా ఉండేది. కాని, అట్లా కోరటం తప్పని, ఆ భావాన్ని బలవంతంగా అణచుకునేవాడు. పైకి రానిచ్చేవాడుకాదు ఇప్పుడు మళ్ళీ అదే భావం వివిధ రూపాలతో బహిర్గతం అవుతూంది. దాన్ని ఆపే శక్తి ఇప్పుడతనికి లేదు.

అతడు అనేకరకాలైన ఆలోచనలతో మథనపడి చివరికి అసలు ఆలోచించటమే తప్పనే నిర్ణయానికి వొచ్చాడు. అతి చిన్నవిషయాన్ని గురించి దీర్ఘంగా ఆలోచించటమే తన బాధలకు మూలకారణం అనుకున్నాడు. తీరికఉంటే ఆలోచనలు రాకతప్పవు. తీరికలేకుండా చేసుకోటానికి కాయకష్టం మొదలుపెట్టాడు. ఇంట్లో పనులన్నీ అతనే చేసుకోవటము మొదలుపెట్టాడు. దొడ్డినిండా కూరగాయల పాదులుపెట్టి అస్తమానం వాటికి నీళ్ళుపోస్తూ కూర్చునేవాడు. ఈ పద్ధతి మొదట్లో బాగానేవుంది అనిపించిందిగాని కొద్దిరోజులు గడిచేటప్పటికి బలహీనం ఎక్కువైంది. కాయకష్టంపడే అలవాటు అతనికి లేకపోవటంవల్ల శరీరంలో వేడి ఎక్కువై నిస్సత్తువగా ఉండేది. ఎప్పుడూ వొళ్ళంతా నొప్పులుగా ఉండేది. వీట్లవల్ల అతనికి కోపం, చిరాకు ఎక్కువైనై. కుటుంబజీవితం దుర్భరం చేసుకోవటం మొదలుపెట్టాడు. చీటికి మాటికి భార్యను తిట్టేవాడు. కూతుర్ని కొట్టేవాడు.

రామయ్యతాత ఒకనాడు, "ఇది నీకు తగదు అబ్బాయి" అని చెప్పాడు.

"ఎవరిపనివాళ్ళు చేసుకోవటం మంచిదేగా తాతా!"

"ఇది నువ్వు చెయ్యవలసిన పనికాదు."

"ఎందుకని?"

"నీకు అలవాటు లేదుబాబూ! ఏదైనా ఉద్యోగం సంపాదించుకొని హాయిగా కాలం గడుపు" అన్నాడు.

"ఈ జీవిత జంఝాటం నేను పడలేను తాతా!"

"మరి తప్పదు బాబూ. ఎక్కడికిపోయినా అది వెంట పడుతూనే ఉంటుంది. బతికినన్నాళ్ళూ ఏదో ఒక రకంగా జీవితంలో పోల్లాటలసిందే! మనం దేనికి పనికి వస్తామో తెలుసుకొని ఆపని చేస్తూవుంటం మంచిది."

"ఎప్పుడో ఒకసారి అందరం చావవలసిందేగా?"

"అవును బాబూ..."

"ఇక ఈ తాపత్రయం ఎందుక?"

"చచ్చి ఏం చెయ్యాలో తోచక బాబూ."

"ఈ కష్టాలుండవుగా!"

"ఈ సుఖాలూ ఉండవు; ఏమీ ఉండదు. ఏమీ లేందానికన్నా ఈ జీవితమే మెరుగని కొందరి అభిప్రాయం. ఇంకొక సంగతికూడా చెపుతాయ. ఇప్పుడు చాలామంది కష్టాలనుభవిస్తున్న మాట నిజమే. కాని ఎప్పటికైనా కష్టాల్లేని జీవితం మానవుడికి లభించకపోతుందా? అదే ఆశ చాలామందికి ఉంది. ఎవరికి తోచిన విధంగా వారు ప్రయత్నిస్తున్నారు.

కాని చచ్చిమాత్రం చేసేదేముంది బాబూ! ఒక్కళ్లు చచ్చినంత మాత్రాన ఈ ప్రపంచ సమస్య తేలేదేముంది?

పుట్టేవాళ్లు పుడుతూనే వుండిరి. ఏది అశాశ్వతం అయినా మానవుడు ఈ ప్రపంచంలో వుంటం శాశ్వతమే! అది తప్పదు కాబట్టి ఎవరిపని వాళ్ళు చేసుకుపోతూ వుండాలి. అలా చెయ్యనివాడు తనకు తాను బరువు అవుతాడు."

అతనికి ఏమీ తోచటంలేదు. ఎంత చిన్న విషయాన్ని గూర్చి అయినాసరే అతనొక నిశ్చితాభిప్రాయానికి రాలేకుండా వున్నాడు. మనస్సు పరిపరి విధాల పోతూవుంది. ఆలోచనలతో అతలాకుతలం అవుతూ వుంది మనస్సు.

ఒకప్పుడు ఒక అభిప్రాయం మంచిది అనుకుంటాడు. మరుక్షణం దానికి వ్యతిరేకమైన అభిప్రాయం మెరిచిగా తోస్తుంది. ఒకపని చేద్దామని మనస్సులో అనుకొని, దానికి వ్యతిరేకమైనపని తనకు తెలియకుండానే చెయ్యటం మొదలు పెడతాడు. మధ్యలో తాను ఇంకొక విధంగా సంకల్పించుకున్నట్లు జ్ఞాపకం వొస్తుంది. "పోనీ, ఇదే మంచిదేమో! లేకపోతే ఎందుకు చెయ్యబుద్ధి అవుతుంది!" అనుకుంటాడు.

కాని వెంటనే, "అదీ ఇదీ మంచివి ఎట్లా అవుతయి— అదో ఇదో మంచిదవ్వాలి గాని?" అనిపిస్తుంది. చేసేపని ఆపి, ఆలోచించటం మొదలుపెడతాడు.

"ప్రపంచానికి ఒక ఆదర్శం లేదు గనక, ఏ పనికీ ప్రయోజనం లేదు గనక, అన్నిపనులూ మంచే, అన్ని పనులూ చెడే! పెద్దలు ప్రతీ విషయానికీ బహు ముఖాలుంటవి అంటారు. అంతేగాని ఇది మంచీ, ఇది చెడూ అనేదిలేదు. చూట్టంమీద ఆధారపడి ఉంటుంది.

"చూచి, లేనిదిఒకటి కల్పించుకొని బాధపడిందాని కంటే అసలు చూట్టమే మానుకుంటే!"

అతని హృదయసీమలో హఠాత్తుగా ఒక భావం విరిసేది. "అసలు ఏదో ఒకటి చెయ్యాలనుకోవటంలోనే యీ చిక్కులన్నీ వొస్తున్నయ్యేమో?"

మెదలకుండా కూర్చునేవాడు.

"మనస్సు పరిపరివిధాల పోనివ్వకు, చిక్కబట్టు" అంటారు పెద్దలు. పరిపరివిధాల ఆలోచించేదే తనైనప్పుడు ఇక చిక్కుబడ్డి దెవ్వరు?

పరిస్థితులవల్ల భావాలు మారతాయి; పరిస్థితులు మార్చుకోమని సలహా చెప్పుతారు కొందరు. పరిస్థితుల వల్ల, పరిస్థితులు మార్చుకునే శక్తిలేక తను పడివుంటే. ఇక పరిస్థితుల్ని మార్చేదెవరు?

చూసేదాన్ని చూడు అంటారు వేదాంతులు. చూచేదే తనైనప్పుడు, చూసేదాన్ని తనెట్లా చూస్తాడు?

అతని జీవితం గొడవైపోయింది. తల ఆలోచనల పుట్ట అయింది. తలేకాదు—అతని జీవితమే ఆలోచనల గూడు. ఎప్పుడూ ముసుగు పెట్టుకొని పడుకొని, కళ్ళు మూసుకొని బాహ్య ప్రపంచాన్ని మరచిపోయి ఆలోచించేవాడు ప్రశ్నమీద ప్రశ్న పుట్టుకొచ్చేది. కాని ఏవొక్క ప్రశ్నకీ సరైన జవాబు దొరికేదికాదు.

ప్రస్తుతం కళ్ళుమూసుకొని ముసుగు పెట్టుకొని పడుకోవటమే అతని జీవితం.

రెండో ప్రకరణం

అసమర్థుని భార్య

పొయ్యిలో బూడిద ఎత్తివేస్తూ, "పాప! ఇంటి ముందు కొంచెం ముగ్గు వెయ్యమ్మా"అని చెప్పింది కూతురితో సీతారామారావు భార్య.

ఇంకా బాగా తెల్లవారలేదు. ఆలస్యం అయితే వొచ్చే పొయ్యే జనంవల్ల వీలుండదని చీకటితోనే ఇంటి ముందు వూడ్చి, కళ్ళాపిజల్లి, ముగ్గువెయ్యటం ఆమెకు అలవాటు. ఈమధ్య ఆమె మాసిన బట్టకట్టుకుని బయటకు వొస్తే, సీతారామారావు మండిపడ్డాడు. "నా పరువు తీసి వెయ్యటానికి యీ పనులన్నీ చేస్తున్నావు" అన్నాడు.

అప్పటినుంచి ఆమెకు అటు తొంగి చూట్టానికే భయంగా వుంది.

పాప ముగ్గుడబ్బా తీసుకొని బయటకు వెళ్ళింది. ఆమె పొయ్యిలో బూడిద చీపురుమీద పోసుకొని పెంట పోగుమీద పోసివొచ్చింది.

పెంటపోగు పాపం పెరిగినట్టు పెరుగుతూ వుంది.

ఇంతలో పాలమనిషి వొచ్చింది. చేతిలోని పాల చెంబు అందిస్తూ "ఇవాళ డబ్బు ఇప్పిస్తారా అమ్మా?" అని అడిగింది.

"ఎంత అయింది వెంకమ్మా?" అని అడిగింది ఆమె.

"ఎంతవ కేవమ్మా? ఇవ్వాళ్తో రెండు నెలలు పూర్తి అయినయి. కిందటి నెల పందొమ్మిది రూపాయల ఆరణాలు ఇవ్వాలి ఈ నెల పదిహేను రూపాయల మూడణాలు. పందొమ్మిదీ, పదిహేడూ ముప్పై ఐదు - ఈ నెల మూడణాలూ వెళ్ళి కిందటి నెల ఆరణాల్లో పడితే, తొమ్మిదణాలు - మొత్తం ముప్పై ఆరురూపాయిల తొమ్మిది అణాలు." ముందే కూతురుతో సమగ్రంగా విషయాలన్నీ చర్చించుకు రాకపోతేమాత్రం పాల మనిషి ఇంత తేలిగ్గా లెక్క తేలవగలిగేది కాదు.

"ముప్పై ఆరు రూపాయిలా?" అనుకుంది ఆమె మనస్సులో.

"నేనైనా చీటికీ మాటికీ అడిగేదానిని కాదు. పెద్దయ్యగారి జీతంనుంచీ పోస్తున్నా. అమ్మగారికి తెలుసుగా నా సంగతి. ఇప్పుడు అవసరం వచ్చి అడుగుతున్నా. అమ్మాయి కాపరానికి వెళుతూవుంది. ఇంటో పెద్దముండదని పున్న తర్వాత, దానికి యింత చేగ [illegible]

రవిక గుడ్డా అని పెట్టకపోతే, దానిప్రాణం వుసూరు మంటుంది."

ఆ ఇంట్లో వతనుగా పోసీవాళ్ళెవరూ డబ్బుకోసగం ఇబ్బంది పెట్టరు. చాలా కాలంనుంచీ ఇస్తూ వుండటం కారణం కావొచ్చు; కాతాలో ఎంత కలుపుతున్నా, అడక్కపోవటం కారణం కావొచ్చు.

"ఆగిందానివి ఎట్టాగో ఆగావు. ఇవ్వాళకూడా ఆగు వెంకమ్మా, వారింకా నిద్రలేవలేదు. లేవగానే అడిగి తీసుకొని రేపు తప్పకుండా యిస్తాను" అంది ఆమె.

"సరేలే అమ్మా" అని వెళ్ళిపోయింది వెంకమ్మ.

వెంకమ్మ అడగ్గానే డబ్బు ఇవ్వలేకపోయినందుకు ఆమె మనస్సు చాలా నొచ్చుకుంది. పాపం! ఎంత అవసరంవుండి అడిగిందో - కూతురు కొత్తగా కాపరానికి వెళ్లడంఅయె! కాని, తాను ఏం చెయ్యగలదు? ఇంట్లో చిల్లిగవ్వకూడ లేదు. ఆమెకళ్ళు చెమ్మగిల్లినై.

* * *

ఆ వూళ్ళో పంపుల్లేవు. ఆపేటలో బావుల్లేవు. పంపూ బావీ ఆ ఇంట్లోనే వున్నాయి. అందుకని తెల్లవారి గట్టనుంచీ, ఆ చుట్టుపక్కల వాళ్ళంతా నీళ్ళకి కడవలు బుజానపెట్టుకొని, చీమలబారుకిమ్మల్లే వొస్తుంటారు. ఆ యింటికి అవతవాళ్ళు కడవలు బుజానపెట్టుకొని, బిత్తర చూపులు చూస్తూ, భయం భయంగా బిక్కుబిక్కు అడుగు

వేసుకుంటూ వస్తారు. ఒక పడుచు అమ్మాయి కడవ బుజాన పెట్టుకొని వాలుచూపులు చూస్తూ వొస్తూంటే, ఇంట్లోవుండే ముసలిది కుండ బుజాన పెట్టుకొని ఆ పిల్లనే కని పెట్టి చూస్తూ వెనకాలే వొస్తూవుంటుంది. మొగవాళ్ళు మాత్రం రెండుచేతుల్లో రెండుబుంగలు పట్టుకొని ధనాధన మని అంగలు పంగలు వేసుకుంటూ వొస్తుంటారు. ఎదురు పడ్డ పడుచు తొలిగి సిగ్గుపడుతూ ముసి ముసి నవ్వులు నవ్వుతుంది. వెనకవున్న ముసలిది "గామయ్యగారి లచ్మయ్య కాదటే; వాడికి తొలుగుతావెందుకు? నీకు అన్నవంటి వాడు" అని ప్రమాదంలేని చుట్టరికం కలుపుతుంది. కాని అప్పటికే కడవలో నీళ్ళు చింది, కడవ ఎత్తుకొన్న బుజం, వొకపక్క రవికా తడిసి ఉంటే పడుచుకి.

శీనయ్య నీళ్ళకు వచ్చాడు.

శీనయ్య నీళ్ళకు రావటం చూసి, "ఇవాళ కొంచెం ఇంట్లో నీళ్ళుపోసిపో శీనయ్యా" అంది ఆమె.

"ఆ! పోస్తానమ్మా" అన్నాడు శీనయ్య భావివొడ్డు ఎక్కుతూ.

శీనయ్యది పలాటి సీమ. "ఈ వూరు ఎందుకు వచ్చావు శీనయ్యా" అని ఎవరైనా అడిగతే, 'బతకటానికి' అని వెతుకోకుండా జవాబు చెబుతాడు. లాగుదుబండి ఒకటి అద్దెకు తీసుకుని, దానివల్ల పొట్ట పోసుకుంటూ ఉంటాడు. నూటపదహార్లు సంపాదించి స్వగ్రామం వెళ్ళి పెళ్ళి చేసుకోవాలని అతని కోరిక. తీరగ్గా వున్నప్పుడు

ఆపనీ యీపనీ చేసిపెట్టి, కూరా నారా పెట్టించుకు వెళ్తుం టాడు. అతనికి వొండిపెట్టేవాళ్ళు లేరు. ఇన్ని బియ్యం వండుకొని తింటూవుంటాడు.

ఆమె వంటయిల్లు శుభ్రంచేసి, పొయ్యి రాజేసింది. శీనయ్య దొడ్లో గాబులో నీళ్ళుపోస్తున్నాడు. పాప ముగ్గుడబ్బా చేత్తో పట్టుకు వొచ్చింది.

"వేశావా అమ్మా?"

"ఆఁ"

"దొడ్లోకూడా వేసిరా, మా అమ్మకదూ!"

"వేశానే అంటే!"

"దొడ్లో?"

"ఆఁ! గేట్లో, వాకిట్లో, సందువాకిట్లో, దొడ్లో- అన్నిచోట్లా వేశాను."

పిల్ల చెప్పించుకోకుండా పనులు చేస్తున్నంటుకు తల్లికి సంతోషం కలిగింది- "వెళ్ళమ్మా. వెళ్ళి, కాసేపు చదువుకో. ఇంతలో కాఫీ కాస్తాను. కాఫీతాగి బడికి వెళుదువుగాని"

"దా మరీ!"

బడికి వెళ్ళేముందు ఒకగంటసేపు తల్లితో పాఠాలు చెప్పించుకోవటం పిల్లకి అలవాటు.

"ఇవ్వాళ నాకు తీరదమ్మా .... నువ్వే చదువుకో. ఏముంది-రాత్రి చదువుకున్న పాఠాలేగా!" అంది తల్లి.

కాని, చదువుకోవటంకోసం వెళ్ళటానికి బడులు

తల్లి దగ్గరకు వొచ్చి కూర్చొని, "ఒక్కరోజు బడికి వెళ్ళక పోతే ఏం అమ్మా!" అని అడిగింది పాప.

"వెళ్ళకపోతే చదువు ఎట్లావొస్తుంది ? ఇక్కడుండి ఏం చేస్తావు ?"

"అంట్లు తోముతాను."

"నువ్వా !"

"నాకు చాతవునే. తెల్లగా మెరిసిపోయ్యేటట్టు తోముతాను. రోజూ నువ్వు తోముతుంటే చూట్టంలా ? ఏముందీ? ఇంత పేడ తెచ్చుకొని ఇంత బూడిద వేసుకుని కూచుంటే, మిలమిలా మెరిసిపోతయి!"

తల్లికి ఏదో జ్ఞాపకం వొచ్చింది. విచారంగా పిల్లని దగ్గరకు తీసుకొని, "నే నుండగా ఆ పని నీ కెందుకమ్మా?" అంది.

"రాత్రి ఒంట్లో బాగా లేదంటివే!"

తల్లికి కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. ఆమెకు వొంట్లో బాగాలేనిమాట నిజమే! కాని అప్పుడే కూతుర్ని యీ పనులోకి దింపగలుగుతుందా ? తను చేస్తున్నది చాలదూ ?

తల్లి మెదలకుండా కూచోవటం వల్ల కూతురికి ధైర్యం వొచ్చింది. "నేను బడికి వెళ్ళనమ్మా! మేష్టరు గారు మాట్లాడితే జీతం జీతం అంటారు. నాన్నని అడిగితే కోప్పడతారు" అంది.

ఆరోజు పిల్ల బడికి వెళ్ళలేదు. తల్లి బలవంత పెట్ట లేక పోయింది.

కూతురు అంట్లు తోముతూ వుంది. తల్లి కూర గాయలు బేరం చేస్తూవుంది-"మొన్న దోసకాయలు యిచ్చి వెళ్ళావు. అన్నీ చేదు విషాలైనై. ఒక్క కాయన్నా పనికి రాలేదు. నీదగ్గర అంతా దండగ బేరంగా వుంది!"

"నాదొడ్లో పండినయ్యా తల్లీ! మారు బేరానికి అమ్మినకునే ముండను: నాకుపుట్టుకు ఏం తెలుస్తుంది? వాళ్ళిస్తాను, నేను ఏసుకొస్తాను, మీబోటి మారాజులు కొంటే-నాలుగు డబ్బులు మిగిల్తే-నాపొట్ట నిండుతుంది."

"ఇవ్వాళైనా మంచికాయలు తెచ్చావా?"

"మంచియ్యనే తెచ్చా. మంచియి కాకపోతే నా మొహం ఎవరు చూస్తారూ!"

అ ముసల్ది మంచికాయలు తేదని ఆమెకు తెలుసు. చౌకబారుకాయలు వేసుకొచ్చి గిట్టినచోట గిట్టినట్లు యిచ్చి పోతుంది. అయినా కొనక తనకు తప్పేదేముంది? మార్కెట్టుకు పంపటానికి ఇంట్లో డబ్బులేదు. ఈ ముసల్దయితే రేపు రమ్మంటే వొస్తుంది.

"బెండకాయలు ఎట్లా యిస్తున్నావు?"

"తీసుకోండి - ఎంతకో ఒకంతకి" అని తక్కెడ తీసి తుయ్యబోయింది.

"ఎంతకిస్తావో చెప్పూ?"

"ఇప్పుడే ఇచ్చివొస్తున్నా, ఆ కోంటోరమ్మని

అడగండి."

"ఎంత?"

"ఆ, ఎంత - మీతో అబద్ధం చెపుతానా! సవ్వా సేరు పావలా."

"పావలా!.... ముసల్దానా, నీకు పిల్లాజెల్లా లేరుకదా, ఈ డబ్బంతా ఏం చేస్తున్నావే!" అని నవ్వుతూ అడిగింది ఆమె.

"సరే తీసుకోండమ్మా, మూడణాలుచేసి యిస్తాను."

బెండకాయలూ బీరకాయలూ పచ్చిమిరపకాయలూ ఇచ్చింది. ఒక అరవీశె కాకరకాయలు కూడా తీసుకోమని ప్రతిమాలింది. తీసుకోకపోతే, డబ్బు యిప్పుడే యిమ్మనుటుందేమో అని ఆమె వొప్పుకుంది. దానికి ఆ కాకరకాయలు ఎక్కడా అమ్ముడు కాలేదనీ, తనకు అంటగట్టి వెళ్లాలని చూస్తూవున్నదనీ ఆమెకు తెలుసు. కాని యేంచేస్తుంది? ముసల్ది అరవీశ కాకరకాయలుకూడాయిచ్చి డబ్బుఅడిగింది.

"చిల్లరలేదు, రేపు వచ్చినపుడు కనపడు, యిస్తా" అంది.

"సరేలే అమ్మా" అని వెళ్ళిపోయింది. అంతే చాలనుకుంది ఆమె.

ఇంతలో శీనయ్య ఇంట్లో నీళ్ళుపోసి వొచ్చాడు.

"కొంచెం బజారుకి వెళ్ళిరావలి శీనయ్యా!" అంది ఆమె.

"వెళ్తా."

"కట్టెలు తెచ్చిపెట్టాలి."

"డబ్బివ్వండి, తెస్తాను."

కాని డబ్బెక్కడిది? ఆమె డబ్బుకోసగం లోపలికి వెళ్ళినట్లు వెళ్ళింది. దొడ్డి గోడదగ్గరకు వెళ్ళి పక్కయింటి కాంతమ్మని పిలిచింది.

"కాంతమ్మక్కా! అయిదు రూపాయలుంటే బదులిస్తావా? మొన్న జాకెట్లు కుట్టించాను, కుట్టుకూలి యివ్వాలి. వారిని అడగటానికి మనస్సు వొప్పటంలేదు. 'మొన్న వంద రూపాయలుపెట్టి చీరెలు కొన్నానే, అప్పుడే మళ్ళీ ఖర్చా?' అని నొచ్చుకుంటారేమో అని భయంగా ఉంది. రెండుమూడు రోజుల్లో నాన్న వస్తాడు. రాగానే ఇచ్చివేస్తాను." అని అడిగింది.

ఇంట్లో ఐదురూపాయలు లేవంటే లోకువ అనీ, తన భర్తగౌరవానికి ఎక్కడ లోపం వొచ్చిపోతుందో అనీ తపనంతా తనమీదే పెట్టుకొని అడిగింది.

"అయ్యో! దానికేం అమ్మా! ఇబ్బంది ఎవరికైనా వొస్తుంది" అని కాంతమ్మ డబ్బు తెచ్చి యిచ్చింది. ఆ డబ్బు శీనయ్యకిచ్చి, "రెండు సలక్కలు ఇట్టాపేళ్ళు తెచ్చిపెట్టు నాయనా" అన్నది.

"ఆఁ"

శీనయ్య బజారు వెళ్ళటానికి రెండడుగులు వేశాడు.

"చూడు శీనయ్యా, ఎట్లాగూ బజారు వెళ్తున్నావు గనక వొచ్చేటప్పుడు వొక సవాశేరు వెన్నపూస కూడా తెచ్చిపెట్టు."

కట్టెల అడిగి, వెన్నపూసకొట్టూ రెండూ ఒక్క చోట కాదు. ఆ సంగతి ఆమెకు తెలుసు. అందుకనే రెండుపనులూ ఒకేసారి చెపితే ఏమన్నా అనుకుంటాడేమో నని ఈ విధంగా చెప్పింది.

శీనయ్య డబ్బుతీసుకొని, కట్టెలు కట్టుకు రావటానికి డొక్కనార తాడు తీసుకొని బజారు వెళ్ళాడు.

వెంటనే ఆమెకు వెచ్చాలు అయిపోయినయ్యానే సంగతి జ్ఞాపకం వొచ్చింది. పాపకోసం వెతికింది. అంట్లు తోముతున్న ఆ పిల్లని చూచేటప్పటికి విచారం, ఆనందం రెండూ ఒకేసారి కలిగాయి-అంట్లు తోమాల్సి వొచ్చినందుకు విచారం, తోముతున్న వైఖరికి సంతోషం.

చేతులనిండా పేడా మొహంనిండా బూడిదా పూసుకుంది పాప. నాపరాతిమీద చతికిలాబడి కూర్చొని కాళ్ళారజాపి అంట్లు తోముతూవుంది. చేతివ్రేపుకి తగినట్టుగా తల వ్రేపుతూ ఉంది.

"ఒకసారి ఇట్లారా పాపా" అని పిలిచింది తల్లి.

"చేతిలో పని తెమలనియ్యి" అని సమాధానం చెప్పింది పాప. పని ఆపలేదు, తల ఎత్తలేదు.

"కొంచెం సుబ్బయ్య కొట్టుకు వెళ్ళి వెచ్చాలు తెచ్చి పెట్టాలమ్మా" అన్నది తల్లి.

సుబ్బయ్యది చిల్లరకొట్టు, వాళ్ళ యింటికి దగ్గర్లోనే ఉంది. అక్కడ వాళ్ళకు కాతా ఉంది. అక్కడనుంచి అప్పుడప్పుడూ వెచ్చాలు తేవటం పాపకి అలవాటే.

"కావల్సినయ్యేవో రాయి, ఇస్తా" అంది పాప.

ఇంట్లోకి కావలసిన సరుకులు కాగితంమీద రాసి యిచ్చింది తల్లి :

పెద్ద ఉల్లిపాయలు	ఒకవీశ
ఎండుమిరపకాయలు	సవాశేసు
ధనియాలు	రెండుగిద్దలు
మిరియాలు	అణా
ఆవాలు	అర్ధణా
సన్ లైట్‌సోప్	ఒకటి
మంచినూనె	అరవీశ
కుంకుమకాయలు	ఒకశేరు
లక్స్‌సోప్	ఒకటి
చింతపండు	అరవీశ
కందిపప్పు	రెండుశేర్లు
పచ్చిసెనగపొప్పు	బేడాఅర్ధణా

పాప చేతులు కడుక్కొని, లంగాకి తుడుచుకొని తడి కాకుండా రెండువేళ్ళతో కాగితం పట్టుకొని చదువుకుంది.

"రెండు సబ్బులు ఎందుకమ్మా?"

"ఒకటి బట్టలు వుతుక్కునే సబ్బు"

"నీ చీరె ఉతుక్కోటానికా ?"

"ఊఁ"

"నీ చీరెకు వేరే ఒక సబ్బు కావాలేం?" అంటూ పరుగెత్తింది పాప.

శీనయ్య కట్టెలు తెచ్చి వంటయింట్లో వేశాడు. రోమటి ఇంటినుంది నాలుగైదుసార్లు తిరిగి చిన్న సంచితో సరుకులన్నీ ఇంటికి జేర్చింది పాప. శీనయ్య వెన్నపూస కూడా తెచ్చాడు. ఆమె సరుకులన్నీ సర్ది ఒక నిట్టూర్పు విడిచింది. "ఇవ్వాళిటికి గట్టెక్కినట్టే; కాపరం ఒకరోజు గడిచింది." అనుకుంది.

కాని ఒకపక్కన ఆమెకు బాధగానే వుంది. తుమ్మితే వూడే ముక్కుగా ఇట్లా కాపురం ఎన్నాళ్ళు జరుగుతుంది? ఎంతదూరం ఆలోచించి చూచినా ఒడ్డుకనపట్టంలేదు. ఆలోచించినకొద్దీ భయంకరమైన అలలే కనిపిస్తున్నయి. అలల తాకిడికి ఈ ఓడ ఎప్పుడు బుటుక్కుమన్నా అనొచ్చు.

కాఫీకి పొయ్యిమీదనుంచి పాలుదింపుతూ చేతులు చూచుకుంది. అంట్లు తోమటంవల్ల గోళ్ళు అరిగివున్నై. ముంజేతులు మసితో నల్లబడివున్నై. అరచేతులకు ఇదివరకున్న మృదుత్వంలేదు. తన ఆకారం, స్వభావం అన్నీ మారిపోతున్నట్లు ఆమె భావించుకుంది. ఇంకా ఎక్కువదూరం ఆలోచించటానికి భయంవేసింది.

"నాన్న లేచారేమో చూడమ్మా!"

"లేవలేదే ఇంకా."

"లేపుమ్మా, కాఫీ ఆరిపోతుంది."

"నేను లేపనుబాబూ. కోప్పడతారు."

ఈ మాటవిని కాఫీ కలుపుతూ అలాగే ఆలోచిస్తూ కూర్చుంది ఆమె.

ఆమెకు తనదిన్నతనం, తను చదువుకున్న రోజులు, ఆనాటి తన వూహాలూ అన్నీ జ్ఞాపకం వొచ్చివుంటాయి. తను గురుకులంలో చదువుకున్న రోజులే తనజీవితంలోకల్లా మంచిరోజులనుకుంది. భర్తను చూడవలసిన విధం, పిల్లలను పోషించవలసిన పద్ధతీ వాళ్ళబోధిస్తూవుంటే ఎన్ని తియ్యని వూహలు వూహించుకునేది! నిజంగా తన పెళ్ళి అయిన ప్పుడు కూడా అంతా తన్ను అదృష్టవంతురాలే అను కున్నారు. తనూ అలాగే అనుకుంది. కాని, అనుభవానికి వచ్చేటప్పటికి అంతా తారుమారైంది తప్పు ఎక్కడుందో తెలియటంలేదు. పొంపాటు ఎక్కడ జరిగిందో తెలియటం లేదు.

"అమ్మా!.... కాఫీ.... !!"

ఆలోచిస్తూ ఆమె కాఫీ ఆరపోస్తున్న సంగతి మరచి పోయింది. కాఫీ చిందిపోతూవుంది.

ఆమె సర్దుకొని, "నాన్నని లేపమ్మా!" అంది.

"నేను లేపనంటే"

"మా అమ్మవుకదూ"

"కోప్పడతారంటే"

"కోప్పడితేం? నాన్న అన్నతర్వాత ఆ మాత్రం కోప్పడరూ?—పెళ్ళమ్మా-కాఫీ ఆరిపోతే నాన్న తాగరు"

ఆమె కళ్ళవెంట రెండు కన్నీటి చుక్కలు రాలినై. మొన్న ఆలస్యంగా లేచి కాఫీ ఆరిపోయిందని "నిద్రలేపటమే నీకు కష్టమైపోయిందా?" అని కోప్పడ్డారు. నిన్న కూతురు లేపితే నిద్రలేపినందుకు కోప్పడ్డారు.

"నేను చేసిన తప్పేమిటి?" అనుకుంటూ కూర్చుంది.

తల్లి విచారంగా వుంటం చూచి మాటల్లోకి దింపాలని ప్రయత్నించింది పాప.

"వెళ్ళాలేవే! సరేగాని, నాన్న పెద్దవాడుగదా-అన్నీ తెలుసా?" అని అడిగింది.

"అన్నీ తెలుసునమ్మా...."

"మరి, తొమ్మిది పదమూళ్ళు ఎంత నాన్నా అంటే నాకు తెలియదు అన్నావే?" అని అడిగింది.

"ఏదో ఆలోచిస్తూ అన్నారుగాని ఆ మాత్రం నాన్నకు తెలియదటే!" అంది.

"తెలియదమ్మా ఒట్టు! మొన్న నక్షత్రాల్లో ఏ మంటుంది నాన్నా అని అడిగితే నాకు తెలియదని కోప్పడ్డారు" అంది కూతురు. "నిజం అమ్మా! నువ్వాడుగు-గాలి ఎట్లా వొస్తుందో చెప్పమను. ఆకాశం ఎంత ఎత్తునవుందో చెప్పమను. కొబ్బరిచెట్లు ఏ యే పనులకు పనికివస్తుందో, నూనె చేయు విధమూ చెప్పమను..."

తండ్రికి ఏమేమిరావో కూతురు ఇట్లా చెప్పుకు పోతుంటే ఆమెకు నవ్వొచ్చింది.

వెంటనే తన చిన్నతనం జ్ఞాపకం వొచ్చింది. ఆడవాళ్ళకు ఎంత తెలివి ఉండి ఏం లాభం. ఇది రాణింపబడి

వచ్చే వీలేది? ఆ తెలివి బయటపడే అవకాశం భర్త ఇవ్వకపోతే అంతా బూడిదలోపోసిన పన్నీరు అవవలసిందే!

"ఈ పిల్ల జాతకం ఎట్లావుందో" అని ఆలోచిస్తూ కూర్చుంది.

కూతురునెమ్మదిగాలేచి తండ్రిని లేపటానికి వెళ్ళింది.

* * *

సీతారామారావు గాజుగ్లాసులో తప్ప కాఫీ తాగడు ఇంకేగ్లాసులో తాగినా తాగినట్లు వుండదు అంటాడు. అందుకని అతనికోసం ప్రత్యేకం ఒక గాజుగ్లాసు తెప్పించి, అది పిల్లలు ఎక్కడ పగలగొడతారో అనే భయంతో అతను కాఫీతాగ్గానే అలమరలో దాస్తుంది, అతని భార్య.

ఇప్పుడు ఆ గాజుగ్లాసుకోసం నెమ్మదిగా లేచింది, అతని భార్య.

మూడో ప్రకరణం

అసమర్థుని ఆదర్శం

శ్రీరామారావు ఇంకా నిద్రనుంచి లేవలేదు. అతనికి కొద్దిరోజులనుంచి కలలు వస్తున్నై. అన్నీ తెల్ల వార కట్ట. తెల్లవారకట్ట వచ్చే కలలు నిజమౌతవంటారు.

తను చీమలు దూరని చిట్టడవిలో కాకులు దూరని కారడవిలో తపస్సు చేసుకుంటున్నాడు. ఒకపక్క పెద్ద పులులు, సింహాలు కాండ్రుకాండ్రు మంటున్నై. ఒకపక్క ఏనుగులు తండోపతండాలుగా తొండాలు పైకెత్తుకొని ఘీంకారాలు చేసుకుంటూ పరుగెత్తుతున్నై. కుందేళ్ళు కుప్పిగంతులు వేస్తున్నై. లేళ్ళు చెంగుచెంగున దూకుతున్నై. నెమళ్ళు పించాలు విప్పి నృత్యం చేస్తున్నై. పాములు బుసకొడుతున్నై. ఒక నాగుబాము తన నెత్తి మీద వున్న చెట్టుకొమ్మగి చుట్టచుట్టుకొని, తన నెత్తి మీద పడగవిప్పి, సూర్యరస్మినుండి తనను కాపాడుతూ

వుంది. ఒక కొండచిలువ చెట్టుచాటున కూర్చొని మనుష్య భాషలో, "అలారండి, ఇలారండి" అంటూ ఉంది. చెట్టు మీద కోతులు కిచకిచ గెంతుతున్నై. అంత్రమధ్యాన పక్షులు రింగు రింగున కొండ్లు కొడుతున్నై.

ఒక ఎలుగ్గొడ్డు తాటిచెట్టు ఎక్కి కల్లులొట్టిలో నుంచి కల్లుతాగి, కాళ్ళసందున తల ఇరికించుకొని, అంత ఎత్తునుంచి ధామ్మున కిందపడింది. దానికి దెబ్బ తగలలేదు గాని, భూమి అదిరింది. తపోభంగమయింది. కన్ను తెరచి చూశాడు. తపోభంగమయినందుకు తనకు కోపమొచ్చింది కాబోలు, తన నేత్రాల్లోంచి ఒక తేజస్సు -వెలుగు- ఒక మంట_ బయలుదేరి, సూటిగా ఎలుగ్గొడ్డు మీదికి వెళ్ళి, దాని వెంట్రుకలను కసురెప్పపాటులో చురచుర కాల్చి వేసింది. ఇప్పుడు ఎలుగ్గొడ్డు మబ్బులున్న ఆకాశానికిమల్లే, తోలుపూడిన అరటికాయకి మల్లే తెల్లగావుంది.

మళ్ళీ తను కళ్ళుమూసుకొని తపస్సు మొదలు పెట్టాడు. ఏండ్లుపూండ్లు గడిచినై.

తనచుట్టూ గబగబా పుట్టలు మొలచినై. గోళ్ళు పెరిగిపెరిగి మెలితిరిగి, హాస్యగాని కర్రకుమల్లే ఉన్నై. గడ్డం ఇంతింతై కాయమబ్బింత అయింది. శరీరం శుష్కించి పోవటం, మొఖంలో బ్రహ్మ తేజస్సు ఉట్టిపడటం-రెండూ ఒక్కసారి జరిగినై. మరీ విచిత్ర మేమిటంటే, శరీరం ఎంత శుష్కిస్తే, ముఖంలో బ్రహ్మతేజస్సు అంత ఎక్కువ అవుతూ ఉంది.

ఉండిఉండి ఒక మెరుపు మెరిసింది. అది సాధారణంగా మెరిసే మెరుపువంటిదికాదు. కొండలను చీల్చుకొని భూమిమీదకు దూకే జలపాతానికివల్లే, హృదయాలను చీల్చుకొని బయటకుదూకే ప్రేమ ప్రవాహానికివల్లే, ఆకాశాన్ని చీల్చుకొని అతని ముందుకు దూకింది. దూకింది దూకినట్లుగానే వుండిపోయింది. ఆకాశాన్నుంచి అతని ముందుకి దాని తేజస్సుతో ఒక తెల్లని తళతళ మెరిసే భాట ఏర్పడింది.

ఆ మెరుపు తేజస్సుకి సింహాలూ, శార్దూలాలూ, ఏనుగలూ– వన్యమృగాలన్నీ నివ్వెరపోయినై. చేతనారహితంగా ఎలానుంచున్నవి అలాగే – ఎలా కూర్చున్నవి అలాగే– ఎలా తిరుగుతున్నవి అలాగే– వుండిపోయినై.

వెయ్యి రాంధ్రోళ్ళ మోత వినబడింది.

అతను కన్ను తెరచి చూశాడు. పార్వతీ పరమేశ్వరులు మెరుపు ఏర్పరిచిన దారిగుండా పరుగెత్తుకొనివచ్చి, అతనిముందు ప్రత్యక్షం అయ్యారు. పార్వతీపరమేశ్వరులు ఇద్దరు వ్యక్తులుకారు.

అర్ధనారీశ్వరుడు...ఒకే ఆకారంలో సగం పార్వతీ, సగం శివుడూ. ఈ విషయం సుస్పష్టం చెయ్యటానికో అన్నట్లు, మధ్య పార్టిషన్ ఉంది. పార్టిషన్‌గా వ్యవహరిస్తూ నల్లగుడ్డ శివుడు మాట్లాడేటప్పుడు పార్వతినీ, పార్వతి మాట్లాడేటప్పుడు శివుణ్ణీ కప్పుతూ ఉంటుంది. కాబట్టి పోరపాటునో, పార్టిషన్ గాలికి రెపరెపకొట్టుకొనేటప్పుడో తప్ప, ఏక కాలంలో ఇద్దరూ కనబడరు.

సీతారామారావుని పలకరించేందుకు శివపార్వతులు తమలోతాము మాట్లాడుకున్నారు.

"నా మాట వినరు!" అన్నది పార్వతి. "ఏం విన లేదు?" అన్నాడు శివుడు. "భక్తులు పిలిస్తే చాలు దడదడా పది వరాలు జేబులో వేసుకొని ప్రత్యక్షం అవుతారు."

"నేనేం చేసేది, నేను పుట్టిందే అందుకాయె!"

"అయితేమాత్రం వేళాపాళా ఉండక్కర్లా? అన్నది పార్వతి.

"భక్తులు వేళాపాళాలేకుండా తపస్సు చేస్తుంటే నేనేం చేసేది?" అన్నాడు శివుడు.

"మీ యిష్టం" అన్నది పార్వతి.

"ఏం వరం ఇద్దాం? తర్వాత అడగలేదంటావు!" అన్నాడు శివుడు.

"మనం ఇచ్చింది తీసుకుంటాడా ఏమిటి?" అన్నది పార్వతి.

"ఏం చేస్తాడంటావు?" అడిగాడు శివుడు.

"తను కోరింది ఇమ్మంటాడు"

"ఏం చేదాం?"

"అడగండి ఏం కావాలో"

శివుడు అడిగాడు—"బిడ్డా! నీ తపస్సు ఫలించింది. కండ్లు తెరిచేవున్నావు గనుక ఇక నీకేమి కావలయునో కోరుకొనుము."

సీతారామారావు శివుణ్ణి తదేకధ్యానంతో చూశాడు. కోరుకోవాలి. ఏం కోరుకోవాలి?

వైశ్యానరుడు 'బాండ్' అన్నాడు.

"అన్నం" అన్నాడు సీతారామారావు.

"పార్టిషన్ గావ్యవహరిస్తున్న నల్లగుడ్డ శివునిముఖం కప్పింది. పార్వతి బయటపడి ఉలిక్కిపడ్డది. "నాథా-ఇతని కోర్కెను నెరవేర్చకుండు!" అని ప్రార్థించింది. ఎంతో వినయంగా భయంగా అడిగింది.

"ఎందుకని?" శివుడు అడిగాడు.

"మీరు ఈ వరం ఇస్తే నన్ను వండిపెట్టమని అడుగుతాడు" అన్నది పార్వతి.

పార్వతి తనకు వరం ఇవ్వకుండా చేస్తుందేమో అని సీతారామారావుకు గాభరా పుట్టింది. ఇలా అన్నాడు:

"మీరు నాకు వండిపెట్టవక్కర్లేదు. ఎవరూ వండకుండా, నేను అడక్కుండా ఎప్పటికప్పుడు పంచభక్ష పరమాన్నాలతో నాకడుపు నిండుతూ ఉండాలి."

నల్లగుడ్డ పార్వతిని కప్పింది. శివుడు-"బిడ్డా! నీభక్తికి మెచ్చితిని. నీకు అసలు ఆకలి అనేదే లేకుండా చేస్తాను" అన్నాడు.

"ఆకలి లేకుండా చేస్తే ఎలా దేవా? ఇదేనా నీ ఆర్తజనరక్షణపరాయణత్వం? నీ భక్తులను కాచు విధం? దీనజనపోషకుడవని పేరుగాంచితివే? ఆశ్రిత జనరక్షా

దక్షుడవని పేరుమోసితివే? ఈ పేర్లన్నీ ఎందుకు దేవా? నీ భక్తులను మోసంచెయ్యటానికి తగిలించుకున్నవేనా?"

శివునకు భయంవేసింది-"బిడ్డా! తొందరపడకు - నీ కోర్కెను సవినయంగా మనవిచేసుకో" అన్నాడు.

"నాకు ఆకలి ఉండాలి, ఆకలితీరే అన్నం ఉండాలి."

"అటులనే జరుగుగాక" అన్నాడు శివుడు.

నల్లగుడ్డ శివుణ్ణి కప్పింది. పార్వతి "ఇక వెళ్దాం" అంది. ఆమెకు తనభర్త స్వభావం తెలుసు. ఏం నోరుజారుతాడో అని భయం.

"మరొకసంగతి దేవా!" అడిగాడు సీతారాములా రావు.

"ఒప్పుకోకండి" అన్నది పార్వతి.

"ఎందుకని?" అడిగాడు శివుడు.

"మరొకవరం ఇమ్మనంటాడు" అన్నది పార్వతి.

"ఇద్దాం" అన్నాడు శివుడు.

"తేలికయిపోతాం" అన్నది పార్వతి.

"ప్రేయసీ! బ్రహ్మవిష్ణులకంటే భక్తకోటిలో నాకే మంచిపేరు ఉంటానికి కారణం తెలుసా? ఎక్కువమంది భక్తులు నన్నే ప్రత్యక్షంకమ్మని ఎందుకు కోరుకుంటారో తెలుసా? తేలిగ్గా ప్రత్యక్షం అవుతానని, అడిగిన వరాలన్నీ అడగ్గానే ఇస్తానని! అనాదినుంచీ సంపాదించుకున్న మంచి పేరు నేను చెడగొట్టుకోను" అన్నాడు శివుడు.

"మీ యిష్టం. నాకంటె మీకు మీ భక్తులమీదే ఎక్కువ ప్రేమ" అన్నది పార్వతి.

"కాదు. మీ అందరికంటే పేరుప్రఖ్యాతులమీద ఎక్కువప్రేమ నాకు" అని సీతారామారావువైపు తిరిగి, "ఏమిటి బిడ్డా?" అని ప్రశ్నించాడు.

"నా వరం ఇంకొకళ్ళ కివ్వగూడదు."

"ఇవ్వను" అని మాట ఇచ్చాడు శివుడు. అప్పుడే తన భర్త నోరుజారటం మొదలుపెట్టాడని పార్వతికి భయం ఎక్కువైంది. వెళదామని భర్తను తొందర పెట్టింది.

"వెళ్దాం" అన్నది పార్వతి.

"వెళ్దాం" అన్నాడు శివుడు.

"ఇంకొకవరం అడుగుతాడు" అన్నది పార్వతి.

"అడగనివ్వు" అన్నాడు శివుడు.

"అడిగి అడిగి చివరికి మీ నెత్తినేచెయ్యిపెడతాడు. భస్మాసురుణ్ణి జ్ఞాపకం చేసుకోండి నాథా" అన్నది పార్వతి.

భస్మాసురుడు పేరెత్తేటప్పటికి శివుడికి భయం వేసింది. అతని బారినుంచి తప్పించుకోటానికి తానుపడ్డ కష్టాలన్నీ జ్ఞాపకం వచ్చినై. వెంటనే సీతారామారావుని "బిడ్డా, నీకు శుభమగుగాక!" అని దీవించి, ఇద్దరూ అంతర్ధానం అయ్యారు.

ఆకలి___ఆకలి-ఆకలి___పార్వతీపరమేశ్వరులు అంతర్ధానం అవగానే బ్రహ్మాండాన్ని నమలకుండా మింగాలనే అంత ఆకలి పుట్టుకొచ్చింది సీతారామారావుకి. లోపల నుంచి వైశ్వానరుడు 'భాంణ్' అని అరచాడు.

ఆ అరుపుకి భూమి నద్దరిల్లింది. కొండలు పిండి అయినై. నోరులు చెట్లమీదనుంచి పండిన కాయలు రాలినట్లు రాలినై. పక్షులు అవ్వాయిచువ్వలకు మల్లే ఆకాశంలోకి చొచ్చుకుపోయినై. పాములు కుబుసం విడిచినై. నెమళ్ళ పించాలు తెగినై. తెల్లబడ్డ ఎలుగ్గొడ్డు ఎర్రరంగుకి తిరిగింది.

"భాంణ్"

ఆ ధ్వనికి సీతారామారావు చుట్టూ పెరిగిన పుట్ట చెల్లాచెదరైంది. గడ్డంవూడి గాలిలో నాట్యం చేసింది. గోళ్ళవూడి విచ్చుకత్తులై అడవిని నరికి పోగులుపెట్టినై.

"భాంణ్"

స్వర్గలోకం తూట్లుపడింది. ఆ తూట్లలోనుంచి ఊర్వశీ, రంభా, తిలోత్తమా మొదలయిన అప్సరసలంతా పంచభూత పరమాణ్వాలు పళ్ళాల్లో పెట్టుకొని సూర్యకిరణాలకుమల్లే కిందకు దిగారు. ఒకతె సీతారామారావు తొడ మీద కూర్చొని తినిపించటం మొదలుపెట్టింది. మిగిలినవాళ్లు హాయిగా పాడుతూ, కన్నులపండుగ్గా నృత్యం చేస్తున్నారు.

క్షణంలో మహారణ్యం మారిపోయింది. ఎక్కడ చూచినా కోయల కుహుకుహూరవాలే! సెలయేటి గుడ గుడ ధ్వనులే! కుందేళ్ళ శార్దూలాల పాలు తాగుతున్నై. సింహాలు లేళ్ళకు చన్నిస్తున్నై. పాములు ఏనుగుల తొండ లకు మారుగా వేళ్ళాడుతున్నై. కోతులు ఎలుగ్గొడ్డుమీద సవారి చేస్తున్నై. అంతా నిత్యకళ్యాణం పచ్చతోరణంగా వుంది. సీతారామారావుకు నయనానందకరంగా వుంది.

దురదృష్టవశాత్తూ సీతారామారావు మంచంమీద కదిలాడు. నిద్రచెదిరింది. పైదృశ్యం అదృశ్యంఅయింది. తను పడుకున్న మంచానికి దగ్గర్లో వున్న కొబ్బరిచెట్టుమువ్వ గాలికి ఓటిమోత మోగుతూవుంది. మొండిగోడ మీదనుంచి ఎవ్వరో పిలుస్తున్నారు. పక్కయింట్లో ఎవ్వరో పోట్లాడుకుంటున్నారు. తనపక్కలో పడుకున్న నల్లకుక్క లేచిపోయింది.

అతనికి లీలగా తన భార్య అప్పుడే పనిపాటలు మొదలుపెట్టినట్లు తెలిసింది ఊహల తియ్యదనాన్నుంచి ఒక్కసారి నిత్య జీవితం మీదకు దృష్టిమళ్ళేటప్పటికి, అత నికి భరించలేని బాధ కలిగింది. తన భార్యమీద కోపం వచ్చింది. ఎప్పుడూ పనే... పని.... పని.... పని. పొద్దున్న నాలుగుగంటలకు లేస్తుంది. రాత్రి పడుకునేవరకూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటుంది. అదైనా శుభ్రంగా చెయ్యదు.

అకస్మాత్తుగా అతనికి తన భార్యకు తొమ్మిదోనెల అని జ్ఞాపకం వచ్చింది. భార్యమీద కోపం ఎక్కువ

అయింది. తొమ్మిదో నెలగదా, ఆమాత్రం బుద్ధి ఉండక్కర్లా? భావిలోనుంచి నీళ్ళు కడవతో తనే తోడుతా. నంటుంది? ఏనుగంటి మంచాలు తనే బయటకు పడతానంటుంది. ఆ బరువులు మోసేటప్పుడు ఏ కాలో జారితే దానికేం? అది మంచంమీద మూలుగుతూ పడుకుంటుంది. డాక్టరుచుట్టూ మందుకనీ మాక్కనీ తిరగవలసింది తనేగా! ఇంతకో జీవితం నరకం చెయ్యటానికి పుట్టింది.

నెలలు నిండినా మొన్న పేరంటానికి వెళ్ళింది. చూచిననాళ్ళు ఏమనుకుంటారు? తనకు ఆమాత్రం తెలియక్కర్లా? నిజంగా ఈ ఆడవాళ్ళకు సిగ్గులేదు. తనకు సంతానం కలగబోతున్నసంగతి అందరికీ తెలియాలి అన్నట్లు తిరుగుతారు

"నాన్నా, నాన్నా" పాప లేపుతూ వుంది.

"లే నాన్నా, పొద్దెక్కింది."

అతనికి లేద్దామనేవుంది. కాని ఇంకా బద్ధకం వొదల్లేదు. ఇంకొక భయంకూడా వుంది. లేచినప్పటినుంచీ బియ్యంలేవు. పప్పులేదు. ఉప్పులేదు. కూరలులేవు.... ఇవేగా అది చెప్పేమాటలు. వొళ్ళంతా నొప్పులుగావున్నై. గాల్లో ఆరుబయట పడుకుంటే కామాలు. కాదు. రాత్రి, చంటిది మూరాంచేస్తే, నవారు మంచం దానికిచ్చి నులక మంచం వేసుకున్నాడు. అబ్బా. ఈ పిల్లలతో చచ్చేరోజు

వస్తూవుంది. అన్ని మంచాలూ ఊరబెడ్తారు. పైగా తన భార్య "పిల్లలన్న తర్వాత...." అంటుంది.

"లే నాన్నా, అమ్మ లెమ్మంటోవుంది."

ఆఁ! అమ్మ లెమ్మంటుంది. లెమ్మనక ఏంచేస్తుంది! ఆర్డర్లు పురమాయించటంకూడా! ఏక్లలేవచ్చి మేక్లలేఅయిం దంటారే, అట్లావుంది దీని వ్యవహారం. తను అడగదు. అన్ని కూతురుద్వారా అడిగిస్తూంది. ఈ మధ్య ఈ ఎత్తు ఒకటి ఎత్తుతూవుంది.

"లేవండి. కాఫీ ఆరిపోతూవుంది" అన్నది భార్య.

ఒకప్పుడు దీన్ని ఎట్లా ప్రేమించానా అని ఆలో చిస్తూ కళ్లు నలుపుకుంటూ లేచాడు—"అయితే నేను బ్రత కటంకూడా మీ అమ్మ చూడలేకుండా వుందా ఏమిటి?" అని కూతుర్ని ప్రశ్నించాడు. అమె ప్రక్కనేవుంది.

"కాఫీ!" అన్నది భార్య గ్లాసు అందిస్తూ.

"లేవనివ్వు" అన్నాడు సీతారామారావు.

లేచాడు.

"కాఫీ!"

"కొంచం మొహం కడుక్కోనిస్తావా?"

"అప్పుడు మళ్ళీ ఇస్తాను."

"మొహం కడుక్కో అక్కర్లా"

"మీకు అలవాటుగా బెడ్ కాఫీ...."

"ఏం అలవాటైతే తప్పా? మొహం కడుక్కొని కాఫీతాగాలని భగవంతుడు నిర్ణయించాడా! కాఫీతా?

మొహం కడుక్కుంటేనేం, మొహం కడుక్కొని కాఫీతాగితేనేం? నా యిష్టం..."

"నేను కాదనటంలేదు. బెడ్ కాఫీ మీకు అలవాటు గనక..."

"బెడ్ కాఫీయా. గాడిదగుడ్డు కాఫీయా"అని భార్య చేతులోని గాజుగ్లాసు తీసుకున్నాడు వెంటనే, వొద్దని తీసుకున్నట్టు జ్ఞాపకం వొచ్చింది. గ్లాసుగోడకు వేసి కొడదాం అనుకొని, గడగడా తాగేశాడు.

2

ప్రపంచంలో అన్నిశాఖల్లోనూ హేమాహేమీలున్నారు. వీళ్ళంతా అందరికీ ముఖ్యమైన అన్నం దొరికేట్టు చెయ్యలేకపోవటం అతనికి ఆశ్చర్యంగా విచిత్రంగా ఉండేది. పైగా వీళ్ళంతా నా సంఘానికి అన్నం కావాలంటే నా సంఘానికి అన్నం కావాలనీ, నాదేశానికి అన్నం కావాలంటే నాదేశానికి కాఫీలనీ కాట్లకుక్కలకుమల్లేకీచులాడుకుంటూ వుంటారు. ఈ కీచులాటకనే చోట్లకి పెద్ద పెద్దపేర్లు పెడతారు.

అంతర్జాతీయ మహాసభలు అంటారు. ఈ మహాసభలకు ఒక్కొక్కదేశంనుంచి ఒక్కొక్క ప్రముఖవ్యక్తి హాజరై ఉపన్యాసంమీద ఉపన్యాసం దంచుతాడు. గుక్కతిరక్కుండా గంటలతరబడి మాటలు దొర్లిస్తాడు. ఎన్ని ఉపన్యాసాలు దంచినా, ఎన్నిమాటలు దొర్లించినా అతను అడిగేదేమిటి?

అన్నం !

"మా పొట్టలకు అన్నం లేదు. మల మల మాడి చస్తున్నాం. మీరు ప్రసాదించండి—మీరు ప్రసాదించండి—మీరు ప్రసాదించండి"అని ఇతర దేశాలను అర్థించటం—

ఎంత నీచం ! !

ఇతనే ఇంతనీచంగా ప్రవర్తిస్తుంటే మరొక దేశ ప్రముఖ వ్యక్తి లేస్తాడు,—"చస్తే చావ నివ్వండి, కాని ఆ దేశానికి అన్నం పంపటానికి వీల్లేదు!" అని హుంకరిస్తాడు.

కొన్ని దేశాలు తమకు అన్నం ఎక్కువైతే సముద్రంలో ఒలకబొయ్యటానికైనా ఒప్పుకుంటయ్యిగాని, మరొకదేశానికి పంపటానికి ఒప్పుకోవు. మరొకదేశానికి కాదు—తమదేశంలోవున్న బీదవాళ్ళకే పంచిపెట్టవు!

వీళ్ళిలా కీచులాడుకుంటూ వుంటే—

ఈ కీచులాట ఫలితం ఏమవుతుందో అని, అన్ని దేశాల ప్రజలూ గుంటకాడ నక్కలకున్నట్లే కాచుకు కూచుంటారు. ఏదేశానికి ఎంత కబళం దొరికిందో అని వార్తలకు ఎదురు చూస్తుంటారు. ఈ ప్రవర్తన చాలా నీచంగా అసహ్యంగా కనిపించేది సీతారామారావుకి.

ఇంతమంది మేధావులున్నారుగదా ప్రపంచంలో—వీళ్ళల్లో ఒక్కరైనా అన్నం తేలిగ్గా దొరికే పద్ధతి ఎందుకు కనిపెట్టరు! ఏ వాసన చూట్టంవల్లో, ఏగాలి పీలవడంవల్లో,

ఏ నీళ్ళు తాగడం వల్లో ప్రాణాలు నిలిచేటట్టు ఎందుకు చెయ్యరు? ఈ యుద్ధాలూ, ఈ నాశనాలూ, బాధలూ తాపత్రయాలూ అన్నీ తప్పుతయిగా? అంతా సుఖంగా బతుకుతారుగా! వాళ్ళీవిధంగా ఆలోచించరు. సంఘానికి కొన్ని నియమాలున్నాయి, ఆ నియమాలను బట్టే పోవాలంటారు. సంఘం స్వభావసిద్ధంగా పొందే మార్పుకి దోహదం ఇవ్వాలంటారు. ఒక దశ తర్వాత ఒక దశవొస్తూవుంటుందట! ఒకరిమీద ఒకరు విప్లవం చెయ్యాలట! అలా చేస్తే, ఎప్పటికో వర్గాలులేని సంఘం ఏర్పడుతుందట! అప్పుడు అందరికీ అన్నం దొరుకుతుందట!

ఈ వాదం అతనికి ఏమాత్రం నచ్చలేదు.

ఏమిటిది?

అందరికీ అన్నం దొరికే ఏర్పాటు చెయ్యటానికి, ఇప్పుడు అన్నం బాగా దొరికేవాళ్ళు అంగీకరించరట! వాళ్లు ఎదురు తిరుగుతారట! అందుకని వాళ్లమీద విప్లవం చేసి, అన్నంలేనివాళ్లందరూ ఒకటై, రాజ్యాధికారం స్వాధీనం చేసుకొని అందరికీ అన్నం దొరికే విధానం ఆచరణలో పెట్టాలట!

"ఈ సిద్ధాంతం నేను ఒప్పుకోను" అన్నాడు సీతారామారావు.

"ఎందుకని?"

"అందరికీ అన్నం దొరకటానికి అన్నం ఉన్నవాళ్ళు ఎదురు తిరుగుతారనేది వొట్టిభూటకం. సంఘంలో యెంత

మంది అన్నంపున్న వాళ్ళు, లేనివాళ్ళకు సహాయంచెయ్యటం లేదు? తమ ఆస్తిపాస్తులన్నీ నాశనం అయినా లెక్కచెయ్యకుండా సహాయం చేస్తున్నారే!"

"వాళ్ళు చేసేది కీర్తికోసం."

"దేనికోసమైనా కానియ్. ఆర్థిక పరిస్థితే కాక మరొక గుణంకూడా మానవునిచేత మంచిపనులు చేయిస్తుందని అంగీకరిస్తున్నట్లేగా!"

"కీర్తిదాహం తీరగానే వీళ్ళు అన్నం లేనివాళ్ళని మోసంచేస్తారు."

"అన్నం లేనివాళ్లు అన్నం దొరగ్గానే మిగిలిన వాళ్లని మోసం చెయ్యరూ?"

"చెయ్యరు."

"ఎందుకని?"

"....."

"అధికారంలోకి రావటానికీ ప్రజలను సుఖపడేటట్లు చెయ్యడానికీ అన్నం లేకపోవటం అర్హత అవటంలో అర్థంలేదు. అన్నం లేకపోవడం అనేక అనర్థాలకు దారి తీస్తుంది. ఇటువంటి అనర్థాలకు ఆటపట్టయినవాళ్లు మాత్రమే విప్లవంచేసి ప్రజల్ని సుఖపెట్టగలరు అనటం-ప్రసవించటంకంటేగర్భస్రావంవల్లే మంచిపిల్లలు పుడతారన్నట్టు వుంటుంది.

అసలు ఇంకొక సంగతి. అన్నం లేకపోవడంవల్ల విప్లవం చేసేశక్తి, తర్వాత ప్రజల్ని సుఖపెట్టే ఉదారత్వం

కలిగి, అన్నం పుంటంవల్ల కీర్తి ప్రాహం పెచ్చి ప్రజల్ని మోసం చెయ్యటం జరిగితే,అందరికీ అన్నంకావాలని గోర గోపటం ఎందుకు? అన్నం లేకపోవటమే మంచిదేమో!"

ఈ విధంగా వాదించి, ఆ దించి "ఈలోగానే మనం చస్తాం. మనం చచ్చినతర్వాత ఎవరేమైతే మనకేం?"అనుకునేవాడు.

ఇలా ఆలోచించుకుంటూవుండగా అతనికి అకస్మాత్తుగా ఆధ్యాత్మికవాదంమీదికి మనస్సుపోయేది.

"మన మహాఋషులు ఈ సమస్యని పాశ్చాత్యులకు మల్లేకాకుండా, సక్రమమైన దృష్టితోనే చూశారు" అనుకునేవాడు. పాశ్చాత్యులకుమల్లే ఆకలిని తీర్చటంకాకుండా, ఆకలిని జయించటానికి ప్రయత్నించారు. పొగతాగి బతికే వాళ్ళని మన పూర్వగ్రంథాలు చెపుతున్నాయి. ఆ పద్ధతి ఏదన్నా ఉంటే బాగుండును" అనిపించేది అతనికి.

కాని, వెంటనే మనం ఈ గడియ చచ్చినా చచ్చిపోచ్చుగదా! ఈ ఆరాటం మనకి ఎందుకు? అనిపించేది. వాళ్ళుచెప్పే నియమాలన్నీ పాటిస్తాం.సర్వసంగ పరిత్యాగం చేస్తాం. మహారణ్యాల్లోకిపోయి ఘోర తపస్సుచేస్తాం. ఈ పనంతా చెయ్యాలంటే కొన్ని సంవత్సరాలు పడుతుంది గదా! యెన్నో కష్టాలను ఎదురోకవలసి వొస్తుందిగదా! ఇన్ని అనుభవించి,ఫలితం పొందకుండా మరణిస్తే! ఇన్ని సంవత్సరాలు బతుకుతామనే నిశ్చయం ఏమీ లేదయ్యే - ఈలోగా ఏదో ఒకటి చెయ్యటానికి!ఏసుఖమూ అనుభవించ కుండా మరణిస్తే జీవితం వృధా అయిపోయినట్టేగా!

అతనికి పునర్జన్మలో నమ్మకం లేదు.

అప్పుడు అతనికి మరొక ఆలోచన తట్టేది.ఒకవంద సంవత్సరాలన్నా బతుకుతామనే గ్యారంటీ లేకపోతే యీ ప్రపంచంలో ఏమీ చెయ్యలేం. నువ్వు ఎప్పుడు చచ్చినా చావొచ్చు-ఇప్పుడు నాతో మాట్లాడుతూ చచ్చినా చావొచ్చు. కాని, రొన్ని వందల సంవత్సరాలు బతుకుతా ననేఉద్దేశంతో పనిచెయ్యి అంటే ఏతెలివిగలవాడికి చెయ్యి బుద్ధి అవుతుంది?

ఎటు ఆలోచించినా, ఎంతలోతుకి పారచూచినా "చచ్చేవరకు బతకటం తప్ప ఈ ప్రపంచంలో చేసేది ఏమీ లేదు" అనే నిశ్చయం అతనికి రూఢి అవుతూవుండేది.

ఒకరోజు శీనయ్యని అడిగాడు-"ఏం శీనయ్యా, నాలుగు రోజులనుంచి ఎక్కడా కనపడటంలేదు?"

"నర్సారావుపేట వెళ్ళి వొచ్చానండి"

"ఎందుకు?"

"బండిమీద సామాను వేసుకు వెళ్ళాను."

పెళ్ళికోసం అతను పడే కష్టంచూస్తే, సీతారామారావుకి విచారం కలిగింది. శీనయ్య మనస్సునికి పెళ్ళి లేకుండా వుంటం, పిల్లలు కలక్కుండా వుంటం, పని చెయ్యకుండా వుంటం అసలే విచారణే రాదు—అదృష్టవంతుడు.

"పెళ్ళిచేసుకుని ఏం చేస్తావు శీనయ్యా?"

అతని కీ ప్రశ్న అర్థంకాలేదు. తన తాత, ముత్తాత తాత—అంతా పెళ్ళిచేసుకున్నారు. తనూ చేసుకుంటాడు. తన పూర్వులు పిల్లల్ని కన్నారు. తనూ భగవంతుడి దయ

వుంటే కంటాడు. తన పూర్వాలు బతికారు. తనూ బతుకు తాడు. ఇందులో 'ఎందుకు?' అనే ప్రశ్నకు తావులేదు. 'ఏం చేస్తావు?' అనే ప్రశ్నేలేదు.

శీనయ్యకు ఏమీ తోచక, అతన్ని చూస్తూ నుంచున్నాడు.

"పిల్ళిచేసుకొని మళ్ళీ ఇక్కడకు వస్తావాశీనయ్యా?"

"రాను" ఖచ్చితంగా చెప్పాడు.

"యెందుకని?"

"నాకిక్కడ ఏముంది? బందుగులూ అంతా ఆడే వున్నాగు. కూలో నాలో చేసుకుంటే పొట్ట గడుస్తుంది."

"మరి ఇప్పుడెందుకు వచ్చావు?"

"ఆడ, పొట్ట గడుస్తుందిగాని, డబ్బు మిగల్దు. డబ్బు మిగుల్చుకు పోదామని వొచ్చా...."

వెళ్తాడు. వెళ్ళి పిల్లల్నికని, కుటుంబయాత్ర సాగిస్తాడు.ఆపిల్లలు ఎదిగి కూలో నాలో చేసుకుని బతుకుతారు. చచ్చేవరకూ చాకిరీచేస్తూ, ఎప్పుడో పుటికిన రాలి పోతాడు.నిత్యం జరగవలసినవిషయాల్లో అతనికి'ఎందుకు?' అనే ప్రశ్నేరాదు.అలా జరుపుకుపోతూనేవుంటాడు.

ఏమీ తెలియని శీనయ్య సుఖపడుతున్నాడు;అన్నీ తెలిసిన రామయ్యతాతా సుఖపడుతున్నాడు. మధ్య తనకు వొచ్చింది బాధ. అన్నంకోసం తాపత్రయపడటం నీచం. అన్నీ తెలిసీ, తెలియనట్టు బతకటం ఆత్మవంచన-ఈ రెండూ తనకు పనికిరావు.

తాను ప్రయత్నించడు - అన్నం దానంతట అది వొచ్చి పడాలి. తాను ప్రయత్నించడు - సుఖాలు వాటం తట అవే వొచ్చి తన్ను ముసురుకోవాలి. కష్టాలు తనదగ్గ రకు రాగూడదు. తను ఊహించినవన్నీ జరగాలి. తాను ప్రయత్నించడు-ప్రయత్నించి నెరవేర్చుకోవటం కూడా గొప్పేనా? మూలనడిన్న ముసలమ్మ చేస్తుంది ఆపని. ఇక తన ప్రత్యేకత ఏముంది? ఏ ప్రయత్నం లేకుండా అలా జరిగి పోవాలి జీవయాత్ర. లేకపోతే చస్తాం. అనేక కష్టాలుపడి చిల్లరవిషయాలకు అనేక సుంది తోపోట్లాడి బ్రతికింద్దాని కంటే చస్తే ఏం? ఆ పనిమాత్రం మన చేతుల్లో ఉన్నపనే!

సీతారామారావు చెయ్యగలిగిన పనుల్లో ముఖ్య మైనది ఇదే!

3

"నాన్నా!" బయటనుంచి పరిగెత్తుకొని వొచ్చి పిలిచింది పాప.

"ఊఁ" పలికాడు సీతారామారావు.

"నీకోసం ఎవరో వొచ్చారు."

"రానివ్వు"

"గదిలో కూర్చున్నారు."

"కూర్చోనివ్వు."

"రోజూ వొస్తారే...."

"ఎవరు?—" కుతూహలంగా అడిగాడు సీతా రామారావు.

"మీ స్నేహితులు."

స్నేహితులనేమాట వినేటప్పటికి సీతారామారావు గబగబా గదిలోకి వెళ్ళాడు.

సీతారామారావూ స్నేహితులూ మాట్లాడు కున్నారు.

"అసలు ప్రాణం అనేది ఎలావొచ్చింది?" అడిగాడు సీతారామారావు.

"అనాది పదార్థాలు రెండు—జడం, చైతన్యం" అన్నారొకరు.

"చైతన్యం ముఖ్యం. ప్రపంచాన్ని ఆడించేది అదే" అన్నారు ఒకరు.

"చైతన్యం శాశ్వతం, జడం పుడుతుంది.గిడుతుంది" అన్నారు మరొకరు.

"తప్పు. రెండూ అనాది పదార్థాలే..." అన్నారు మొదటివారు. "జడం రూపం మారుస్తూ వుంటుంది. గనక అశాశ్వతంగా కనుపిస్తుందిగాని అదీ శాశ్వతమే! మనం మరణిస్తే శరీరాలు నశిస్తయి. అంటే మట్టిలో కలుస్తుంది. మట్టిగా ఉంటుంది. అందులోనుంచి మరొకరూపం పుట్టుకొస్తుంది."

"శరీరానికీ శవానికే భేదం ఏమిటీ?" అడిగాడు సీతారామారావు.

"ఒకదానికి చేతనశక్తి వుంది: ఒకదానికి లేదు" అన్నారు వొకరు.

"ఏమయింది?" అడిగాడు సీతారామారావు.

"శరీరాన్ని విడిచిపోయింది" అన్నారొకరు.

"ఎక్కడికి పోయింది?"

"జీవాత్మ పరమాత్మలో కలిసింది."

"అయితే జడానికి సంబంధంలేకుండా, ప్రత్యేకంగా చైతన్యం ఉంటానికి వీలుందనేనా?"

"ఎందుకు లేదు?" అన్నారొకరు.

"లేదు." అన్నారొకరు.

"అసలు చైతన్యం అనేది వేరుగా ఉందని అనుకోవటం ఎందుకు?" అడిగాడు సీతారామారావు.

"లేకపోతే కదిలే వస్తువులు కదలకుండా యెందుకు పోతయ్యో చెప్పలేం, మనిషి చావటం బ్రతకటం ఎలా జరుగుతుందో చెప్పలేం...."

"కారు కదిలేటప్పుడు ఏ చేతనశక్తి ప్రవేశించింది! ఆగినప్పుడు ఏ చేతనశక్తి పోయింది!" అని అడిగాడు సీతారామారావు...

"మీరు అన్నదే నిజం. మనవాళ్ళు చెప్పినవన్నీ పాత సిద్ధాంతాలు. తర్కానికి నిలవ్వు. పదార్థం అనుక్షణం పరిణామం పొందుతూవుంటుంది. ఆ పరిణామంలో ఒక దశలో ప్రాణం వొచ్చింది. అంతేగాని బయటనుంచి వొచ్చిందీలేదు, బయటకు పోయిందీలేదు..." అన్నారు.

"ఎట్లా వొచ్చింది?"

"కారుకి మల్లేనే – కొన్నిటి కలయికవల్ల"

"ఈ కలయికకు కారణం వుందా?" అడిగాడు సీతా రామారావు.

"లేదు" అన్నారు అంతా ఏకగ్రీవంగా. సీతారామ రావుగ్గాని, అతని స్నేహితులగ్గాని భగవంతునిలో నమ్మకం లేదు.

"ప్రాణం ఒక ప్రయోజనాన్ని సాధించటానికి పుట్టిందా?"

"లేదు"

"ఎందుకు పుట్టింది?"

"నిర్నిమిత్తం"

"నిర్నిమిత్తంగా పుట్టి,పరిణామం చెందేదాని ఫలితం మనకు విదితం.అసలు దానికే ప్రయోజనం లేనప్పుడు మన జీవితానికి ఆదర్శం అనీ ప్రయోజనం అనీ ఎక్కడనుంచి వొస్తుంది.నిర్నిమిత్తంగా పుట్టాం!"అని తేల్చివేశాడు సీతా రామారావు.

"కాదు మానవుడికి ఆలోచించుకునే శక్తి,ముందుకు చూచే శక్తివుంది.అందుకని తన జీవితానికి ఒక ఆదర్శం పెట్టుకొని, ప్రయోజనయుక్తంగా చేసుకుంటాడు"అన్నారు వొకరు.

"ఎందుకు?"

"అంతా సుఖపట్టానికి"

"ఇప్పుడు మనం మాట్లాడిందాన్నిబట్టి సుఖందుఃఖా

అనేవి మానవ కల్పితాలే! కొన్ని ఉద్రేకాలకు ఆనంద పడటం, కొన్ని ఉద్రేకాలకు విచారించటం నేర్చుకున్నాం. మనం కావాలని తెచ్చిపెట్టుకున్న వీటికి ఇంత ఆర్భాటం ఎందుకు?" అన్నాడు సీతారామారావు.

"అయితే ఏం చెయ్యమంటావు?"

"ఏదో ఒకటి చెయ్యమనాలనిగానీ చెయ్యాలనిగానీ ఎక్కడుంది?"

"ఏమీ చెయ్యనక్కర్లేదనిమాత్రం ఎక్కడుంది?" అని అడిగారు వొకరు.

"లేదు"అన్నాడు సీతారామారావు.

"లేనప్పుడు యేమీ చెయ్యక్కర్లేదని యెందుకు చెప్పటం?"

"మానవుడు ఏదోవొకటి చెయ్యాలని దురభిప్రాయ పడుతున్నాడు గనుక."

"మీరు నిరాశ వెదజల్లుతున్నారు" అన్నారు వొకరు."అవును:మనిషికీ పశువుక్కీ అదేభేదం.పశువుకు ఆశా లేదు-నిరాశాలేదు,మనిషికి రెండూఉన్నాయి" అన్నాడు సీతారామారావు.

"ఇంతకీ తేలింది ఏమిటి?"

"తేలటానికి ఏముంది? మనం నిర్మిమిత్తంగా పుట్టాం. నిర్మిమిత్తంగా బ్రతకటానికి పేలుంటే బ్రతకటం_లేకపోతే చావటం!" అని ముగించాడు సీతారామారావు.

నాలుగో ప్రకరణం

అసమర్థుని మేనమామ

సీతారామారావు ఇంట్లోనుంచి బయటకు వొచ్చే టప్పటికి డ్రాయరువిూద కవరు వొకటివుంది. అది తన మేన మామ రాసిన ఉత్తరం అని గ్రహించుకున్నాడు. అంతకు ముందు వందరూపాయిలు కావాలని తను ఉత్తరం రాస్తే ఆయన జవాబివ్వలేదు. దానివిూద ఆతనికి మండి ఇంకొక ఉత్తరం రాశాడు–

"నాకు వందరూపాయి లివ్వటంఅంటే ఇప్పుడు నీకు కష్టంగావుంది. ఒకప్పుడు నేను నీకు చేసిన సహాయం మరచి పోయినట్టున్నావు. నల్భైవేల బాకీకి పదిఎకరాలు కట్టు కున్నానసు. జ్ఞాపకం ఉందా? నాకు మళ్ళీ ఒకప్పుడు డబ్బు కావలసివొస్తే ఆ పదిఎకరాలూ పదివేలకు నువ్వే కొనుక్కు

న్నావు. నువ్వుచేసిన పనులు నాకు తెలియక పూరుకో లేదు. పొలం అమ్మిపెట్టమని నేను నీకు ఉత్తరం రాస్తే ఎవ్వరూ మొగ్గిరావటంలేదనీ, ధరలు పడిపోయినయ్యనీ ఆవంకా ఈవంకా చెప్పి, పదిహేనువందలుఖరీదుచేసే ఎకరం, వెయ్యి రూపాయాలకు కొనుక్కున్నావు - అన్నీ నాకు తెలుసు. ఎందుకులే, తింటేతిన్నాడులే అని పూరుకున్నాను.

నీకు ఇంతసహాయం చేసినా కాస్తవిశ్వాసం అయినా చూపకపోయావు! నా డబ్బు ఇంతతిని, నాకు ఇబ్బందిగా ఉందని రాస్తే వందరూపాయాలు పంపటం నీకు కష్టంగా వుందా?

ఈ మధ్య మా ఇంటికి ఒక కుక్కవొచ్చింది. దానికీ నాకూ సంబంధం ఏమీలేదు ఏజన్మలోనూ ఉండిఉండదు. ఉంటే నీ ద్వారానే ఉండాలి. దానికి ఒకపూట అన్నం వేశాను. అప్పటినుంచి అన్నంపెట్టినా పెట్టకపోయినా రోజూ వొస్తూవుంటుంది. రాత్రిపూట ఇల్లు కాపలాకాస్తుంటుంది. కుక్క విశ్వాసంగల జంతువు.

నీ కిచ్చిన డబ్బుకి ఎన్నికుక్కలు వొచ్చేవా అని ఆలోచిస్తున్నా ప్రస్తుతం."

ఇదీ మేనమామకి వ్రాసిన ఉత్తరల సారాంశం. ఆ వుత్తరానికి మేనమామ రాసిన జవాబు ఆ కపరు. అది చూడగానే సీతారామరావు మిక్కిలి కుతూహలంతో తీసుకొని చించాడు. తన ఉత్తరంతో మేనమామకి బుద్ధి వొచ్చి వుంటుం దనుకున్నాడు. తను తెలివితక్కువవల్లకాక మంచి తనంవల్లే అతనికి సహాయం చేశానని తెలిసి ఉంటుంది.

ఇన్నాళ్ళూ మోసం చేశానని మురుసుకుంటూ ఉండి ఉంటాడు; తన ఉత్తరం అతనిలోగం కుదిర్చి ఉంటుంది అనుకున్నాను. ఉమించవలసిందని బతిమాలుతూ రాసిఉంటాడు; తప్పకుండా వందరూపాయిలుమనియార్డరు చేసిఉంటాడు. ఉత్తరంకంటే మనియార్డరు ఒకరోజు ఆలస్యంగా వొస్తుంది.

ఇలా ఆలోచిస్తూ ఉత్తరం చదవటం మొదలు పెట్టాడు. ఉత్తరం చాలా పెద్దవుత్తరం. మేనమామ ఇలా రాశాడు:

"నాయనా! నీ వుత్తరం అందింది. ఇంతకుపూర్వం నువ్వు పందరూపాయల కోసం వ్రాసిన వుత్తరం కూడా అందింది. నీకు నందరూపాయలు పంపటం ఇష్టంలేకపోవటం వల్ల, జవాబు వ్రాయటం అనవసరం అని వూరుకున్నాను. నీ రెండో వుత్తరం ఇవాళే అందింది. నీ మనస్సులోవున్న వుద్దేశాలన్నీ బయటకువచ్చినందుకు చాలా సంతోషించాను. నా మనస్సులోవున్న వుద్దేశాలను చెప్పుకోటానికి అవకాశం యిచ్చావు.

నేను నీ విషయం చాలారోజులనుంచి కనిపెడుతూనే వున్నాను. నీ తండ్రి, తాతవిషయంకూడా నేను పూర్తిగా ఎరుగుదును. మొ తంమీద మీ కుటుంబంలో ఒకవ రుణం ఉంది. మీది ప్రత్యేక సృష్టి అనీ, మిగిలినవాళ్ళకంటే గొప్పవాళ్ళనుసీ అనుకుంటారు. పదిమందిచేత పొగిడించుకోవాలనే వాంఛ మీ అందరికీ వుంది.

ఆ వాంఛ తీర్చుకోటానికి నీకుటుంబం కొన్ని మంచిపనులూ, కొన్ని చెడుపనులూ చేసింది.

మీ దాతృత్వంవల్ల కొంతమందికి లాభించినా, మీ స్వాతిశయంవల్ల కొంతమంది ఎంత బాధపడేవారో మీకు తెలియదు. నీ చిన్నతనంలో నీ తల్లి వున్నప్పుడు నేను మీ యింట్లో వుండేవాణ్ణి. ఆ సిపాస్తులు లెక్క చూచుకోటం, జమా ఖర్చులు చూచుకోటం, పొలంవెళ్ళి వ్యవసాయం చేయించుకోటం, అజమాయిషీ కనుక్కోటం, మీ నాన్నకు తాను చెయ్యవలసిన పనులుగా కనపడేవి కావు. కొందరు కష్టపడటానికీ, తాపత్రాయపడటానికీ. కొందరు సుఖపడటానికీ జీవితంలో ఆనందం అనుభవించటానికీ పుట్టారని మీనాన్న అభిప్రాయం. మేము ఇటువంటిపనికి బాగా పనికివస్తాం అనే నమ్మకంతో నన్ను పిలిపించి మేనేజిమెంటు ఒప్పచెప్పాడు.

మేము మీ యింట్లో అడుగు పెట్టినప్పటినుంచీ పడిన బాధలూ, అనుభవించిన కష్టాలూ ఇతర్లకు తెలియవు. అప్పుడు మేం, అంటే మా కుటుంబం, కొద్దిగా చిక్కుల్లో వుండటంవల్ల, నా చెల్లెలిని వివాహం చేసుకోవటంవల్లే నీతండ్రి చాలా ఔదార్యం చూపడనీ, ఇక నన్ను తీసుకు వొచ్చి ఇంట్లో పెట్టుకొని పోషించటం ఆయనకే తగిందనీ ఇతర్లు అనుకునేవారు. కాని, మీ యింట్లో నేనుపడ్డ సుఖం చచ్చి ఏస్వర్గాన వుందో నీ తల్లి- ఆమెకు తెలుసు.

మమ్మల్ని నీ తండ్రి ఎన్నడూ తనతో సమానంగా చూచేవాడు కాదు. ఒక్క తనతోనేకాదు; తనవంశంలో పుట్టిన ఎవరితోనూ సమానంగా చూచేవాడుకాదు. మేం ఆయన కిళ్ళకు ఎప్పుడూ పరాయివాళ్ళంగానూ, లెక్కచ

వాళ్ళంగానూ, ఆయన మంచిమీద బతుకుతున్న వాళ్ళం గానూ, నౌకర్లంగానూ కనిపించే వాళ్ళం. ఒకమాటతో, ఒక చూపుతో మేం తక్కువవాళ్ళం అనే విషయం ఆయన అనుక్షణం జ్ఞాపకం చేస్తూనే ఉండేవాడు. ఇవన్నీ ఆయన తెలిసి చేశాడని నేను అనను. "నా వంశం" అనే అహంకారం ఆయనలో జీర్ణించుకుపోయి తెలియకుండానే చేశాడు. ఎట్లాచేస్తే ఏమి? పర్యవసానంగదా ముఖ్యం! పర్యవసాదినం నిత్యామేం బాధపట్టమే.

ఒక్కసారయినా తన సహపంక్తిని నన్ను భోజనం చెయ్యనిచ్చాడేమో మీవాళ్ళని అడుగు. అనేకమంది చుట్టాలు వొస్తుండేవాళ్ళు; స్నేహితులు వొస్తుండేవాళ్ళు; వాళ్ళతో కూర్చొని సరదాగా మాటలు చెప్పుకుంటూ అన్నంతినే ప్రాప్తం నాకు ఎప్పుడూ లేదు. అప్పుడప్పుడూ నేనే వాళ్ళకు అన్నం పడ్డించవలసి వచ్చేది. నేను పళ్ళెం తీసుకురాగానే "చేతులుకడుక్కున్నావా?" అని అడిగేవాడు మీనాన్న. ఆ మాటలో, ఆ మాట అడుగుతూ చూచే చూపులోఎంతవిషం, ఎంతఅహంకారం, ఎంత పరుషత్వం, ఉండేది? నావొళ్ళు భగభగ మండేది. ఆ పళ్ళెం విసిరి పుచ్చుకొని మొహానకొట్టి వెళ్ళిపోదా మనిపించేది.

మీవాళ్ళంతా అన్నాలు ముగించుకునేవరకూ మేము అన్నంతినే ప్రాప్తంలేదు. మీవాళ్ళ భోజనాలైంతరువాత మీ మేనత్తకూడా భోజనం చేసింతర్వాత వాళ్ళందరికీ తమలపాకులు ఇచ్చి, అప్పుడు వొచ్చేది నా చెల్లెలు నన్ను

పిలవటానికి. ఏదో దొంగతనం చేస్తున్నట్టు భయపడుతూ 'రా అన్నాయి' ని పిలుచుకుపోయి అన్నం పెట్టేది. దాని ఇంట్లోనే అది దొంగకావలసిన కర్మం పట్టింది.

నేను మామూలుగా కంచంలో తినేనాణ్ణి. ఒకరోజు ఎందుకనో విస్తరిలో వొడ్డించింది మీ అమ్మ. మీ నాన్న చూచి, "విస్తరి కావలసివచ్చిందే యిక్కడికి వొచ్చేటప్పటికి?" అన్నాడు ఆరోజు మీఅమ్మ ఎంత ఏడ్చిందో నీకేం తెలుసు! "మనం వెళ్దాం అన్నాయి" అని కుళ్ళికుళ్ళిఏడ్చింది.

నేనే ఇతరులకు తెలిస్తే నవ్వుతారని ఊరుకోబెట్టాను.

అది మీయింట్లో ఏం సుఖపడ్డది?

అది ఏరోజయినా పరిశుభ్రంగావుంటే, "మాఇంటికి వచ్చి ఎన్ని నేర్చుకున్నావే! పులినిచూది నక్క వాతపెట్టుకొని, పుచ్చి చచ్చిందట" అనేది నీ మేనత్త.

పనిపాటలుచేసి ముచికిగావుంటే, "పుటకతో రావాలిగాని, నేర్చుకుంటే వస్తయ్యా?" అనేది నీ మేనత్త.

తన ఇంట్లో తానే పరాయిదానికిమల్లే బతికింది నా చెల్లెలు-బతికిన నాలుగురోజులు! బిచ్చగాడికి బిచ్చం వెయ్యటానికిగానీ, ఎవ్వరికైనా అన్నం పెట్టటానికిగానీ దాని ఇంట్లోనే దానికి చోరవలేదు. కూరలు ఏమి వండవలసిందీ నీ మేనత్తను అడిగి వండవలసిందే. నీ మేనత్త ఎటువంటిదో నీకు తెలుసుగా! అయినా ఆవిడసని ఏంప్రయోజనం? మీ వంశంలో అందరికీవున్న గుణమే ఆవిడకీవుంది.

అవిడకీ అవిడ భర్తకీ తగాదా ఎందుకొచ్చిందో నీకు తెలుసా? దానికి మీనాన్నే కారణం. "నాకుటుంబం గొప్పది. నీకుటుంబం ఎందుకూ పనికిమాలింది. నీకిచ్చి నా గొంతుకోశారు" అని ఎప్పుడూ నానామాటలు అంటూ ఉండేదట భర్తని. అతను ఏంచెప్పినా చేసేది కాదట. "నేనెప్పుడైనా మా ఇంట్లో పనిచేసి ఎరుగుదునా?" అనేదట. మాట్లాడితే అలిగి మీ ఇంటికొచ్చి కూర్చునేదట. అతడు ఏమన్నా అంటే వొచ్చి మీనాన్నకి చెప్పేది. మీ నాన్న వెళ్ళి అతణ్ణి నానాదుర్భాషలూ ఆడివొచ్చేవాడు.

ఆ రోజుల్లో అతనికి, మీ మేనత్తతో మాట్లాడుతున్నా పోట్లాడుతున్నా మీనాన్నతో మాట్లాడుతున్నట్లూ మీ నాన్నతో పోట్లాడుతున్నట్లూ ఉండేదట! అప్పుడప్పుడూ పొరపాటున ఆమెని మీ నాన్నపేరేపెట్టి పిలిచేవాడట. ఆమె పక్కనవుంటే మీ నాన్న పక్కనవున్నట్టే ఉలడేదట! అతను పిసిగిపోయాడు; మీ మేనత్తతో కాపరం చెయ్యలేకపోయాడు.

ఒకరోజు మీ నాన్న తిడుతుంటే ఉండబట్టలేక. "నేను పెళ్ళిచేసుకుంది నిన్నా, నీ చెల్లెలినా?" అని అడిగేశాడు.

"నోరుముయ్" అని గదమాయించాడు మీనాన్న.

"ముందుచెప్పు. ఈవిషయం ఇవ్వాళ తేలవలసిందే. నేను ఎవరితో కాపరంచెయ్యాలో స్పష్టంగా తేలాలి!" అని గర్జించాడు సీమేనత్త మొగుడు.

"నువ్వు ఎవ్వరితోనూ చెయ్యక్కర్లేదు" అన్నాడు మీ నాన్న.

"ఎందుకని?"

"నువ్వు ఎవర్నీ పెళ్ళిచేసుకోలేదు" అన్నాడు మీ నాన్న.

"నీ చెల్లెల్ని చేసుకుంది ఎవరు?"

"నా చెల్లెలే నిన్ను చేసుకుంది."

"ఒక్క నీ చెల్లెల్తోనే పోనివ్వాకు. నీవు, నీ పితా మహులు, నీ వంశం, నీఅహంకారం అన్నీకలిసి నన్ను పెళ్లి చేసుకొని, భూతాలై నన్ను వేపుకుతింటున్నై. నాప్రాణాలు తీస్తున్నై!" అని అరిచాడు నీమేనత్త మొగుడు.

అక్కడితో మీ నాన్న అనరాని మాటలన్నీ అని "నా చెల్లెలు నా దగ్గరే ఉంటుంది" అని నీ మేనత్తను తీసుకువొచ్చాడు. తర్వాత కార్పణ్యాలు పెరిగినై. మళ్ళీ వాళ్ళు కలవటానికి నీ వంశ గౌరవమే అడ్డొచ్చింది.

తన వంశంమీద ఇంత దురభిమానం వున్న ఆడ వాళ్ళు ఎక్కడైనా కాపరం చేస్తారా నాయనా? వంశ పారంపర్యా వొచ్చే ఆచారాలు, అలవాట్లు, అభిరుచులు, భావాలు, అన్ని కుటుంబాల్లోనూ ఒకేరకంగా ఉండమంటే ఎట్లా వుంటాయి? ఎదటివాళ్ళ భావాలంటే సానుభూతి వుంటే కుదురుతుందిగాని, వాళ్ళ సంస్కారం భిన్నంగా ఉంది గనక, వాళ్ళని నీచంగా చూస్తుంటే ఇద్దరు వ్యక్తులు కలిసి ఎన్నాళ్ళు కాపరం చెయ్యగలరు?

నీమేన త్త గతి యింతే అయింది. భర్తను విడిచిపెట్టి వప్పటినుంచీ మీ ఇంట్లోనే ఉండేది. చిన్నప్పుడే భర్త వొదిలిపెట్టటం మూలాన,కోర్కెలుతీరక, కోపం,అసూయ, ద్వేషం పెంచుకొని ఎప్పుడూ రుసరుసలాడుతూ వుండేది. ప్రతివాళ్ళతోనూ గిల్లికజ్జా పెట్టుకుంటూ ఉండేది. మేమేమీ అనకపోయినా, మేం ఎంత వొదిగి వొదిగి బతుకుతున్నా, మీనాన్నతో ఎప్పుడూ ఏవేవో కొండాలు మూమీదచెపు తూనే ఉండేది. మీ నాన్న వొచ్చి మూమీద అవులుచేసే వాడు. అవులు చేసినా పరవాలేదు. తప్పు చేస్తే-పెద్దవాడు తాను చెయ్యవచ్చు - మేము పడావొచ్చు. కాని అయన ఎంతసేపూ... "నా చెల్లెలికి మీరు .... ఎదురు చెపు తారా?" అనే అనేది. ఆమె తన చెల్లెలు: తను పుట్టిన వంశంలో పుట్టింది కనక గొప్పది. మేము పరాయివాళ్ళం: పరాయివంశంలో పుట్టాంకాబట్టి తక్కువవాళ్ళం. అమెను మేం ఏమీ అనగూడదు. అనటం మీవంతు, పడటం మూవంతు!

ఇలా బతికాం మీయింట్లో. చివరికి నువ్వు మీ అమ్మ కడుపున పడ్డావు. మీ అమ్మ దిగులు తీరింది. మీ అమ్మకు మళ్ళీ పూర్వపు కళాకాంతులు వొచ్చినై. తన కష్టాలన్నీ మరచిపోయింది. నువ్వు పుట్టింతర్వాత ఆమె మళ్ళీ కొత్తజన్మ ఎత్తినట్లు కనిపించేది. కాని నువ్వు పెరిగి వొస్తున్నకొద్దీ మీ అమ్మకు మళ్ళీ విచారం ప్రారంభం అయింది. ఒకరోజు నాతో "వాడు మనవంటివాడు కాదు

అన్నాయి, అన్నీ వాళ్ళ నాన్న పోలికలే!" అని కన్నీరు పెట్టుకుంది.

ఆమె ఆమాట అన్నతర్వాత నేను నిన్ను శ్రద్ధగా పరిశీలించాను. ఆమె అన్నమాట నిజమే! నీలో అన్నీ మీ నాన్న లక్షణాలే కనిపించినయి. అంత చిన్నతనంలోకూడా నువ్వు మీ నాన్నని అనుసరించటానికి ప్రయత్నిస్తూ వుండే వాడివి. కుర్చీఎక్కి మీనాన్న కూర్చున్నట్టు కూర్చొని కాలు ఆడిస్తూ వుండేవాడివి. ఇంట్లోకివచ్చి మమ్మల్ని మీనాన్నకిపుల్లలే అవులుచేస్తూ వుండేవాడివి.

ఒకొక్కప్పుడు మీనాన్న పిచ్చిచూపులు చూస్తుండేవాడు. ఎప్పుడోఅకస్మాత్తుగా ఒక్కక్షణం నీకూ ఆ చూపులే వొచ్చేవి. మీనాన్నకు మాట్లాడుతూ మాట్లాడుతూ మధ్యమధ్య మీసం కుడిచేత్తో దువ్వే అలవాటు ఉండేది. అంత చిన్నతనంలో నువ్వూ అట్లాగే చేస్తుండే వాడివి. మీవాళ్ళంతా నిన్ను చూచుకొని మురుసుకుంటూ వుండేవాళ్ళు. "పులికడుపున పిల్లిపిల్ల పుడుతుందా?" అని మీనాన్న నిన్నుచూచి సగర్వంగా మీసం దువ్వేవాడు.

"అచ్చంగా వాళ్ళ నాన్నే అన్నాయి..." అని నాతో చాటుగా చెప్పుకొని నీతల్లి కన్నీరు పెట్టుకునేది.

అక్షరాలా ఆమె భయపడినట్లే జరిగింది. తల్లి గనక రాబోయే అపాయాన్ని ముందే పసిగట్టింది. ఆమె అదృష్ట వంతురాలు. నీవు పెద్దవాడ వయింతర్వాత నీజీవితంచూచి బాధపడకుండా దాటిపోయింది. నేను వొచ్చేశాను.

నీకొక అనుమానం రావొచ్చు. మీ ఇంట్లో అంత కష్టంగా వున్నప్పుడు నేను అన్నాళ్ళు ఎందుకు ఉండవలసి వొచ్చిందా! అని. నా చెల్లెలుకోసం వున్నాను. మీ ఇంటి పరిస్థితి చూచింతర్వాత, దాన్ని విడిచిఉంచటం ప్రమాదం అని బోధపడింది. నేను ఆమెతోపాటు మీ ఇంట్లో ఉండక పోతే, ఆమె ఎక్కువరోజులు బతికేదికాదు. అందుకని అది ఉన్నంతవరకూ అన్ని అవమానాలు సహించి అంటి పెట్టుకున్నాను.

అనేకసార్లు మీ నాన్న చేతులో, మీ మేనత్త చేతులో నేను పడుతున్న అవమానాలు చూచి, "నువ్వు వెళ్ళిపో అన్నాయీ, ఇక్కడ ఉండొద్దు" అని బతిమాలేది నా చెల్లెలు.

"మరి నువ్వో అమ్మా?"

"నాకు తప్పదు."

"నువ్వు ఉన్నన్నాళ్లూ నాకూ తప్పదు అనుకుంటా అమ్మా!" అనేవాణ్ణి.

నేను మీ ఇంట్లోఉంటం నాకంటే మీకుటుంబానికే ఎక్కువలాభం. నేను అహర్నిశలూ మీ పొలంమీద పని చేశాను, చేయించాను. బాకీలు ఒక్క దమ్మిడీ పోకుండా వసూలుచేశాను.

కాని ఏంలాభం? ఒకపక్క నేను రొమ్ములు పగల గొట్టుకొని డబ్బు కూడబెడుతుంటే, మీనాన్న కాలిమీద కాలువేసుకొని తన చిత్తంవచ్చినట్లు ఖర్చుపెట్టేవాడు.నాకు అప్పుడప్పుడూ అనిపిస్తూఉండేది-"నాకు ఎందుకు వొచ్చిన

శ్రమ ఇది?" అని. నేను ఎవరికోసం కష్టపడుతున్నట్లు! అప్పుడు నామనస్సు మారింది ...

ఇదంతా పాతచరిత్ర, ఇక నీఉత్తరంలో విషయాలకు వొస్తాను....

ప్రస్తుత విషయాలను అర్థంచేసుకోటానికి వుపయోగపడుతుందని పాతచరిత్ర చెప్పవలసి వొచ్చింది. వేరే ఉద్దేశం ఏమీలేదు

నేను దూరంగావున్నా, మీనాన్న చచ్చిపోయింతర్వాత నీ ప్రవర్తన ఒకకంట కనిపెడుతూనే వున్నాను. నీవు నీచుట్టూచేర్చుకున్న వాళ్ళనిబట్టి, పేరుకోసం నువ్వుపడే తాపత్రయాన్నిబట్టి ఆస్తి ఏమీ మిగల్చవని తేల్చుకున్నాను. ఆస్తి ఎట్లాగూ మిగల్చివానికి అప్పు వడ్డీతోసహా ఇచ్చినందువల్ల ప్రయోజనం ఏమిటి. నేనుదండగపట్టంతప్ప? మీనాన్న ఉండగా ఒకసారి ఇటువంటి పొరపాటు చేశాను కాబట్టి ఈసారి ముందే జాగర్తపడ్డాను. నిన్ను పిల్చుకొచ్చి, భాకీ పరిహారం చేసుకున్నా. అప్పుడు ఏం జరిగిందీ, ఎలాజరిగిందీ నీకు తెలిసిన విషయమే.

నువ్వుమాత్రం నేను అనుకున్నట్టుగానే నీ తండ్రికి మల్లేనే పదివేలుచేసే పొలం నలభై వేలకు కట్టుకొని నీ వంశ గౌరవం నిలబెట్టావు. ఈ చుట్టుప్రక్కల అందరిచేతా పొగడ్తలు పొందావు.

కాని, నేనుమాత్రం పదిఎకరాలు ఊరికే దానం చేసినట్లే భావించుకున్నాను. నువ్వు వ్రాసిన ఉత్తరంలో నలభై వేలకుగాను పది ఎకరాలు కట్టుకుని నాకేమిగో

సహాయంచేశానని వ్రాశావు. నీవు కొంచెం జ్ఞాపకం తెచ్చుకుంటే, ఆ బేరంతో నీవు నష్టపడ్డావో, నేను నష్టపడ్డానో నీకే తెలుస్తుంది. అరోజు నీఅత్త పిచ్చిదై నోరుజారిందిగాని లేకపోతే నీ వంశగౌరవం నిలబెట్టటానికి ఏమీ యివ్వకుండానే చెల్లబెట్టేవాణ్ణి. ఆరోజే ఈ సహాయం పరాయి వాళ్ళకైనా చేస్తానని చెప్పావు. సంపాదించుకునేఅవకాశంలేక పోయినా చేస్తానన్నావు. ఇక నీవు నాకుచేసిన సహాయం ఏమటి నాయనా? సహాయం చెయ్యటం నీకు వ్యసనం. నష్టపడుతూ ఇతరులకు సహాయం చేస్తున్నాననే ఆనందం కోసం చేస్తున్నట్టు నీమాటలే స్పష్టపరుస్తున్నాయి. నీవు ఈ ఆనందం పొందటానికి నన్ను ఉపయోగించుకొని ఇప్పుడు "నీకోసం అది చేశాను, ఇది చేశాను! నీకు విశ్వాసంలేదు" అని నన్ను నిందించటంలో అర్థం ఉందా?

అదీకాక, ఒక ముఖ్యమైన సంగతి మనం విచారించవలసిఉంది. ఈ నలభై వేలు ఎవరివో తెలుసా? నీవు సంపాదించింద కాదు; నీతండ్రి సంపాదించింది కాదు. మాది. నాచెల్లెలు పెళ్ళికి ఇచ్చిన డబ్బు. వడ్డీపెరిగి యింత అయింది. ఆమె వెళ్ళిపోయింది. మాడబ్బు మా దగ్గరే ఉంది. యిక నువ్వాయిచ్చింది యెక్కడ, నేను వుచ్చుకుంది ఎక్కడ; మేనల్లుడవని, ప్రైగా నేనే నీకు పదియెకరాలిచ్చాను. నాతల్లిడబ్బు నాది కాదా అంటావు? నీదే, ఆ డబ్బు దుర్వినియోగం చెయ్యకపోతే! నీవు వుంచుకోని పక్షంలో, అసలు మాది గనక మాకు ఉంటమే న్యాయం. అందులో

ఈ డబ్బు మీడబ్బు వంటిది కాదునాయనా. కష్టార్జితం. చెమట ఓడ్చి, తెలివి ఉపయోగించి సంపాదించినడబ్బు.

బాబూ! ఈ మధ్య నీ మామ వచ్చాడు. నీ పరిస్థితీ, నీ ప్రవర్తనా విపులంగా చెప్పాడు. నీమీద ఎలాంటి ఆశా పెట్టుకోవద్దనీ, నీవు లేనట్టుగానే ప్రవర్తించవలసిందనీ జవాబు చెప్పాను. ఆయనకూడా నీ సంగతి ఆలోచించటం లేదు. నీదగ్గరవుంటే పిల్లలుకూడా చెడిపోతారేమో అని భయపడుతున్నాడు. కాని పాపం ఏంచేస్తాడు? పిల్లలను తీసుకుని వొచ్చెయ్యమని చెపితే కూతుని వొప్పుకోలేదట?

ఈ ప్రపంచంలోని విచిత్రాలలో ఇదొకటి. మంచి ఆడవాళ్ళు నీలాంటి పురుషుల భార్యలే అవుతారు. ఒడుదుడుకుల జీవితంలో వున్న ఆనందం, సాఫీగా జరగటంలో వుండదు కాబోలు! వాళ్ళనాన్న చెప్పిందంతా విని, 'నిజమే నాన్నా నేనుగాని వచ్చేస్తే ఆయన పని మరీ అధ్వాన్నమవుతుంది. ఎట్లా జరగవలసివుందో అట్లా జరగనివ్వు నాన్నా!' అన్నదట నీభార్య.

'ఎందుకమ్మా నీకింత అభిమానం? అతను సుఖపడడు-ఇతరులను సుఖపడనివ్వడు' అన్నాడట నీ మామ.

'ఆయన చాలా గొప్పవారు నాన్నా! గొప్పవాళ్ళ జీవితాలన్నీ అంతే! వాళ్ళని మామూలు మానవుల్ని కొలిచే బద్దతో కొలిస్తే అర్థంకాదు.' అన్నదట నీ భార్య.

చూశావా? నీవు గొప్పవాడవట! నువ్వు నమ్మగలవా ఈమాట!

ఏం లాభం? నీలాంటివాళ్ళ భార్యలు లేచిపోరు. నీలాంటి భర్తలు భార్యలను నీచంగా చూస్తారు. అందువల్ల వాళ్లకు ఆత్మవిశ్వాసం చస్తుంది. భర్తలను సుఖపెట్టటానికి ప్రయత్నించటమే వాళ్ళకు జీవితపరమావధి అవుతుంది. బానిసబ్రతుకుతో తృప్తిపడతారు.

భర్తలవల్ల సుఖపడే భార్యలదృష్టి వేరు. వాళ్ళకి తమమీద తమకు చాలా సదభిప్రాయం ఏర్పడుతుంది. తమకు ఏకష్టం కలిగినా తప్పు తమదే అనుకుంటారు. మరొకరైతే తమను ఎంత సుఖపెట్టేదీ ఊహించుకుంటారు. లేచిపోతారు.

కాని మనకు లేచిపోవటం తప్పు. బానిసబ్రతుకు బ్రతకటం గొప్ప. నీభార్య నిన్నువిడిచిపెట్టదు. జీవితపర్యంతం నీచేతుల్లో కష్టాలనుభవిస్తూ నీతోనే ఉంటుంది. నీ గొప్పతనం చాటుతూవుంటుంది. నేను నిన్ను విడిచి వూరుకున్నట్టే వాళ్ళనాన్న ఆమెను విడిచి వూరుకున్నాడు....

నాయనా నాదగ్గర డబ్బువుంది-కాని నేను ఇవ్వను. అసలు నీకు డబ్బు ఎందుక-ముష్టి డబ్బు. డబ్బు లేకుండా వంశగౌరవం నిలబెట్టలేవూ? మేము డబ్బు మనుషులం. మీరు కీర్తిమనుషులు. మీరు డబ్బులేకపోయినాకీర్తిమీద బతకగలరు. మాకది లేకపోతే జీవితమే లేదు.

కుక్క విశ్వాసంగల జంతువు అని ప్రాశాపు. కుక్కలు అంతే. నీకింకా అనుభవం తక్కువ. అందుకనే పెద్దలు 'కుక్క బుద్ధి' అంటారు. చూస్తూచూస్తూ కుక్క అవటానికి ఎవరు వొప్పుకుంటారు? అందులో నేను? మీ

యింట్లో అన్నాళ్ళుండి, మీనుంచి అంత జ్ఞానాన్నిపొంది, అటువంటి పొరపాటుపని చేస్తానా? చెయ్యను.

నాయనా, ఎవరి బలహీనతలకు ఎవరి అజ్ఞానానికి వాళ్ళే బాధలు పడాలి. నీ చర్యల ఫలితం నువ్వే అనుభవించాలి. ఇతరులను నిందించి ప్రయోజనం ఏముంది? ఒక్కళ్ళను చూచి ఈర్ష్యపట్టం. నీ కష్టాలకు ఇతరుల సంకుచిత స్వభావం కారణం అనుకోటం. నీ బలహీనతలను, నీ పొరపాట్లను సమర్థించుకోటానికి కారణాలు వెతకటం, నీఅసమర్థత మూలంగా వొచ్చిన కోపానికి ఇతరులను గురిచెయ్యటం, నీబోటి చదువుకున్నవాడు, విశాల హృదయుడు, కీర్తికాముడు చెయ్యవలసిన పనికాదు. నీ వంశ ప్రతిష్ఠకు, నీకుటుంబ గౌరవానికి భంగం.

జీవిత ప్రవాహం ప్రచండ వేగంతో వెళ్ళిపోతూవుంది. అందులో ఎవరెవరి సంస్కారాన్ని బట్టి వాళ్ళు తమ సుఖంకోసం పోట్లాడుకుంటున్నారు. ఇదొక మహా సంగ్రామం. ఈ సంగ్రామంలో పిరికివాళ్లకు, అసమర్థులకు చోటులేదు.

టిక్కెట్లు ఇచ్చే కిటికీ దగ్గర జనం విరగబడి, నేను ముందు టిక్కెట్టు తెచ్చుకోవాలంటే నేను ముందు తెచ్చుకోవాలని ప్రొక్కిసలాడుతూ వుంటారు చూడు. జీవిత సంగ్రామాన్ని తలుచుకున్నప్పుడల్లా ఆ దృశ్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది నాకు. ప్రతివాడూ తను ముందుటిక్కెట్టు తెచ్చుకోవాలని తాపత్రయ పడేవాడేగాని, మిగిలినవాళ్ళ సంగతి ఏ ఒక్కడూ ఆలోచించడు. కాళ్ళ చలువైతే,

చొక్కాలు చిరుగుతై, గూనిపోట్లు తగులుతై. ఒక్కడూ ఇలా చెయ్యటంతప్పనుకోడు. చేయించుకోటం అవమానం అనుకోడు. ప్రతివాడిదృష్టి టిక్కెట్టుమీదే! ఒకడు ఇనప పాదాలతో వొస్తాడు. జనాన్ని కసాపిసా తొక్కుకుంటూ కిటికీ దగ్గరకు వెళ్తాడు. అందరికంటే వెనక వొచ్చినా అందరికంటే ముందే టిక్కట్టు తెచ్చుకుంటాడు.

అసమర్థులు, భీరువులు, ఆ సంఘర్షణలోకి దిగలేక దూరంగా నిలబడి చూస్తూవుంటారు. వాళ్ళూ రైలుకి వెళ్లవలసిన వాళ్ళే. వాళ్ళకూ టిక్కట్టు కావలసిందే. కాని, అందుకు ప్రయత్నించలేరు. పైగా టిక్కట్టుకోసం తాపత్రయపడేవాళ్ళను చూచి, 'నీచులు', స్వార్థపరులు','మోసగాళ్ళు' అని ఏమేమో అనుకొని తృప్తిపడతారు. వాళ్లు ఎవరన్నాగాని, వాళ్ళ స్వభావం ఎటువంటిదైనాగాని, టిక్కట్టు దొరికేది వాళ్ళకే. రైలు అందేదీ వాళ్ళకే. రైలుకు వెళ్ళటం ముఖ్యం అయినప్పుడు, అందుకు అవసరం అయిన పనులన్నీ చెయ్యవలసిందే. ఆపనులన్నీ మంచిపనులే అవుతయి. అలా చెయ్యక దూరంగా వుండేవాళ్లు వొచ్చే పోయేవాళ్ళని చూస్తూ, టిక్కట్టు తెచ్చుకునేవాళ్ళని చూచి ఈర్ష్యపడుతూ, రైలువాళ్ళని విమర్శిస్తూ, అలా నుంచోవలసిందే!

తమ ఉన్నతభావాలు తనుకుంటై. రైలుదారిని రైలువెళ్తుంది. నాయనా, పెద్దవాణ్ణి - చెపుతున్నాను-ఇక నాకు ఉత్తరాలు రాయవద్దు-నీ తెలివితేటలు ఉపయోగపడేచోటు చూసుకో!"

ఉత్తరం చదువుకునేటప్పటికి సీతారావారావుకి అయోమయం అయింది. ప్రపంచం గిర్రునతిరుగుతున్నట్లు అనిపించింది. ఇంకొకసారి ఆ వుత్తరం వంక చూట్టానికే భయంవేసింది. ప్రతి అక్షరం బాకై అతని హృదయంలో గుచ్చుకొని బాధపెట్టింది. తన మేనమామ తనంటే ఎంతో ప్రేమగా అభిమానం చూపుతూ వుండేవాడే! ఆ ప్రేమా, అభిమానం వొట్టి నటనేనా? తన పని నెరవేర్చుకోడానికి చూపినవేనా? ఇన్నాళ్ళూ ఎంత విషం హృదయంలోపెట్టుకొని దాచగలిగాడు తన మేనమామ! అసలు మనుష్యులంతా ఇంతేనా? తన్ను పొగిడేవాళ్ళు, తనతో స్నేహం చేసేవాళ్ళు, తనంటే లోపల ఒకటిపెట్టుకొని పైకి వేరు విధంగా నటించేవాళ్ళేనా? ఇక ఎవరిని నమ్మేట్టు? ఎవరి మాట నిజం అనుకునేటట్టు?

ఒకసారి తను తన మేనమామ ఇంటివద్ద వుండగా ఒక సంఘటన జరిగింది. అప్పటికే తను ఆర్థికంగా ఇబ్బందిపడి, మేనమామ యివ్వవలసిన బాకీకింద పది ఎకరాలు కట్టుకున్నందుకు పశ్చాత్తాపపడుతున్నాడు. అప్పటికే కొంతమంది తన్ను చాటుమాటుగా అసమర్థునిక్రింద జమకట్టి, హేళనచేస్తున్నారని తెలుసుకుంటున్నాడు. ఆ సందర్భంలో ఆమాటా ఈమాటా మాట్లాడుతూ, 'మీకు రాసిఇచ్చింది ఉత్తరప్పాలం. మురుగు తగుల్తుంది. ఎకరానికి ఏ రెండువందలైనా ఖర్చుపెడితేనేగాని బాగుపడదు.... దక్షిణపు పొలం బంగారం తునక" అన్నాడు వాళ్ళమామ శూద్రవాకరు.

అతనికి ఈ సంగతి తెలిసేటప్పటికి కష్టంవేసింది. మాటవరసకైనా తనమేనమామ ఈమాట తనతో ఎప్పుడూ అనలేదు. ఆయనకు తను ఎంతో సహాయం చేశాడుగదా! తన్ను మోసం చెయ్యాలని చేస్తాడా? అని ఆలోచించాడు.

"మామయ్య రైతుగదా, ఇన్నాళ్ళు పొలం మరా మత్తు చేయించకుండా ఎందుకు వూరుకున్నాడు?" అని అడిగాడు శూద్రనౌకర్ని. "ఏమోసండీ - మిగిలినపొలం అంటే పసిపిల్లని చూచినట్లు చూచేవారు. ఈ పొలంమాట ఎత్తేప్పటికి కస్సుమని లేచేవారు!"

"మరామత్తుచేస్తే ఫలసాయం ఎక్కువొచ్చేదిగా?"

"రాకేమండి, మీరే చేసుకుంటారని వూరుకున్నారేమో?" అన్నాడు శూద్రనౌకరు. ఈ మాటకు సీతారామారావు స్తంభించిపోయాడు. చాలాకాలంనుంచీ తన మేనమామ ఈపొలం తనకు అంటగట్టి, ఋణవిముక్తి పొందాలని చూస్తున్నాడన్నమాట! ఎట్లాగూ తన యిష్టం వచ్చిన ధరకు అంటగట్టగలననే ధైర్యంతో మరామత్తు చెయ్యటం దండగ అనుకున్నాడన్నమాట!

అతనికోసం తనంత త్యాగానికి సిద్ధపడితే, ఎంత నీచంగా ఆలోచించాడు తన మేనమామ! అనుకున్నాడు సీతారామారావు.

ఆ సాయంకాలం ఆవ్యూరి కరణం కలిశాడు. కరణానికీ తన మేనమామకీ పచ్చిగడ్డివేస్తే భగ్గున మండే అంత వైరం. కుశలప్రశ్నలు అయిన తరువాత-ఏమండీ, ఉత్తరపు

పొలం మీ మేనమామగారు మీకు బాక్ క్రింద కట్టినట్లున్నారు. ఎంతో మీకేమైనా జ్ఞాపకం వుందా?" అని అడిగాడు.

"లేకేం? పది ఎకరాలు" అన్నాడు తను.

"క్రాయించుకునేటప్పుడు సర్వే చేయించారా?" అని అడిగాడు.

అతనికి అగ్గొడవ తెలియదు. "నాకు సరీగ్గా జ్ఞాపకం లేదు. చేయించకుండా ఎందుకు వుంటారు? చేయించే వుంటారనుకొంటాను" అన్నారు.

"అవున్లెండి. చేయించకుండా ఎందుకుంటారు? మేనమామ మేనల్లుళ్ళ మధ్య అలాంటివి ఎందుకు జరుగు తవిగాని మొన్న ఏదో సందర్భంలో లెక్కలు చూడవలసి వస్తే తొమ్మిది ఎకరాల పదిసెంట్లేనని తేలింది. అందుకని ఊరికే సంగతి తెలుసుకుందామని అడిగాను" అన్నాడు.

అక్కడనుంచి గ్రంథాలయానికి వెళ్ళాడు. అక్కడ చిరకాల స్నేహితుడొకడు కనిపిస్తే, ఇద్దరూ కలిసి కాలువ గట్టుకి షికారు వెళ్ళారు. అతను తన మేనమామ గురించి మరికొన్ని విషయాలు చెప్పాడు. "అబ్బాయీ.... నామాట విని నీపొలం ఇంకెవ్వరికన్నా కవులుకిచ్చి వెళ్ళు. నీ మేన మామకిందవుంటే నీకు దమ్మిడీరాదు. నీ శ్రేయస్సుకోరి చెపుతున్నాను, నా మాట విను" అన్నాడు.

"ఎందుకని? కారణం చెప్పు, అలాగే చేద్దాం" అన్నాడతను.

స్నేహితుడు చెప్పాడు:

తన మేనమామమాట వినేవాళ్ళకీ, ఇంట్లో ఏదొచ్చినా పని చేసిపెట్టేవాళ్ళకీ, ఊళ్ళో మద్దతుగా ఉండేవాళ్ళకీ తన పొలం తక్కువకౌలుకి ఇస్తున్నాడట. వళ్ళు చేలు బాగుచేసినా చెయ్యకపోయినా పట్టించుకోవటం లేదట. ప్రతి సంవత్సరం బకాయిలు పెట్టి సరిగ్గా వసూలు చెయ్యటంలేదట. ఇటీవల నాలుగు ఎకరాలు సొంతానికి తీసుకొని చెఱుకు వేశాడట. చెఱుకు వేస్తే రాబడి ఎక్కువ రావటం, చేలు చెడిపోవటం జరుగుతుందిగనక సొంతచేలో వేసుకోకుండా, తన చేలో వేసి కవులుమాత్రం మామూలు కవులే ఇస్తున్నాట్ట. ధర తక్కువలోవుండి డబ్బు అవసరం అయితే తన ధాన్యం అమ్ముకొని అవసరం తీర్చుకొని, ధరలు తగ్గింతర్వాత సొంతధాన్యం అమ్ముకొని తక్కువ ధరల లెక్కప్రకారం డబ్బు పంపుతాడట!

ఇలా తన మేనమామ తన్ను చేసే మోసాలు ఎన్నో చెప్పుకొచ్చాడు. అతను చేప్పేమాటలు వింటుంటే సీతారామారావు ఉడికిపోయాడు. డబ్బు నష్టపడ్డందుకు అతనికి దిగుల్లేదు. తనంతటివాడు మోసపోయానే అనే చింత!

స్నేహితుడు చెప్పినమాటలు అతని హృదయాన్ని గాయపరిచినై. అతని కళ్ళకు ప్రపంచం అంతా తారుమారైనట్లు కనిపించింది. ఆలోచించుకుంటూ బాధపడుతూ తిరిగి మేనమామ ఇంటికి వచ్చాడు.

ఇంట్లో అడుగుపెట్టగానే అతని భార్య కనిపెట్టి 'ఏం బాబూ అలా వున్నావు?' అని అడిగింది అతని మేనత్త.

అతను తను విన్న సంగతులన్నీ చెప్పి "ఇది న్యాయమా అత్తా!" అని అడిగాడు.

ఆమె భర్తమీద మండిపడి భర్త ఇంటికి రాగానే కస్సున లేచింది. "కుర్రవాణ్ణిచేసి మోసం చెయ్యటం భావ్యంకాదు" అంది. "వాడికి పెట్టవలసింది పోయి వాడి డబ్బు తింటమా?" అంది. "వాడు అమాయకుడు—అర్భకుడు. మనం అడిగిన సహాయం చేశాడు. వాడు ఇప్పుడు ఎంత క్షోభపడుతున్నాడో చూడండి. వాడి మనస్సు కష్టపెట్టటం మనకు శ్రేయస్కరం కాదు" అంది.

భర్త అన్నిటికీ ఏవేవో జవాబులు చెప్పాడు. "మాటలు అనవసరం. గిట్టనివాళ్ళు అనేకం చెపుతారు. స్పష్టంగా దమ్మిడీ దగ్గరనుంచీ ఎకౌంటు రాసేవుంది. చూచుకోమను" అని ఎకౌంటు పుస్తకాలు ముందువేశాడు

కాని తాను చూసుకునేదేమిటి! తనకు డైరీ రాసుకునే అలవాటైతే ఉందిగాని ఎకౌంటు రాసుకునే అలవాటు లేదు. తాను డబ్బు ఎప్పుడు ఎంతెంత తీసుకున్నాడో జ్ఞాపకం లేదు. ఎకౌంటు ఎట్లా వెరిఫై చెయ్యటం? మొదలుకుండా కూచున్నాడు.

"చూడు" అన్నాడు మేనమామ.

"ఏముంది చూట్టానికి?" అన్నాడు సీతారామారావు.

ఊళ్ళోవాళ్ళ మాటలు నమ్మి నీడబ్బు తిన్నానంటి విగా. సీతల్లి చచ్చిపోయిన తరువాత ఈ పొలం కాపాడ టానికి ఎన్ని తిప్పలు పడ్డానో నీకేం తెలుసు! ఊళ్లో అవ తలపార్టీవాళ్ళని పట్టుకొని పొలం స్వాధీనం చేసుకోవాలని నీ తండ్రి యెంత ప్రయత్నించాడో ఎవరినన్నా అడుగు. ఈ పొలంకూడా నీకు ఎక్కడ లేకపోతుందో అని నేను నిలబడి నీ వాళ్ళందరికీ విరోధం అయి కాపాడాను" అన్నాడు మేనమామ!

"ఆ మాట నిజమే నాయనా. నీకోసం అనేకనిందలు మోశారు" అన్నది మేనత్త.

"నేను కాదన్నానా అత్తా...." అన్నాడు సీతా రామారావు.


"మరెందుకీ గోల అంతా! ఈరోజు మొదలుకొని సి పొలం నువ్వే చూచుకో" అన్నాడు మేనమామ.

"చాల్లెండి ఇదొక బెదిరింపు! మీరు చూచిపెట్టక పోతే, ఇక చూచేవాళ్ళు లేరనా! ఏదో ఊళ్లోవాళ్లు అడిగా రని చెపితే ఇంత రభస! రా నాయనా, అయితో మనకెం దుకీ మా నాయన వొచ్చిన తర్వాత ఒక్క గారె ముక్కయినా వొండలేదు. మధ్యాహ్నం చెయ్యాలి" అని సీతారామారావును లోపలికి తీసుకువెళ్ళి తలంటుపీటమీద కూర్చోబెట్టి, పప్పు నీళ్ళలో పోసింది.

ఆరోజు 'అత్తవంటి ఉత్తమురాలు లేదు' అనుకు న్నాడు సీతారామారావు. కాని ఇప్పుడు ఆలోచించిచూస్తే అది అంతాకూడా కపటనాటకమే అనిపించింది. ఇద్దరూ

కలిసే తన్ను మోసం చేశారు. రాత్రుళ్ళు ఎవ్వరు ఎట్లా మాట్లాడుకోవాలో కూడబలుక్కునేది, తెల్లవారి మాట్లాడేది! వెనక్కి చూచుకొని, ఇదంతా అలోచించుకొనేటప్పటికి అతనికి రోషం వొచ్చింది. ప్రపంచంలోవున్న ప్రతివాడూ తన్ను మోసగిస్తూనే వున్నాడు. చదువుకోనివాడికి, తెలివితక్కువ వాడికి, చవటకి-అందరికీ తను లోకువే అనుకున్నాడు. తన మేనమామకి ఘాటైన ఉత్తరం రాయాలని కలం కాగితం తీసుకున్నాడు. కాని, ఏమని రాసేటట్లు? ఆయన ఉత్తరానికి జవా బేముంది?

తన మామవెళ్ళి మేనమామతో మాట్లాడటం అతనికి మరీ మంటగాఉంది. అయితే తనేం చెయ్యగలదు? ఏమీ తోచక ఈ దిగువ బొమ్మ గీశాడు.



మామామేనమామల
కలయిక

అసమర్థుని ప్రతాపం

అయిదో ప్రకరణం

వేసవిమామ ఉత్తరం సీతారామారావు హృదయాన్ని, ఆగ్నిగుండంగా మార్చింది. తనమీద తనకే ఏవగింపు కలిగించింది. గిల్లి కజ్జా పెట్టుకోవడం మొదలు పెట్టాడు.

"ఏం, అక్కడ నిలబడ్డావేం?" అని అడిగాడు సీతారామారావు గడపలో నుంచున్న కూతుర్ని చూచి.

"స్నానానికి నీళ్ళు లేవునాన్నా! అమ్మ రెండు కడవలు పొయ్యమంది" అంది పాప భయపడుతూ.

"లేకపోతే మానుకోమను."

"అమ్మ ఎప్పుడో స్నానం చేసింది నాన్నా....నీకు తోట్టానికి నీళ్ళు లేవు... పొంతకుండలో నీళ్ళు మసిలిపో తున్నయి...."

తన స్నానానికంటే తోడతాడనీ, మిగిలిన వాళ్లకైతే తోడడనీ ఆపిల్ల అనుకోవటం అతని కోపానికి కారణం అయింది. కాని ఏం అనగలడు?

"అన్నిటికీ నేనే దొరికానా!" అన్నాడు.

"శీనయ్య పొద్దున్న పోసిపోయాడు నాన్నా... అయిపోయినై...."

తనకోపం సకారణంగా బయటపట్టానికి అప్పటికి అతనికి అవకాశం దొరికింది—"మీకు కావలసినంతవరకూ తోడించు కున్నారన్నమాట. నాకు కావలసినై మాత్రం నేనే తోడుకోవాలన్నమాట! ఇంతేనా?" అని గుడ్లు ఉరు ముతూ అడిగాడు.

"కాదునాన్నా...ఇవ్వాళ అమ్మకి వొంట్లో బాగా లేదు...నీళ్ళు తోడలేకపోయింది. పంపేమో చెడిపోయి నాలుగు రోజులైంది."

"ఏడ్చావులే. మాట్లాడితే ఇదొక్కటి నేర్చు కున్నావు అమ్మని వెనక వేసుకురావటం! దొరికింది నీకేగా ఒక అమ్మ...." అంటూ లేచాడు.

అతడు బావిలో నీళ్ళుతోడి రెండు కడవలూ రెండు చేతుల్లో పట్టుకొని, పంట ఇంట్లోకితీసుకువెళ్ళాడు. అక్కడ అతని భార్య పొయ్యిమీదవున్న అన్నం ఉడికిందో లేదో

అని తెడ్డుతో నాలుగు మెతుకులు తీసి, వేళ్ళతో పట్టి చూస్తూవుంది.

"ఎక్కడ్డపొయ్యాను!" వగర్చుకుంటూ అడిగాడు.

"స్నానాలగదిలో దింపండి" అంది భార్య.

అక్కడనుంచి మళ్ళీ స్నానాలగదిలోకి వెళ్ళటం కష్టం అనిపించింది. బరువుపట్టుకొని నుంచోవటంవల్ల గూళ్ళు నొప్పిపుడుతున్నై. సరాసరి స్నానాలగదిలోకి వెళ్తే అంతకష్టం అనిపించేదికాదు. "ఆ మాట ముందే ఏడవ గూడదూ-తీరా ఇక్కడికి వొచ్చినతర్వాత ఏడవకపోతే!" అన్నాడు.

"పాప చెప్పింది అనుకున్నాను."

నిజమే. అప్పుడతనికి జ్ఞాపకం వొచ్చింది పాప చెప్పినట్లు. తప్పు తనదే అని అంగీకరించాల్సి వొచ్చేటప్పటికి అతనికి ఆగ్రహం వొచ్చింది. "పాప చెప్పితే మళ్ళీ నువ్వు ఇంకొక్కసారి చెప్పగూడదూ? ఇంతలోకే అరిగిపోతావా! నోటి ముత్యాలు రాలిపోతయ్యా!" అంటూ గబగబా స్నానాల గదిలోకి కడవలు తీసుకువెళ్ళాడు. లోపలకు వెళ్తుంటే మండిగం తలకు తగిలింది. గంగాళంలో నీళ్ళు గుమ్మరించి, బయటకు రాగానే కాకి తలమీద తన్నింది.

ఆ కాకి పక్కనున్న కొబ్బరిచెట్టుమీద గూడు కట్టుకుంది. ఆ గూడు ఎక్కడ తీసివేస్తారో అని దాని భయం. కాని అదిమాత్రం అందర్నీ తంతూవుందా! తన భార్య ఎన్నిసార్లు అటూ ఇటూ తిరిగినా ఏమీ అనదు. పాపని

ఏమీ అనదు. తనసుమాత్రం వీలుచిక్కినప్పుడల్లా తన్నక పూరుకోదు. మొన్న ఏనాదిచాణ్ణి తన్నింది. తనగురించి అది ఏమి అనుకుంటూవుంది! తనుఎవరుఅనుకుంటూవుంది. పిట్టల్ని కాల్చుకు తింటానికి బల్లెంతో గూళ్లుపొడిచేవాడు అనుకుంటూ వుందా! తనకు చొక్కాలేదని అప్పుడు అతనికి జ్ఞాపకం వచ్చింది. అయినా అతనికీ ఏనాదివానికీ చొక్కాయేనా బేధం! తనహృదయం తెలుసుకోలేకపోయినందుకు కాకిమీద అతనికి కోపం వచ్చింది. గూడు తీసివేసి దానికోగం కుదుర్చుదాం అనుకున్నాడు గాని తనకు కొబ్బరిచెట్టు యెక్కటం చేతగాదు.

కాకి మళ్ళీ తలమీద తన్నింది. అతనికి పట్టరాని కోపం వొచ్చింది భార్యమీద. "ఛీ దరిద్రపు కొంప.... ఈ కొంపలో బతకటమే కష్టంగావుంది. ఒక్కక్షణంకూడా మనస్సుకి శాంతి లేకుండా పోయింది" అన్నాడు బిగ్గరగా ఆమెకు వినపడేట్టు. అంటూనే మళ్ళీ కాకి ఎక్కడ తంతుందో అని అక్కడనుండి కదలి గబగబా సందులోకి వెళ్ళాడు.

కూతురు ఎదురుగా పరుగెత్తుకుంటూ వచ్చి అతన్ని చూచి బిక్కమొహంవేసి ఠక్కున ఆగిపోయింది. ఆ పిల్ల వెనకాల పక్కగుడిసెలో కాపరం చేస్తున్న ఎర్రకల్లి గలగల మంటూ వొచ్చింది-"చూడండి, అయ్యోరూ, మాపిల్లని

ఎట్లా బాదిందో! లేనోళ్ళం అని గూళ్కిరగ పొడుత్తారా? మేమూ మడుసులమే'' అంది.

దాన్ని చూస్తే సీతారామారావుకి భయంవేసింది. దాని నోరుచెడ్డది. దాన్ని చూస్తే తనకేకాదు, ఆ వాడ కట్టులో అందరికీ భయమే. ముందు నోరుపారేసుకుంటుంది. తర్వాత ఏమనుకుంటే ఏం లాభం? పైగా దానికి పెద్దా చిన్నా తారతమ్యంలేదు.

ఇటువంటివాళ్ళతో చిక్కులు తెచ్చిపెడుతున్నందుకు కూతురుమీద కోపంవచ్చింది- ''ఎందుకు కొట్టావు?'' అని అడిగాడు.

కూతురు గడగడ వొణికిపోతూవుంది. నోటమాట లేదు.

''చెప్పూ?'' అని గద్దించాడు.

కూతురు కళ్ళప్పజెప్పి నుంచుంది. ఆపిల్ల చూపులు చూస్తే అతను అడుగుతున్న ప్రశ్నమీద మనస్సు ఉన్నట్టు లేదు. రాబోతున్న అపాయాన్ని ఊహించుకొని కొయ్యబారి పోతూవుంది.

తన కూతురు దిగులుచూపులూ నిస్సహాయత్వం చూస్తే అతని హృదయం కరిగింది. 'నవ్వుతూ అన్నానన్నా భయపడతావేం!' అని కావిలించుకోబుద్ధి అయింది.

కాని ఏం చేసేటట్టు? ఎరికల్ది చూస్తూ అక్కడే నుంచుంది. దానికి ఏం చెప్పేటట్టు? దాన్ని శాంతపరచక పోతే ఇప్పుడే బజార్నపడుతుంది. ఏమేమి అంటుందో! ఇంత

బతుకూబతికి దాంతో పోట్లాట్టం? పోట్లాడక మాటలు పడేది ఎట్లా?

"మాట్లాడవేం? ఎందుకు కొట్టావంటే-చెప్పవేం? అట్లా గుడ్లువప్పజెప్పి నుంచుంటావేం? చెప్పుతావా; చెప్పవా?" అని దెబ్బవేశాడు. ఆ దెబ్బకి హడలిపోయింది కూతురు. కాని పెదవివిప్పలేదు, అలాగే చూస్తూనుంచుంది.

తను కొట్టాడు కాని ఆపిల్ల ఏడవటంలేదు. ఎందుకు ఏడవదు? 'కొట్టకు నాన్నా' అని ఎందుకు అడగదు? అతనికి ఈసారి నిజంగా కోపంవొచ్చింది. అతనిలోవున్న పశుత్వం విజృంభించింది. "చెప్పు.... చెప్పు... చెప్పుతావా, లేదా? వాళ్ళజోలికి వెళ్లకుండావుంటావా, ఉంటావా, ఉంటావా?" అని దెబ్బ, దెబ్బమీద దెబ్బ వేశాడు?

ఆ దెబ్బలు కూతురు భరించలేకపోయింది. మాటలు పెకలించింది.— "ముందు నన్నే కొట్టింది నాన్నా!"

ఆమాటకు అతడు ఉలిక్కిపడ్డాడు. తను అనవసరంగా కొట్టాడా? ఇన్ని దెబ్బలూ తను అనవసరంగా వేశాడా? తను కొట్టటం తప్పా? అయితే ఆమాట ముందే ఎందుకు చెప్పదు? ముందు చెప్పక తన్నీ పశుకృత్యంలోకి దింపి నందుకు కూతురుమీద కోపం వచ్చింది.

"ఆమాట ముందే ఎందుకు చెప్పలేదు? అడగ్గానే ఎందుకు చెప్పలేదు?" అని మళ్ళీ కొట్టాడు.

ఎరికల్ది అక్కడే నుంచుని చూస్తూవుంది. దానికి తప్పు తనమీదకు వొస్తుందేమో అని అనుమానంకలిగింది.

"అమ్మో, ఏలెఫులేవే, ఎన్ని అబద్ధాలు ఆడుతావమ్మో నేను చూస్తుండలా? జుట్టుపట్టుకొని వంగదీసి దబాదబా గుద్దితివే? నే నొచ్చేతలికి వుడాయించుకొస్తివే?" అంది.

"కాదునాన్నా, నేను బజార్న వొస్తున్నా...అది మన దొడ్లో సపోటాకాయలు ఎత్తుకుపోతోంది. నేను అడ్డం వెళ్ళా...కొట్టింది...." అన్నది కూతురు.

"దొంగతనాలు కూడా కడతన్నావా అమ్మా! ఇన్నాళ్లూ మీ కూడుతినే మేం బతుకుతున్నాం అమ్మా? లేకపోతే మాకు కూడు ఎక్కడిది?" ఎత్తుకుంది ఎరికల్ది.

అతనికి భయంవేసింది. దాని నోటికి అద్దూ ఆపూ లేదు. ఏం చెయ్యటం? దాన్ని ఎలా ఆపడం?

"కొడితేమాత్రం మళ్లీ కొడతావా?" అని మళ్లీ కొట్టాడు కూతుర్ని. ఎరికల్ది ఇంకా అక్కడే నుంచుంది. ఇప్పట్లో కదిలేటట్లు లేదు. ఇంకా తన కూతుర్ని కొట్టించాలనిదాని కోరిక కాబోలు! వెంటనే అతనికి ఎరికలదాని మీద కోపం వొచ్చింది. తన కూతుర్ని అన్యాయంగా తన చేత కొట్టించినందుకు కడుపు మండింది— "ఇంకా నుంచున్నావే! కొట్టాగా, చితకగొట్టాగా. ఇకవెళ్ళు" అన్నాడు.

"అయ్యో పిల్లని నే కొట్టనున్నానా? నా పిల్లని కొట్టిందని సెప్పాను...అయ్యోరాత....మా కేం పని ఈడకు రాటానికి—మా పిల్లని కొడితే సెబుదామనివొచ్చా..." అని గింజుకుంటూ మళ్ళింది ఎరికల్ది.

ఇంకా అక్కడవుంటే దాని నోటివెంట వొచ్చే మాటలు ఏమి వినాల్సి వొస్తుందో అని అతడు ఇంట్లోకి వెళ్ళాడు.

వెళ్ళేవాణ్ణి గుమ్మందగ్గర పట్టుకొని కాకి యిల్లే తన్నింది.

2

కోపం తగ్గగానే కూతుర్ని కొట్టినందుకు అతనికి పశ్చాత్తాపం కలిగింది. ఆ దృశ్యం ఊహించుకుంటే అతని గుండెలు చెదిరినై. ఆపిల్ల ఏమీ చెయ్యలేక నిశ్చేష్టురాలై నిలబట్టం, తాను దెబ్బమీద దెబ్బ వెయ్యటం, ఆపిల్ల గుడ్లనీరు గుడ్ల కుక్కుకొని కిక్కురుమనకుండా నిలబట్టం-అతనికి ఘోరంగా కనిపించింది. తనమీద తనకే అసహ్యంవేసింది. పిల్లి ఎలుకను చెరబట్టినట్టుంది. తన కూతురు తప్పేంవుంది? ఎరికలదానికి భయపడి కూతుర్ని కొడతాడా? తను ఏం చేసినా పడివుండటమేగా దీనికి కారణం? ఎదురు తిరగలేదనేగా తానలా ప్రవర్తించటం!

అతనికి జాలివేసింది. కూతుర్ని హృదయానికిహత్తుకో వాలనిపించింది. తను అకారణంగా పెట్టిన బాధకు తగిన పరిహారం చెయ్యాలనుకున్నాడు. కూతుర్ని పిలిచాడు. ఆ పిల్ల నెమ్మదిగా, కళ్ళు తుడుచుకుంటూ, భయం భయంగా వొచ్చింది. కళ్ళు ఎర్రబడివున్నై. తల్లితో చెప్పుకొని ఏడుస్తూందని గ్రహించాడు సీతారామారావు. పక్కలో పడుకోపెట్టుకున్నాడు.

"ఏవమ్మా, అడగ్గానే ఎందుకు చెప్పలా?" అని అడిగాడు.

ఆ పిల్ల మాట్లాడలేదు. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగినై.

"చెప్పవమ్మా, ఏమీ చెయ్యను. చెప్పు" అని ప్రేమ పూర్వకంగా అడిగాడు.

"నువ్వు కొడతావని భయంవేసిందినాన్నా"...అంది కళ్ళుతుడుచుకుంటూ.

అతనికి ఏమీ తోచలేదు. పిల్లలను ఇలా భయపెట్టి తాను దేనికు బతకవలసివచ్చిందో అతనికిఅర్థంకాలేదు. తాను తన పిల్లలకే కంటకం అయిపోతున్నాడు.

"పోనీ నాతో చెప్పకపోయావా, మళ్ళీ కొట్టటం ఎందుకమ్మా?" అన్నాడు. తండ్రి మంచితనం చూచి ఆపిల్లకి కొంచెం ధైర్యం వొచ్చింది. తండ్రి మొహం చూస్తూ, "మొన్న చెపితే, 'నాతో చెప్పటం ఎందుకు? కొడితే మళ్ళీ కొట్టు' అని చెపితివిగా నాన్నా!" అంది.

నిజమే. అతనికి పిల్లల కజ్జాల్లో జోక్యం కలిగించుకోవటం చాలా అయిష్టం. కిందా మీదా పడుతుంటారు. ఆవిషయం పెద్దవాళ్ళు పట్టించుకోవటం తప్పఅనుకునేవాడు. పిల్లవాళ్ళ వాళ్ళకాళ్ళమీద వాళ్ళు నిలబడటం నేర్చుకోవాలి. అప్పుడుగాని పెద్దవాళ్ళయిం తరువాత జీవితసమస్యల నెదుర్కొనే ధైర్యం వాళ్ళకుండదు. చిన్నప్పటినుంచీ పెద్దవాళ్ళమీద ఆధారపడటం నేర్పితే పెద్దవాళ్ళయిం తరువాత స్వంతంగా ఆలోచించి పనులుచేసుకునేశక్తివుండదు.

అందుకని, యెవ్వరైనా కొడితే మళ్ళీ కొట్టమని సలహా చెప్పాడు. కాని పర్యవసానం ఏమిటి? కొడితే మళ్ళీ కొట్టమని మొన్న కూతురికి సలహా ఇచ్చాడు-ఇవ్వాళ తన సలహా అనుసరించినందుకు దండించాడు.

అతనికి కళ్ళల్లో నీళ్ళు తిరిగినై.

అతనికి ఏమీ అర్థంకావటంలేదు. ఒక క్షణం ఒకటి మంచిదనీ ఇంకొకప్పుడు ఇంకొకటి మంచిదనీ అనిపిస్తుంది. ఒక క్షణంలో తాను చెప్పిందానికే మరుక్షణం విరుద్ధంగా ప్రవర్తిస్తూ ఉంటాడు.

మొదట్లో పిల్లల్ని కొట్టడం తప్పనుకున్నాడు: ఘోరపాపం అనుకున్నాడు. కొంతమంది తలిదండ్రులు పిల్లల్ని యెట్లా కొట్టగలుగుతారో అతనికిఆశ్చర్యంవేసింది. 'పసిపిల్లలకు ఏం తెలుస్తుంది? వొట్టి అమాయకులు. వాళ్ళను కొట్టి ఏం ప్రయోజనం? హృదయం వున్నవాడెవ్వడూ ఆపని చెయ్యలేడు' అనుకునేవాడు. ఇటీవల పిల్లల్ని కొట్ట వలసిందే అనుకుంటున్నాడు-ఇందుకు తన ప్రవృత్తిని సమర్థించుకోటానికే కారణాలుకూడా పోగుజేశాడు - 'పిల్లలు మాటలకు లొంగరు. వాళ్ళను క్రమ పద్ధతుల్లో పెంచాలంటే భయపెట్టాలి. భయపెట్టటానికి ఒకటేమార్గం-దండం దండం ఉపయోగించని తలిదండ్రులు పిల్లలకు అపకారం చేసిన వాళ్ళవుతున్నారు. వాళ్ళ ఇష్టంవచ్చినట్లు పెరగనిస్తే యెందుకూ పనికిరాకుండా పోతారు. గాలివాళ్ళవుతారు. చెట్టు వంకలు మొక్కగా ఉన్నప్పుడే తియ్యగలంగాని ముదిరితే లాభంలేదు" అనిపిస్తూవుంది అతనికి.

పెద్దల అభిప్రాయాలుకూడా ఇట్లాగే ఉన్నట్టు ఉన్నయ్. సోషలిజం కావాలనే నాయకులు తమ ప్రత్యర్థుల్ని బాధ పెట్టి, హింసించి, చంపి తమ సిద్ధాంతాలను ఆచరణలో పెడుతున్నారు. పెద్దవాళ్ళ విషయంలోనే ఇది తప్పు లేనప్పుడు పిల్లలను హింసించటం తప్పేమిఉంది? ఈసిద్ధాంతం ప్రకారం ప్రతిబలహీనుణ్ణి బలవంతుడు దండించవచ్చు. భార్యనిభర్తదండించవచ్చు. జ్ఞానిఅజ్ఞానిని దండించవచ్చు. కాని ఈ దండన వాళ్ళ మంచికే జరగాలని యెక్కడుంది? తమ స్వార్థంకోసం జరిగితే వాళ్ళేంచెయ్యగలరు? ఇప్పుడు తన కూతురు ఏం చెయ్యగలిగింది?

"పాపా!" పలకరించాడు.

"యెందుకు నాన్నా?"

"కడుతున్నా వేమమ్మా?"

"చెయ్యి నొప్పిగా ఉంది నాన్నా" అని చెప్పింది కూతురు. ఆ చేతిమీదే అతను దెబ్బలువేసింది.

అతడు కొంచెంసేపు మాట్లాడలేకపోయాడు. నెమ్మదిగా చెయ్యి సవరదీస్తూ ఇలా అన్నాడు; "చూడమ్మా.... చిల్లరవాళ్ళు తగనివాళ్ళు, వాళ్ళనోళ్ళు మంచివికావు. మనకు తగ్గవాళ్ళతో ఆడుకోవాలిగాని, వాళ్ళతో తిరగకూడదమ్మా! చెడ్డఅలవాట్లు పట్టుబడతై. మనం ఏమన్నా వాళ్ళకు లెక్కఉండదు. వాళ్ళేమన్నా మనం పీక్కు చావవలసి వొస్తుంది. వాళ్ళతోతిరక్కు...."

"తిరగనునాన్నా."

కాని తనమాటలు ముగించాడో లేదో; అతనికి వెంటనే ఒకవిషయం జ్ఞాపకం వొచ్చింది. మొన్న భార్య అల్లరి చిల్లరవాళ్ళతో తిరగవొద్దని కూతుర్ని మందలిస్తుంటే తాను, "తిరిగితేనేం? వాళ్ళుమాత్రం మనుష్యులు కాదూ? అందరితోనూ తిరగవలసిందే! అన్నీ తెలుసుకోవలసిందే! చిన్నప్పుడే అనుభవం సంపాదించటం, రకరకాల మనస్తత్వాలు తెలుసుకోవటం చాలామంచిది" అన్నాడు.

ఇందులో ఏది తన అభిప్రాయం? తన కూతురు వివిధంగా ప్రవర్తించటం మంచిది! 'ఉష్, భగవంతుడా?' అని వేడి యెక్కిన కణతలు ఒత్తుకున్నాడు.

అతనికి ఆలోచించినకొద్దీ జాలికీ కోపానికీ చాలా దగ్గర సంబంధం ఉన్నట్లు కనిపించింది. తన హృదయం మెత్తనిదవటమే తన బాధలకూ, ప్రవర్తనకూ కారణం అనుకున్నాడు. శిలాహృదయులు ఉంటారు. వాళ్లకు కోపతాపాలు ఉండవు; సంతోష వికారాలూ ఉండవు. వాళ్ళ కసలు ఆవేశాలూ ఉద్రేకాలూ ఉండవు. అన్నిపనులూ ఒకేరకంగా చేసుకుంటూ పోతారు.

తనువేరు. ప్రతిఆవేశానికీ వశుడౌతాడు. ఈఆవేశం పైకి యెన్నిరూపాల్లో కనిపించినా, పునాది ఒకటే—తన మెత్తనిహృదయం. జాలిపడేగుణం. ఇతరుల కష్టాలనుచూచి ఓర్వలేకపోవటమే తన జాడ్యానికి మూలకారణం.

తన కూతురు ఆడుకుంటూ పడి ఏడుస్తూఉంటుంది. ఆ ఏడుపు సహించలేదు. ఏడుస్తూఉన్న ఆ పిల్ల మొహం

చూడలేడు. లోపల రంపాలు పెట్టి కోస్తున్నట్టు బాధ పుడుతుంది. కోపం ఒస్తుంది. ఏడుపు మానేవరకూ కొడతాడు.

కొట్టటానికి కారణం ఏమిటి? ఏడుపు సహించలేని తన మెత్తని హృదయమా? కాఠిన్యమా? తను కొట్టడమే, చూసేవాడికి తన కఠినత్వమే కనిపిస్తుంది. దాని వెనకవున్న జాలీ, బాధా కనుపించవు.

తన భార్య రాత్రింబగళ్లు పనిచేస్తుంది. జబ్బు తెచ్చుకుంటుంది. చేతులారా తెచ్చుకున్నావని చెడామడా తిడతాడు. ఆ తిట్టటమే విన్నవాళ్ళు 'ఎంత కఠినుడు!' అనుకుంటారు. కాని తనకు అంతకోపం రావటానికి కారణం ఏమిటి? తనమెత్తని హృదయమే!

తనకు మెత్తని హృదయం ఉంటం, ఇతరుల కష్టాలు ఓర్వలేకపోవటం-ఇదే తప్పయిపోయింది. తన మంచితనమే తనకు శత్రువైంది. తన కుటుంబానికి శత్రువైంది. అతనికి వెంటనే మరొకప్రశ్న తట్టింది...'మెత్తని హృదయం అంటే ఏమిటి?'

'నరాల బలహీనత' అని ఒక స్నేహితుడు చెప్పాడు. 'నరాల్లో పటుత్వం తప్పితే బయట జరిగే ప్రతి చిన్నవిషయానికీ మానవుడు చలిస్తూ వుంటాడు. దీన్నే మనవాళ్ళు హృదయం అన్నారు. నరాలు ఎంత బలహీనపడితే అంత మృదుల హృదయం అవుతుంది' అన్నారు.

ఈ మాటలు అతనికి ఆశ్చర్యం కలిగించినై. కొంతమంది తమ కళ్ళెదుట ఏ అన్యాయం జరిగినా జోటజోట కస్సుమంటారు. దీనికి కారణం వాళ్ళ నరాల బలహీన

తేనా? మంచితనం కాదూ? మరి తను ప్రతిచిన్నవిషయానికే ఎంతో బాధ పడతాడే! మధనపడతాడే! రాత్రిం బగళ్ళు నిద్రాహారాలు లేకుండా ఘర్షణపడతాడే! ఈ బాధ, ఈ యాతన, ఈ కోత — ఇదీ నరాల బలహీనత వల్లేనా? తన మెత్తని హృదయంవల్ల కాదూ? పోసి-పరిస్థితులకు మించిన తెలివితేటలు వుండటంవల్లయినా కాదూ?

అతనికి కోపం వచ్చింది. "నా నరాలు ఎందుకు పటుత్వం తప్పినై?" అని కసిగా ప్రశ్నించుకున్నాడు.

"ఆలోచనలవల్ల."

"నా కిన్ని ఆలోచనలు ఎందుకు రావాలి?"

"ఏపనీ చెయ్యకుండా కూర్చోవటంవల్ల."

"నాకు ఎందుకు చెయ్యబుద్ధి పుట్టలేదు?"

"పరిస్థితులవల్ల."

"ఇక నా బాధ్యత ఏమిటి?" అని కఠినంగా ప్రశ్నించుకున్నాడు.

"పరిస్థితులు మార్చుకో."

"ఎలా మార్చను? పరిస్థితుల్ని మార్చుకోవాలంటే, ముందు మార్చుకోవాలనే బుద్ధి కలగాలి. అలా బుద్ధి కలగాలంటే పరిస్థితులు మారాలి..... నేనేం చెయ్యను? దీనికి దారి ఏదీ? ఎట్లా బయటపడాలి? ఈ పద్మవ్యూహాన్ని ఛేదించటం ఎట్లా?...."

అతనికి ప్రపంచం ఏకమై తన్ను హింసిస్తున్నట్లు కనిపించింది. ప్రపంచ భారమంతా తనొక్కడే మోస్తున్నట్లు

అనిపించింది. భావాల బరువుతో పాతాళానికి కుంగిపోతున్నాడు. తన్ను రక్షించేవాళ్ళే లేరు. తన మొర ఆలకించేవాళ్ళే లేరు. తన్ను అర్థం చేసుకునేవాళ్ళే లేరు. అతనికి దుఃఖం వొచ్చింది. తన భార్య అంకంలో తలపెట్టి పసిపిల్లవాడికిమల్లే ఏడవాలనిపించింది. తన భార్యతో తన బాధ, ఆరాటం, కష్ట సుఖాలూ - అన్నీ చెళ్ళబోసుకోవాలనిపించింది. తన ప్రవర్తనకు క్షమాపణ కోరుకోవాలనిపించింది. "నాకూ బాగా బతకాలనే ఉంది; నిన్ను సుఖపెట్టాలనేవుంది కాని నాకు చేతగావటంలేదు" అని చెప్పుకోవాలనిపించింది, తన హృదయం విప్పి ఆమె ముందు పెడితే శాంతి లభిస్తుందనే ఆశ కలిగింది. ఆ ఆశతో కొంత బలం వొచ్చింది.

"పాపా?" - పిలిచాడు.

"ఏం నాన్నా ?"

"నొప్పిగా ఉందా అమ్మా ?"

"తగ్గింది నాన్నా"

"ఇంత దెబ్బ తగుల్తుం దనుకోలేదమ్మా. ఏదో కోపం వొచ్చి..."

"పోనీలే నాన్నా"

"కొంచం లేవగలవా అమ్మా"

"ఎందుకు లేవలేను నాన్నా ?"

"అమ్మతో అన్నం వొడ్డించమని చెపుతావా అమ్మా?"

"ఎందుకు చెప్పను నాన్నా?"

భోజనందగ్గర కూర్చొని తన భార్యమీద తనకున్న ప్రేమని బహిర్గతం చెయ్యాలని ప్రయత్నించాడు. కాని ఎలా మొదలుపెట్టాలో అతనికి తెలియలేదు. ఆమె యధా ప్రకారం ఎక్కువ మాట్లాడకుండా, వొడ్డించుకుపోతూ వుంది. 'ఇవ్వాళ బీరకాయకూర బాగుం'దన్నాడు తల వొంచుకొని భోజనం చేస్తూ.

ఆమె మాట్లాడలేదు. ఆమె అటూఇటూ తిరగటం అతను గమనిస్తూనే వున్నాడు.

"కొత్తరకం వండినట్టు వున్నావే!" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"రోజూ ఇల్లా వొండగూడదూ?" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు,

"మాట్లాడవే" అన్నాడు.

"రోజూ వొండినట్టే వొండాను" అంది.

అతనికి కష్టం వేసింది. అంత ముక్తసరిగా మాట్లాడకపోతే కొంచెం నవ్వుతూ మాట్లాడితే తన సొమ్మేం పోయిందో! కూరలు బాగున్నయి అన్నాగదా, కొంచెం సంతోషించ గూడదూ? దీని దగ్గరవున్న రోగమే ఇది. ప్రతి దానికీ తనకేమీ సంబంధం లేనట్టు ప్రవర్తిస్తుంది.

"ఇవాళ ఇస్త్రీ చీర కట్టావే!" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ. ఆమె మాట్లాడలేదు. పైగా మొహం చిట్లించు

కున్నట్లు అనుమానం కలిగింది. మొహం చిట్లించుకున్న వాళ్ళని చూస్తే తనకు కంపరం అని ఆమెకు తెలుసు. తెలిసి కూడా అట్లాగే వుంటుంది. చెయ్యాలని చేస్తుం దేమో? అప్పటికీ సంభాళించుకొని "వంట్లో బాగాలేదా ఏమిటీ?" అని అడిగాడు.

"బాగాలేకేం? బాగానేవుంది" అంది.

"మరి అట్లా వున్నావేం?...."అతనికి విసుగు పుడుతూ వుంది.

"ఎట్లా వున్నాను?"

అతనికి కోపం వొస్తూవుంది. ఆమె ఎప్పుడూ ఇంతే. తాను ఎంత మంచిగా ఉందామన్నా పడనివ్వదు. తాను యెంత దగ్గరగా రావటానికి ప్రయత్నిస్తూవుంటే అంత దూరం అవుతూ వుంటుంది. తను యెంత బాగా వుందాం అనుకున్నాడు! మాట్లాట్లానికి అవకాశమే ఇవ్వదు. పైగా కడివెడు చన్నీళ్ళు అమాంతంగా నెత్తిమీద గుమ్మరిస్తుంది. ఇప్పుడు తను చేసిన తప్పేముంది? యెందుకట్లా చిట్లించు కుంటుంది? ఎందుకు అట్లా పెడసరంగా మాట్లాడుతుంది?

"సుస్తీగా వున్నట్టుంటేనూ..."

"నాకేం సుస్తీ? బాగానే వున్నాను. మామూలు గానే వున్నాను" అంది. అతనికి కోపం వచ్చింది. 'ఈ ఆడ వాళ్ళతో మంచిగావుంటానికి ప్రయత్నిస్తే లొకువ అవటం కంటే ఏమీ జరగదు' అనుకున్నాడు. మొదట అలుసు ఇచ్చినందుకు ఇప్పుడు అనుభవిస్తున్నాడు చాలు. మొదట్లో స్వాతంత్ర్యం, సమానత్వం అనుకొని నెత్తిన ఎక్కించుకోక

పోతే యిట్లా తయారయ్యేదా? అందరికిమల్లేనే ఉండేది. ఎట్లా నడవమంటే అట్లా నడుస్తూ ఉండేది. ఏం చెయ్యమంటే అది చేస్తూ ఉండేది. మాట వినకపోతే మక్కెలు విరగదన్నే పని.

"కొంచెం బీరకాయకూర వొడ్డిస్తాను" అంది.

"అక్కర్లేదు"

"భాగుం దంటిరిగా!"

"బాగుందని పొట్ట చెక్కలయ్యేటట్టు తినాలా? అది మాకు చేతగాదు. మీ నాన్న చేసేపని—నువ్వు చేసేపని" అని కోపంగా అన్నాడు.

ఆమెకు ఏమీ అర్థం కాలేదు. కాని, అనవసరంగా తన తండ్రిమాట ఎత్తితే కష్టం వేసింది—"ఇప్పుడు ఆయన సంగతి ఎందుకులెండి" అంది.

"నా ఇష్టం. నా ఇష్టం వొచ్చినప్పుడల్లా ఎత్తుతాను. నువ్వెవరవు అడ్డుపెట్టడానికి?" అన్నాడు మరింత కోపంగా.

ఆమెకు అతని కోపకారణం తెలియలేదు. తనేం చేసింద? తను కంటపట్టమే తప్పయిపోయింది. తన బతుకే దుర్భరం అయింది. అతనికి కోపం వొచ్చినప్పుడు ఎదట లేకుండా వెళ్ళటం ఆమెకు అలవాటు. ఇప్పుడూ అట్లాగే వెళ్ళబోయింది.

"ఇక్కడ నుంచోటమే నీకు కష్టం అయిందా? ఇంత అన్నం నా మొహాన వేస్తే అయిపోయిందా, నాకు అన్నం వొద్దు. నేను తినను" అని బిగ్గరగా అరిచి పళ్ళెం గభాలున నెట్టివేసి లేచాడు.

ఆమె నిర్విణ్ణురాలై నిలబడింది.

"యేం? అట్లా చూస్తావేం? నేను దయ్యాన్నా? భూతాన్నా? రాక్షసినా?" అని అరిచాడు.

ఆమె మాట్లాడలేదు.

"మాట్లాడవేం?" అన్నాడు.

"ఏముంది మాట్లాట్లానికి?"

అతనికి మండింది. శివం ఎక్కింది. "ఏముందా? ఏమీలేదూ? నాతో మాట్లాట్లానికి ఏమీలేదూ! లేకపోతే సరే. ఈ మాట జ్ఞాపకం వుంచుకో" అని పరవళ్ళుతొక్కి గబగబా వెళ్ళిపోయాడు.

ఆమె అక్కడే చతికిలపడింది.

అతనికి అంతా అయోమయం అయింది. తను ఎందుకు వెళ్ళాడు? ఏం చేసుకొచ్చాడు! ఏమనుకున్నాడు? ఏం చేశాడు? తన భార్యతో మంచిగా ఉందాం అనుకున్నాడు. తన కష్టసుఖాలన్నీ చెప్పుకుందాం అనుకున్నాడు. ఈ విశ్వప్రపంచంలో ఒక్కరన్నయినా తనవైపుకి తిప్పుకుందాం అనుకున్నాడు. ఆ పని చెయ్యలేకపోగా పోట్లాడి వచ్చాడు. ఎక్కడ జరిగిందీ పొరపాటు? ఎవ్వర్లో ఉంది తప్పు? అలాగే ఆలోచిస్తూ పడుకున్నాడు.... ...

గోడమీద బల్లి పాకుతూవుంది. లేచి దాని కెదురుగా నిలబడి అడిగాడు!

"నీకు సుఖంగా ఉందా?"

బల్లి ఆగింది.

"నాకు లేదు" అని బల్లికి చెప్పాడు.

బల్లి కదిలింది.
"నీకు కోపం వొస్తుందా!"
బల్లి ఆగింది.
"నాకు వొస్తుంది" అని బల్లికి చెప్పాడు.
బల్లి కదిలింది.
"బల్లీ!" అన్నాడు.
బల్లి ఆగింది.
"నీకు బాధలున్నాయా?"
బల్లి కదిలింది.
"నా కున్నయ్" అని బల్లితో చెప్పాడు.
బల్లి ఆగింది.
"నీకూ నాకూ సంబంధం వుందోయ్ బల్లీ. ఒక ప్పుడు నేనూ నీకుమల్లే హాయిగా పురుగుల్ని పట్టుకొని కాలక్షేపం చేశా. ఇప్పటికీ గతి పట్టింది. కానీ నీలో-నే నున్నా, నాలో నువ్వున్నావు."
బల్లి కదిలింది.
"బల్లీ!"
బల్లి ఆగలేదు.
"సోదరీ!"
బల్లి పరుగెత్తింది.
వెంటనే సీతారామారావుకి భయం వేసింది.
ఆకలి వేస్తూంది. తనభార్య వొచ్చి బతిమాలుతుం దనే ఆశవుంది. కాని ఎంతసేపు చూచినా రాలేదు. ఆక లిగా ఉంది. ఎవ్వరూ పిలవకుండా ఎట్లా వెళ్ళేట్టు!

తనంత తాను తినని వొచ్చే! మళ్ళీ వెళ్ళి ఎట్లా అడిగే ట్టు? తనే వెళ్ళి అడిగితే! తన భార్య ఏమనుకుంటుంది? ఎందుకు ఈ విషమ పరిస్థితిని తెచ్చుపెట్టుకున్నట్టు?

ఇదివరకైతే ఇంత నిర్లక్ష్యంగా ఊరుకునేదా? వొచ్చి బతిమాలేది. "మీరు తినకపోతే, నేనూ తినను" అనేది. కళ్ళవెంట నీళ్ళు పెట్టుకునేది. అన్నం తినిపించేది కూడా. ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ఏం చేస్తూ వుందో!

తను తినటం లేదుగద!

మంచినీళ్ళకోసం వెళ్ళినట్టు వెళ్ళాడు వంట ఇంట్లోకి. తను నెట్టివేసిన పళ్ళెం అట్లాగేవుంది. గది అంతా అట్లాగే వుంది. తన భార్య గడపలో కూర్చొనివుంది. ఆమె భోజనం చెయ్యలేదు. భోజనం చెయ్యనందుకు ఆమెమీద కోపం వొచ్చింది. తనమీద కసితీర్చుకోటానికే భోజనం చెయ్యలేదు. నిండు నెలలుగదా! ఆరోగ్యం సంగతి ఆ మాత్రం తెలియకపోయిందా? అవున్లే, తెలిస్తే ఆడది ఎట్లాఅయ్యేది? మొగాడిగానే పుట్టేది.

గబగబా వెళ్ళిగ్లాసుతో మంచినీళ్ళు ముంచుకొని తాగాడు. గ్లాసు నేల కేసికొట్టి "మంచి నీళ్ళివ్వటం కష్టం అయిందా? మంచినీళ్ళకూడా నేను లేచి వంటఇంట్లోకి వొచ్చి, గ్లాసుతీసుకొని, కుండలో నీళ్ళు ముంచుకుని, తాగి, మళ్ళీ ఎక్కడ గ్లాసు అక్కడపెట్టి వెళ్ళాలన్నమాట?" అన్నాడు.

ఆమె ఒక నిట్టూర్పు విడిచి, లేచి, పాత్రలు సర్దటం మొదలు పెట్టింది. అతని కోపం ఎక్కువ అయింది.

"అయితే, నేను అన్నం తినకపోయినాపరవాలేదన్న మాట!" అన్నాడు.

"..... ...."

"నేను తినకపోవటమే నీకు మంచిది."

"....."

అసలు నేను సుఖపడాలని నీకు వుంటేగా?

"..... ....."

"నేను చస్తే నీకు మరీమంచిది. ఖర్చు తప్పుతుంది. కష్టం ఉండదు. పిల్లల్ని పెట్టుకొని హాయిగా ఉండొచ్చు. అనేవాళ్ళుండరు."

ఈమాటకూడా అమె జవాబు చెప్పకపోయేటప్పటికి అతను కస్సున లేచాడు—

"నేను అన్నం తినను"

".....!"

"తిననంటే తినను"

అమె మెదలకుండా పాత్రలు సర్దుతూవుంది. అతని మాటలుఆమెకు తగుల్తున్నట్టే లేదు. ఆమెవైఖరిచూస్తే అతనికి భయం వేసింది. ఆమె ఏమనుకుంటుందో తెలియక ఆరాటపడ్డాడు.

"అప్పుడేసర్దుతున్నావేం!తిని ఒక్కసారేసర్దుకోరాదూ!"

"....."

"ఇది పాతివ్రత్యంలో ఒక భాగమూ ఏమిటి!"

"..... ....."

"ఇంకేం, నేను వెళ్తాలే, చాటుగా తిను"

"..... .... "

"అవున్లే అన్నంతింటే, నేను నిన్ను కష్టపెడుతున్నట్లు అందరికీ తెలిసేది ఎట్లా!"

ఆమె పడ్డన సామాగ్రి సర్దుతూవుంది. ఆమెజవాబు చెపితే, లోపలవున్న కుళ్ళుఅంతా బయటకు వెళ్ళగక్కటానికి అతనికి అవకాశం వుండేది. అతని కసి తీరేది. అలా జరక్కపోయేటప్పటికి, కసితీర్చుకోటానికి వీల్లేకనిప్పురవ్వలు వెదజల్లుతూ, లోపలే గుండ్రంగా తిరుగుతూ కాల్చటం మొదలుపెట్టింది కోపం.

కాని, ఆమెను ఏం చెయ్యాలో, ఎలా కదిలించాలో దారి దొరకలేదు. ఆమెను అన్నిపాత్రలూ సర్దనిచ్చాడు. అలాగేచూస్తూ నుంచున్నాడు. అన్నీ సర్దింతర్వాత "నేను అన్నం తింటాను" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"నీకే చెప్పేది" అన్నాడు.

ఆమె మెదలకుండా నుంచుంది.

"వొడ్డించవా?" అని అడిగాడు. "అవున్లే, నువ్వు నాకు ఎందుకు వొడ్డిస్తావు?" అన్నాడు.

ఆమె కదలలేదు.

ఆక్షణం అతని కోపం పటాపంచలైంది. తనమీద తనకే జాలిగలిగింది. తను అడుగుతున్నాడు. ఆమె మాట్లాడటంలేదు.

తనకు కోపం రావటంలేదు. అభిమానం చచ్చిపోయింది. మాట్లాడనప్పుడు వెళ్ళిపోగూడదూ! పోసి ఒక

పూట అన్నంతినకపోతేనేం? బజారువెళ్ళి కాఫీతాగవచ్చు. ఆకలి తీర్చుకోటానికి భార్యచేతి అన్నం ఒకటేమార్గం కాదుకదా? అతని మనస్సు ఒకప్రక్క ఇట్లా ఆలోచిస్తూనే వుంది. అతనికిమాత్రంఅక్కడనుంచి కదలబుద్ధిఅవటంలేదు.

"ఆకలి అవుతూవుంది. నన్నుచూస్తే నీకు జాలి వెయ్యటంలేదూ?"అన్నాడు. అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగినై.

ఆమెమాత్రం మాట్లాడలేదు. అతని కోపం, కరుణ, ప్రేమ, శోకం – అన్నీ ఆమెకు ఒకేరకంగా కనిపిస్తున్నాయి. రూపం మార్చేగాని పీటన్నిటికీ పునాది ఒకటేనని ఆమె గ్రహించి వుంటుంది. అందుకని అతని ఉద్రేకాలకు విలువ ఇవ్వకపోవటం ఆమెకు అలవాటైనట్టుంది. లేకపోతే అతనితో ఆమె కాపరం చెయ్యగలిగేదే కాదు.

"వడ్డించవ?" అన్నాడు సీతారామారావు. కంఠం వొణికింది.

ఆమె మళ్ళీ వొడ్డించటం మొదలుపెట్టింది.

"కాళ్ళకి నీళ్ళిస్తావా! నన్నే ముంచుకోమంటావా?" అని అడిగాడు.

ఆమె చెంబుకోసం వెళ్తూవుంది.

"నేనే ముంచుకుంటాలే! నీకెందుకాశ్రమ!" అని ఆమెకంటే ముందువెళ్ళి, చెంబుతీసుకొని గంగాళంలో నీళ్ళు ముంచుకొని కాళ్ళుకడుక్కొనివచ్చి కూర్చున్నాడు.

ఆమె అన్నం వొడ్డించింది. అతడు ఇటుతోసి, అటు తోసి, నాలుగుముద్దలు తిని లేచాడు. అతనికి మళ్ళీ కోపం

వొస్తూవుంది. ఆమెకు తను లోబడ్డాడు. ఆమే జయించింది! తను లోబడినట్లు కనబడకుండా పరువు కాపాడుకోటానికి ఏం చెయ్యాలా అని ఆలోచించాడు- తాను అన్నం తిన్నది తనకోసం కానట్టూ ఆమెకోసం అయినట్టూ—

"ఇంకేం, నీపంతమే నెగ్గిందిగా! నీ ఇష్టంవొచ్చినట్టే చేశాగా! కళ్లు చమ్మగా వున్నాయా?" అంటూ చెయ్యి కడుక్కొని విసురుగా వెళ్ళిపోయాడు.

ఆమె పెదవి కదల్చలేదు. ఏమి ఆలోచిస్తూవుందో! అసలు ఆలోచిస్తూవుందో లేదో తెలియటంలేదు. యంత్రం లాగు పాత్రలు సర్దుతూ వుంది.

4

"ఏమిట్రా నువ్వు చేసింది?" అని తన్ను తాను ప్రశ్నించుకున్నాడు సీతారామారావు. ఆతను చేసిన పని అతనికే బాగుండలేదు. ఏదన్నా పని చేస్తున్నప్పుడు తను చేసేపని మంచిదికాదని తనకు తెలుస్తూనేవుంటుంది. కాని, మానుకోలేడు. ఒక పక్కన మంచిదికాదని అనుకుంటూనే వుంటాడు, ఒకపక్కన చేస్తూనేవుంటాడు. తను చేస్తూవుంది మంచిది అనుకోలేడు. తాను మంచిది అనుకుంది చెయ్యలేడు. ఎందుకని? ఏమిటీ విచిత్రం? దీనికి కారణం ఏమిటి? పదార్థానికీ ఆత్మకీ వున్న సంఘర్షణా! తానెవ్వరూ? పదార్థమా? ఆత్మా? భిన్న మార్గాల్లో ఆలోచించే రెండూనా? చూడగా చూడగా ఆత్మకంటే పదార్థమే బలం కలదిగా కనిపిస్తుంది. ఆత్మ ఎప్పుడూ మూలవున్న ముసలమ్మకుమల్లే

గొణుగుతూ వుంటుంది. కాని, దాని గొణుగుడు వినే దెవరు? పదార్థం తనపని తాను చేసుకుపోతూవుంది.

అతను ఆలోచిస్తున్నాడు. ఒక పద్ధతిని బతకటం చేతగానివాళ్ళ అలోచనకూడా పద్ధతి ఉంటుంది. పద్ధతికి కట్టుబడని ఆలోచనలు ఉండవు. ఎందుకంటే, ఆలోచనలు పుట్టటానికీ పెరగటానికీ ఆ పద్ధతే కారణం. ఇష్టం వొచ్చి నట్లు ఆలోచించవచ్చు అనుకుంటారు కొందరు. ఎంత అజ్ఞానులు! తమ ఇష్టం తమ చేతుల్లో వుందా? తమ ఇష్టా నికిమాత్రం ఒక పద్ధతిలేదూ!

అతని ఆలోచనలు ఒకదాన్లోంచి ఒకటిఒకదాన్లోంచి ఒకటి పుట్టుకొస్తున్నై. మేడమెట్లు ఎక్కినట్లు ఒక మెట్లు మీదనుంచి ఇంకొక మెట్టుమీదకు ఎక్కుతున్నాడు. ఎందుకు ఎక్కుతూందీ అతనికి అర్థంకాదు. గమ్యస్థానం లేదు. ఎక్కినకొద్దీ ఇంకా మెట్లు కనిపిస్తూనే వున్నయి. అలిసిపోయి ఎక్కలేక వూరుకోవలసిందేగాని, ఎక్కినవాళ్ళకి ఎక్కనన్ని మెట్లు. కొంతమందికి మెట్లు ఎక్కడమే ఆహ్లాదకరంగా వుంటుంది. వాళ్ళకు గమ్యస్థానం గొడవే లేదు. ఎందుకు యెక్కుతున్నామా అనే ప్రశ్నలేదు. సీతా రామారావు విషయం వేరు. అతనికి ఆయాసంగాడుంటుంది కాని, అలసట తీర్చుకోటానికి ఆగలేడు. పైగా ఆయాసం యెక్కువైనకొద్దీ, యెక్కువ వేగంగా పరుగెత్తబుద్ధి అవు తుంది.

"ఏమిట్రా నువ్వు చేసింది?" అద్దంలో తనబొమ్మని ప్రశ్నించాడు సీతారామారావు. "ఎందుకురా నువ్వు

అట్టా చేసింది!" అని కిటికీలోనుంచి బయటకు చూస్తూ తన్ను తాను ప్రశ్నించుకున్నాడు! "ఎంత నీచుడవురా నువ్వూ!" అని తన్ను చూచుకొని తానే ఆశ్చర్యపడ్డాడు. "నువ్వుచేసినపనికి నీ రోగం కుదురుస్తా ఉండు" అని రొమ్ము మీదదబదబాగుద్దుకోవటం మొదలుపెట్టాడు మొదటవొంటి చేత్తో, తర్వాత రెండు చేతుల్తో, గుద్దు, గుద్దుమీదగుద్దు గుద్దుమీదగుద్దు. అతనికి అకస్మాత్తుగా ఇంట్లో ఆలికిడి అవటంలేదని తెలిసింది. వెంటనే తనబాధ సహించలేక భార్య ఆత్మహత్య చేసుకుందేమో అని భయం కలిగింది. బావిదగ్గరకు వెళ్ళి చూద్దాం అనుకున్నాడు. కాని, ఆమె ఏదన్నా పనిచూచుకుంటూ అక్కడేవుంటే? తను గాభరా పట్టించూసి ఏమనుకుంటుంది? తను ఎంత లోకువ అవు తాడు? తన బలహీనత ఆమెకు తెలిస్తే బతకనిస్తుందా? ఒక్క క్షణం తను కాపరం చెయ్యగలుగుతాడూ! తన జీవి తానికి గూడుకట్టుకున్న కాపురమ్మల్లే శాంతివుండదు. ఇలా ఆలోచిస్తూనే లేచి "అందుకు కాదు" అన్నట్టు ఈలవేసు కుంటూ బావిదగ్గరకు వెళ్ళాడు. కాని, బావిలోకి చూట్టా నికి భయం వేసింది. పక్కనున్న సీతాఫలంచెట్టునిపరీక్షిస్తూ నుంచున్నాడు. అది తన తండ్రి వేసింది. ఆ చెట్టు సర్వకాల సర్వావస్థల్లోనూ కాస్తుంది. ఆ చెట్టునవున్న కాయలు ఒక విధంగా లేవు. కొన్ని చిన్నవీ కొన్ని పెద్దవీ, రకరకాలుగా వున్నై—మానవసంతానానికిమల్లే చెట్టుకిపడ్డ పిందె అంతా నిలవదు. కొన్ని రాలిపోతై. కొన్ని ముగ్గిపోతై, కొన్ని

ఉడతలు కొట్టిచేస్తయ్. చెట్లకూడా గర్భశ్రావాలు ఉంటయ్యేమో!

లేనిపోని నవ్వు తెచ్చుకున్నాడు. కాని, అప్పటికీ బావిలోకి చూట్టానికి ధైర్యం చాల్లేదు. అతనికి ఆడవాళ్ళ మీద అసహ్యం వేసింది. ఎట్లాగూ చావదలచినవాళ్ళు బావిలోపడి, కిరసనాయిలు పోసుకుని చావకపోతే, సరిగ్గా చావగూడదూ? ఎన్ని సులభమైన మార్గాల్లేవు! విద్యుచ్ఛక్తి అందరికీ అందుబాటులోకి వొచ్చిందిగదా! బావిలోకి దూకటం, ఎవ్వరో ఒకడు జుట్టుపట్టుకొని పైకిలాగటం, ఒడ్డుని వెయ్యటం, ఎటుపడిన కాలు అటుగా, ఎటు వేసిన చెయ్యి అటుగా ఉంచుకొని, పెల్లికిలా పడుకొని, ఆకాశం వేపు పగలు నక్షత్రాలు లెక్కపెడుతున్నట్టు చూస్తూవుంటం ఎంత ఘోరం! ఎంత అసహ్యం! ఎంత నీచం! చచ్చిం తర్వాత ఏమైతేనేం, మేము చూడొచ్చామా అనుకుంటే చచ్చి సాధిద్దామనేగా ఈ ప్రయత్నం! భర్తల్ని ప్రపంచం ఏవగించుకునేటట్టు చెయ్యాలనీ, బజార్న వెళ్తుంటే 'వాడే', 'వాడే' అని ఇతరులు చెప్పుకునేటట్టు చెయ్యాలనే-అదేగా వీళ్ళ అభిలాష! మానవులు పశువులకు ఎంతదగ్గర్లోవున్నారో అనుక్షణం జ్ఞాపకం చేసుంది ఆడజాతి!

ఆడవాళ్ళమీదకోపంతో అతనికి ధైర్యంవొచ్చింది. తటాలున బావిలోకి తొంగిచూశాడు. బుడగలు కనిపించినై. అతనికి గుండె దడదడ కొట్టుకుంది నీళ్ళలో జుట్టు తేలుతున్నట్టు కనిపించింది. అది పిల్లలు వేసిన గడ్డి. గడ్డికో,

అడవాళ్ళ జుట్టుకీ అంత దగ్గర సంబంధం ఉందని అతనికి ఎప్పుడూ తోచలేదు.

అతనికి భార్యమీద కోపం వొచ్చింది. తన్ను అన వసరంగా ఎంత క్షోభ పెట్టింది! దొడ్లోనుంచి తన భార్య వొస్తూవుంది. ఆమె కంటపడేటప్పటికి వొళ్ళు చురచురా మండిపోయింది. తన్నింత కష్టపెట్టి ఏమీ ఎరగనట్టు నంగ నాచికిమల్లే, అడుగులో అడుగువేసుకుంటూ వొస్తూంది. ఇంట్లోనే ఉండి, చెక్కుచెదరకుండా వుండి తన్నెంత వేదన పెట్టింది! పాప వెంట వస్తూవుంది.

ఎదురుగా వెళ్ళాడు—"ఏంచేస్తున్నావిక్కడ!" అని అడిగాడు.

ఆమె మాట్లాడలేదు.

"చెప్పవేం!" అన్నాడు.

"ఏముంది చెప్పటానికి! ఇంట్లోకి వెళ్తున్నాను" అంది; అతన్ని నఖశిఖ పర్యంతం చూస్తూ నిలబడింది.

ఆ చూపులు అతనికి తను పెంచిన కుక్కను జ్ఞప్తికి తెచ్చినయి. ఆ కుక్క అట్లాగే చూసేది. చూపుల్లో అర్థం వుండేదికాదు. తన్నేదో పరీక్షిస్తున్నట్టూ, తనహృదయంలో వున్న రహస్యాలు తెలుసుకోటానికి ప్రయత్నిస్తున్నట్టూ చూసేది.

"ఎందుకట్లా చూస్తావు!" అని అడిగాడు. పాప గజ గజలాడుతూ తల్లి వెనక నక్కింది.

ఆమె మాట్లాడలేదు. తన కుక్కకూడా ఇంతే! కసి రినా తన్ను విడిచిపెట్టేదికాదు. చూపులు మానేదికాదు.

'నీ సంగతి నాకు తెలుసులే' అన్నట్టు చూసేది. కొడితే 'కుయ్యో కుయ్యో' అనేది. మళ్ళీ అట్లాగే చూసేది.

"ఏం కొడతావా?" అన్నాడు.

"నేనేం కొడతాను?" అంది. ఎందుకంత నిస్పృహ? తన కుక్కా అంతే. అతనికి ఒళ్లుమండింది.

"అయితే నేను కొడతాను" అని చెంపమీద చెడే లున కొట్టాడు. పాప కెవ్వుమన్నది. కాని ఆమె అలాగే చూస్తూ నిలబడింది.

అతను కొట్టాడు. తన భార్యను కొట్టాడు. అతని శరీరం భయంతో వణికిపోయింది. ఆయాసం ఎక్కువై వగర్పు పుట్టింది. తను కొట్టాడు. చుట్టూవున్న వస్తువులు ఏవీ అతనికి కనపట్టంలేదు. అంతా అస్పష్టమయింది. లోపల నరాలు చిటేలు చిటేలున విరుగుతున్నట్టు అని పించింది.

తను కొట్టాడు. భార్యమీద చెయ్యిచేసుకున్నాడు. బజార్లో జట్కా-లు తిరుగుతూనే వున్నయి. మనుష్యులు ఎవ్వరిపనులు వాళ్ళు చేసుకుంటూనే వున్నారు. ప్రపంచం యథాప్రకారం నడుస్తూనేవుంది. సూర్యుడు పడమటే అస్త మిస్తాడు: తూర్పునే ఉదయిస్తాడు. తను భార్యని కొట్ట డంలో ఈ ప్రపంచానికి ఏమీ సంబంధంలేదా....!

అతనికి గంగిర్లు ఎత్తినై. శరీరం అంతా సూదులు పెట్టి గుచ్చుతున్నట్లు ఉంది. అక్కడ వుండలేకపోయాడు.

ఆరో ప్రకరణం

అసమర్థుని అంతం

కృతారామారావుకి ఇంట్లోవున్న ప్రతివస్తువూ తన్ను ఎక్కిరిస్తున్నట్టూ, తన్నుచూచి వికటాట్టహాసంచేస్తున్నట్టూ కనిపించింది. పెళ్ళిలో తనూ తన భార్యాతీయించుకున్న ఫోటో గోడకు వేలాడుతూవుంది. ఆమె కుర్చీలో కూర్చొని వుంది. తను ప్రక్కన నుంచొని వున్నాడు. ఆ రోజు అతనికి బాగా జ్ఞాపకం వుంది. ఆమె తను నుంచొని వుండగా, కూర్చోడానికి చాలా సిగ్గుపడింది. తన భార్యని కూచోబెట్టి తాను ఎందుకు నుంచున్నాడు? నుంచున్న తను సంతోషంగానే వున్నాడుగాని, కూర్చున్న తన భార్య చాలా విచారంగా ఉన్నట్టు కనిపించింది. మూడోక్లాసు టిక్కెట్టుతో పరుపులబండిలో కూర్చోవలసి వచ్చినప్పుడల్లా టూరివానికిమల్లే, తన అధికారి సరసన కూర్చోవలసివచ్చిన బంట్రోతుకిమల్లే, సర్కస్‌లో పెద్దపులి వీపువిూద నుంచున్న మేకకిమల్లే-ఆమె కుర్చీలో కూర్చుని వుంది.

మరొక ఫోటోలో హార్మోనియం ముందు పెట్టుకొని కూర్చునివుంది. గడ్డిమూటలు ముందు పెట్టుకొని కూర్చున్న మాలవాళ్ళు అతనికి జ్ఞాపకం ఒచ్చారు. ఇవన్నీ ఒకప్పుడు తన్ను ఎలా ఆకర్షించాయో, ఆమే సర్వస్వం అని తను ఎలా అనుకోగలిగాడో అతనికి అర్థంకాలేదు. అప్పుడు తనే స్థితిలో వున్నాను? తన సంస్కారం, అభిరుచులూ ఎలా వుండేవి? తనగురించి తనకు తెలుసుకోవాలనిపించింది. తాను రాసుకున్న డైరీతీసిచదువుకోవటం మొదలుపెట్టాడు. అతనికి ఆశ్చర్యం వేసింది. ఏదో ఎక్కడో జరిగిన నవల చదువుతున్నట్టు అనిపించింది. అందులో వున్న వ్యక్తి కథా నాయకుడుగా కనిపించాడుగాని, సాధారణ మానవుడుగా కనపడలేదు-తనేనని తోచనే తోచలేదు. చదువుతూ పేజీలు తిరగవేస్తున్నాడు.

మొదలు పెట్టాడు:

జూలై 2

అతడూ అతని భార్యా సముద్రంవొడ్డున కూర్చొని సూర్యాస్తమయాన్ని చూశారు.

అప్పుడు తను తనభార్యని అడిగాడు--"మొదట్లో నీవు నన్ను ఎప్పుడు ప్రేమించావు?"

ఆమె సిగ్గుపడింది.

"చెప్పు ఇందీ, నాతో చెప్పవూ?" అని దగ్గరకు తీసుకుంటూ అడిగాడు.

ఆమె తలవాల్చింది.

"ఏదీ, ఇటు చూడు... చెప్పు..."

"ఎప్పుడూ ప్రేమిస్తూనే ఉన్నాను" అని, సిగ్గుతో మొహం చేతుల్లో కప్పుకుంది.

ఆ జవాబు అతనికి తృప్తినివ్వలేదు—"అలాకాదు. మరీ మొదట్లో... ఓం ప్రథమంలో...."అని అడిగాడు.

"పోనిద్దురూ" అంది చిరునవ్వు నవ్వుతూ.

"చెప్పు, నాతో చెప్పటానికి సిగ్గెందుకు?"

చివరకు ఆమె చెప్పింది. ఒకరోజు ఆమె గురుకులానికి వెళ్తూ, పది పుస్తకాలు చంకలో పెట్టుకొని చకచకా నడిచి వెళ్తున్న అతన్ని చూచిందట. చూచీచూట్టంతోటే ప్రేమించిందట!

"అప్పుడు నేను ఏచొక్కా వేసుకున్నాను?"

"పక్కగుండీల సిల్కులాల్చీ వేసుకున్నారు"

తను వేసుకున్న చొక్కా కూడా జ్ఞాపకం వున్నందుకు సంతోషం వేసింది—"అప్పుడు నీ మనస్సులో ఏమనుకున్నావు?"

ఆమె చిరునవ్వు నవ్వుతూ ఓరచూపు చూసింది.

'ఆయన నా భర్త అయితే బావుండును' అనుకున్నావుకాదూ-దొంగా!" అని చక్కలిగింతలు పెట్టాడు.

జూలై 3

సాయంకాలం అతనూ అతని భార్యా పుష్పవనంలో ఒక పూలచెట్టు కింద కూర్చున్నారు....చల్లనిగాలి వీస్తూ ఉంది. ఆమె ముంగురులు గాలికి చెదురుతూ ఉన్నయి.

"నన్ను ఏంచూచి ప్రేమించావు ఇందీ!" అని అడిగాడు.

ఆమెకు చెప్పటం చాతగాలేదు. ఆమె అతన్ని నఖశిఖ పర్యంతం ప్రేమించింది.

"చెప్పు?"

"కోటేరువంటి మీ ముక్కు"

అతనికి ఆ జవాబు నచ్చింది.

"అంత బాగుంటుందా?" అని అడిగాడు.

"మరే!" కనురెప్పలు ఆర్పింది.

ముంగురులు సవరించింది.

అతడు ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని, ముద్దు పెట్టుకున్నాడు—"ఇందీ, నా ఇందీ" అంటూ.

జూలై 4

ఒక డింగీలో కృష్ణానదిలో ప్రయాణంచేసి, ఒకలంక జేరారు. అక్కడ ఉన్నంతసేపూ అతనికి ప్రపంచంలో ఎవ్వరికీ అందని ఉన్నతస్థానంలో తాము ఉన్నట్లు అనిపించింది.

"మనం అదృష్టవంతులం" అన్నాడు.

"నేనూ–" మొదటి అక్షరం వొత్తి పలికింది.

"నేను మాత్రం కాదూ? మనలాగు నిష్కల్మషంగా, పవిత్రంగా, నిర్మలంగా, అమితంగా ప్రేమించుకునే వాళ్ళీ ప్రపంచంలో లేరు" అన్నాడు.

"నిజమేనండీ" అని నిట్టూర్పు విడిచింది.

"అండీ అనకు, నేనే నీవు, నీవే నేను"

"ఏమనమంటారు మరి?"

"పేరున పిలువు"

"అబ్బా! మీ పేరు పెద్దదండీ!"

"రామూ అని పిలువూ."

ఆమె సిగ్గుపడింది.

"నేను 'ఇందీ' అని పిలవటంలా?"

"....."

"అయితే నేను ఇందిరాదేవిగారూ అని పిలుస్తాను"

"వొద్దు...వొద్దు" అని బతిమాలింది. "చూశారు గమూ?" అని అలిగింది.

"మరి నీవు పేరున పిలిస్తే!"

ఆమె పిలిచింది. అతని హృదయం ఆనందంతో నిండి పోయింది.

"మళ్ళీ!" అన్నాడు.

ఆమె పిలిచింది— 'రామూ!'

"ఇంకొంచెం బిగ్గరగా!"

అమె పిలిచింది. తన కంఠధ్వనికి తానే సిగ్గుపడి, అతని వొళ్ళో తలదాచుకుంది. అతడు ఆమె తలనిమురుతూ పరవశత్వం పొందాడు. ఇంతఆనందం ప్రపంచంలో ఎవ్వరు అనుభవిస్తున్నారు?

ఆనందో బ్రహ్మ.

జూలై 5

అతడు రాశాడు—

'మన జీవితం ఎల్లప్పుడూ ఇలాగే జరగాలి?'
ఆమెకు భయంవేసింది.
"మన శరీరాలు వేర్వైనా, ఆత్మలు ఒక్కటే" అన్నాడు.

ఆమె తలపూపింది—ఆమెకు గురుకులంలో అందరి ఆత్మలూ ఒకటేనని చెప్పారు.

"కాబట్టి, మన మధ్య రహస్యా లుండకూడదు" అన్నాడు.

ఆమెకు భయం వేసింది-ఈమాట ఎందుకు అంటు న్నాడో తెలియక.

అతడు గ్రహించి, "ఇప్పుడున్నాయని కాదు. ఎప్పుడూ ఉండగూడదు. జరిగే విషయాలే కాకుండా, మనస్సుల్లో కలిగే భావాలను కూడా ఒకరికొకరం చెప్పు కుందాం-ఎటువంటి భావం అయినాసరే! మనకి ఒకరిమధ్య ఒకరికి భయం ఎందుకు? అన్ని విషయాలూ నిండు హృద యాలతో చర్చించుకుందాం. అప్పుడు మన నిర్మలప్రేమ నిర్విఘ్నంగా సాగిపోతుంది" అన్నాడు.

ఆమె అంగీకరించింది...

* * *

ఇక చదివలేక పోయాడు. హృదయంలో బాకులు కదిలినై. ఎవరీ వ్యక్తి? తనేనా! అప్పటి ఆమేనా ఈ తన భార్య? ఆజీవితం తొమ్మిదిపిసదేనా! ఆ ప్రేమ, ఆ భావాలు

తాము వెలిబుచ్చినవేనా? ఆ ఔదర్యాలు, ఆ ఆశయాలు తనవేనా?

తను ఎంత మారిపోయాడు! అనుక్షణం మారుతూ వుంటంవల్ల తనలో వొచ్చిన తీవ్రమైన మార్పు తనకు తెలియదు కాని, వెనక్కి తిరిగి చూచుకుంటే, అప్పటి తనతో ఈనాటి తనను పోల్చిచూచుకుంటే, గుండె గుభేలుమంది. ఒకప్పుడు తనలో అన్ని ఉన్నతభావాలు వుండేవా? తన హృదయం అంత ప్రేమపూరితంగా, అంత పవిత్రంగా ఉండేదా? తాను ఇంత మారాడా? అధఃపాతాళానికి పోతున్నాడా?

గబగబా వెళ్ళి, అద్దంలో తన మొహం చూచుకున్నాడు. అతని గుండెలు పగిలినయి. సన్నని భయంకరమైన ఎలుగు అతని కంఠంలోనుంచి బయటపడింది.

నిజంగా తను మారాడు. భావాలతోపాటు ఆకారం కూడా మారింది. కళ్ళు గుంటలుపడినై. నల్లగుడ్డుని తెల్లపొర కప్పుతూవుంది. నుదురుమీద అడ్డలు ఏర్పడినై. పెదిమలపక్క గీతలు కనుపిస్తున్నయి. కిందిపెదవి బరువు ఎక్కువై, పట్టుతప్పి, వొదులు వొదులుగా వుంది. దవడ కిందిభాగం ముందుకు పొడుచుకొని వొచ్చింది. అతనికి అకస్మాత్తుగా నెమురువేసే గేదెదవడ జ్ఞాపకం వొచ్చింది. వేదనతో ఉడికిపోయాడు. తన పెళ్ళినాటి ఫోటో చూశాడు. అద్దంలో ఇప్పటి తన ముఖం చూశాడు. "ఇందులో ఎవర్ని నేను? ఎవర్ని? ఆ సౌమ్యమూర్తినా? ఈ పిశాచాన్నా? ఎవర్ని?"

ఈ ప్రశ్నకు జవాబులేదు. సౌమ్యమూర్తి విచారంగా చూసింది. పిశాచం భయపెట్టింది. అతనికి తన శరీరం పెరుగుతున్నట్లు అనిపించింది. ఇల్లు ఇరుకైంది. కత్తుల బోనైంది. తన శరీరం పట్టటంలేదు. ఊపిరి సలపటం లేదు. బయటకు వెళ్ళాడు. ఎక్కడకు? వెళ్తే ఏం? వెళ్ళక పోతే ఏం? అసలు ఎక్కడికో ఒకచోటికి వెళ్ళాలని ఎక్కడుంది? వెళ్ళటమే కావాలి. ఎక్కడికి అనేది అనవసరం అయిన ప్రశ్న. అతడు వెళ్తున్నాడు. నడుస్తున్న అతనికి అకస్మాత్తుగా తన దుస్థితికి తన స్నేహితులే కారణం అనిపించింది. వాళ్ళంతా తనలాంటివాళ్ళే! జీవిత ప్రవాహంలో కలవలేక, వెనకపడి ఎవరికివాళ్ళే ఒక చిన్న ప్రపంచంగా, ద్వీపకల్పంగా తయారై తమ పాపాలను, తమ ఆలోచనలను తామే మొయ్యలేక బాధపడుతున్నవాళ్ళే!

అతను ఒక్కొక్కళ్ళను గురించి ఆలోచించాడు. బజారున్నపడి నడుస్తూనే వున్నాడు. ఆలోచిస్తూనే వున్నాడు. అతనికి మట్టుకి నడుస్తూన్నట్టూ లేదు, ఆలోచిస్తున్నట్టూ లేదు.

అతని స్నేహితుల్లో ముఖ్యుడైన సూర్యారావు ఒకప్పుడు కథలూ, వ్యాసాలూ రాస్తూవుండేవాడు. కొన్ని తిరిగి మళ్ళీ అతనివద్దకే వొచ్చేవి. భూమి గుండ్రంగా వుంటమే దీనికి కారణం అనుకునేవాడు, వాదించేవాడు, నిరూపించేవాడు.

ప్రస్తుతం రాయటం మానుకున్నాడు. మనదేశంలో పేరున్న రచయితలు ఇతరదేశ రచయితలనుంచి ఏ మేమి కాపీ కొట్టి పేరుగడించారో పరిశోధన చేస్తున్నాడు. ఏ పుస్తకం బాగుందన్నా, అతను సహించలేడు. వెంటనే ఏ ఇంగ్లీషు పుస్తకం కాపీయో చెప్పేస్తాడు. అలా పుస్తకం పేరు చెప్పటానికి ఏద్దైనా ఇబ్బంది కలిగితే "నేను ఎక్కడో చదివినట్టుంది. ఇది తప్పకుండా కాపీయే ! లేకపోతే మన వాళ్ళు ఇంత బాగా రాయకేం!" అంటాడు. "పోనీ నువ్వు బాగా రాసి చూపరాదా?" అంటే "రచన చేస్తే, ఉత్తమ రచనే చెయ్యాలి" అంటాడు.

"అలాగే చెయ్యి"

"అది నాపని కాదు. ఈ కుర్చీ బాగా లేదంటే ఇంతకంటే మందిదిచేసి చూపమనటం కేవలం వెర్రి. అది నా వృత్తికాదు" అని జవాబు చెపుతాడు.

ప్రస్తుతం మన సారస్వతం 'నానాటికీ తీసికట్టూ నాగంభొట్లు'గా వుండటానికి కారణాలు పోగుచేస్తున్నాడు. ఈ విషయంమీద తాను విసుకోకుండా శ్రోతలను విసిగిస్తూ, రోజులతరబడి మాట్లాడగలడు.

"మన రచనల్లో తెలుగు నుడికారం, తెలుగుజీవితం, తెలుగుతనం, తెలుగు జాతీయత వుట్టిపడుతుండాల. అప్పుడే మనం వుత్తమ రచనలు చెయ్యగలుగుతాం...."అంటాడు.

"అంటే యేమి చెయ్యాలి?"

అతను యే మాత్రం తడుంకోకుండా జవాబు చెపుతాడు: "ఉపకు కృష్ణమ్మతల్లి వుండగా, యమునా నదిని

గురించి వ్రాయటం యెందుకు? మనకు వేమన వుండగా భక్తుకారాంను వ్రాయటం యెందుకు? మనకు తెలుగు యోధులు అనేకమంది వుండగా, శివాజీని గురించి వ్రాయటం ఎందుకు? మనకు కనకదుర్గ వుండగా కాశీమహాత్మ్యం వ్రాయడం యెందుకు?" అని కరతాళ ధ్వనులకోసం ఎదురు చూస్తాడు.

ఇలా గంటలతరబడి మాట్లాడి, చివరికి "ఏమీ లాభం లేదు. విదేశ్రభుత్వం పోతేగాని మనం ఉత్తమ రచనలు చెయ్యలేం" అని తేలుస్తాడు. అతనిలో వున్న సుగుణం ఏమిటంటే చనిపోయిన రచయితలను పొగుడుతాడు. రచయిత గొప్పతనం మరణించడం మీద ఆధార పడి వుంటుంది.

రెండో అతను శాతవాహనుడు. మాటల్లో విచిత్రతా, ఇడ్లీమోదికి కారప్పొడి ఇతనికి ఇష్టం. "నేను సుఖపడను, ఇతరులను సుఖపడనివ్వను" అంటాడు. ఈ విషయాన్ని గురించి అత నొక గేయం రాశాడు....

అనురాగం అంబరమైతే
ఆనందం ఆర్ణవమైతే
మేం తోకచుక్కగా వస్తాం
బడబానలమై మండిస్తాం.

ప్రపంచ మొక నందన వనమై
జీవిత మొక గులాబి ఐతే
మేం ముళ్ళ తొడుగుగా ఉంటాం
సుస్వప్నం భంగపరుస్తాం.

జీవిత పను కేళీగృహములో
సుఖమే ఒక విరిపాన్పయితే
మేం కాలసర్పమై వొస్తాం
విషాద విషజ్వాలలు తెస్తాం.

మీ నిద్రా సుఖ సమయములో
స్వాప్నిక ప్రశాంతి నిలయములో
మేం పీడకలలుగా వొస్తాం,
రౌరవదృశ్యము చూపిస్తాం.

మీస్వప్నలోక యాత్రల్లో
మీ హేమాసవ పాత్రల్లో
కన్నీటిధార నింపేస్తాం.
మీ బాటను జారుడుచేస్తాం.

పానకపు పుడకగా వొస్తాం
టీ కప్పులో ఈగైచస్తాం
మీ శాంతిని భగ్నంచేస్తాం.
మీ శాంతిని భగ్నం చేస్తాం.

"ఏమిటీ వేషం ?" అని అడిగితే జవాబు గేయం లోనే చెప్పేవాడు—

"కాషాయం విషాన్నం,
నీకోసం కా దీవేషం"

"ఎందుకిట్లా వూరికనే తిరుగుతావు?" అని అడిగితే జవాబు ఇలా చెబుతాడు—

• మిత్రుడు బైరాగికిక్షమాపణలతో.

"తిరుగుడా మూర్ఖుడా ?
తిరుగుళ్ళో అరుగుడుందే
అదేగా లోకానికి విరుగుడు!"

ఇతనికి పిల్లలంటే అసహ్యం. కళ్ళబడితేనే ఉలిక్కి పడతాడు. వాళ్ళల్లో తన ప్రతిబింబం నగ్నంగా కనిపిస్తుందో ఏమో? వాళ్ళకూ తనకుమల్లేనే విచిత్రత అంటే ఇష్టం. తాను ఎంతో ఆలోచించి గేయరూపంలో పెట్టగలిగింది, వాళ్ళు ఏ ఆలోచనా లేకుండా పాట్లాడగలరు. "ఎందుకు పసిపిల్లలంటే నీ కింత కంటకం?" అని అడిగితే అతను చెపుతాడు—

"పళ్ళులేని పసిపిల్లలు
కళ్ళులేని కబోదిపశులు
జగన్మాత విదిలించిన పసిబొగ్గులు....
ఒంటేలికిపోస్తే తంటా లేదంటావా"

ఈ విచిత్ర వ్యక్తిలో మరీ విచిత్రం ఏమిటంటే, ఇన్ని చెప్పే ఇతను, జీవితాన్ని ఎంతో నిర్లక్ష్యంచేసే ఇతను, ఆకలికి దాసుడు. ఆకలిముందు స్నేహితులు ఆగరు; కవిత్వం ఆగదు; తన అనార్కిష్ట్ సిద్ధాంతం ఆగదు. ఇడ్లీమీదకు కారప్పొడో, భోజనంలోకి కొబ్బరి పచ్చడో లేకపోతే ఇంత మొహం చేసుకొని కొట్లాడతాడు. ఇక తన జీవితంలో ఈ కారప్పొడి, పచ్చడి తినే భాగ్యం ఇప్పట్లో రాదు అన్నట్లు ప్రవర్తిస్తాడు. తన జీవితంలో సుఖపడే

పెద్ద అవకాశం ఆ కాఫీహోటలు సర్వ్‌రూ, ఇంట్లో తన తల్లీ పొట్టన పెట్టుకున్నట్లు భావపడతాడు.

బాలకృష్ణుడు తండ్రి కొడుకు. ప్రతి చిన్న విషయానికి "మానాన్న వున్నాడు చూశారూ...." అంటూ వుంటాడు. వాళ్ళనాన్న చెప్పని విషయంలేదు. 'ఈ ప్రపంచంలో జరిగేవన్నీ ఇంట్లో కదలకుండా కూర్చుని ముందే చెప్పేస్తూ వుంటాడు. అవన్నీ, అతను చెప్పినవి చెప్పినట్లు అక్షరాలా జరుగుతూ వుంటై. ఈ సంవత్సరం రోహిణీ కార్తెలో ఎండలు వుండవని ఆయన గత సంవత్సరం రోహిణికే చెప్పాడు. ఇకముందు పుట్టబోయే పిల్లలకు ముక్కులుండవని ఆయన పది సంవత్సరాలకిందే చెప్పి అట్టిపెట్టాడు. యుద్ధానంతరం కలరా ఎక్కువగా వుంటుందని ఆయన యుద్ధం రాకముందే చెప్పాడు. "చూడండి! అన్నీ అక్షరాలా జరుగుతున్నై" అంటాడు బాలకృష్ణుడు. "మా నాన్న వున్నాడు చూశారూ, ఆయన దివ్యదృష్టి ఆమోఘం!" అంటాడు.

అతడు తండ్రికి భానిస. తనతండ్రి గొప్పతనానికి దృష్టాంతాలను పోగుచేస్తూ, ఇతరులకు నిరూపించి చెపుతూ జీవితం గడుపుతున్నాడు. "మా నాన్న వున్నాడు చూశారూ..." అంటూడే గానితను ఏమనేదీ ఎప్పుడూ చెప్పడు. తను ఏదీ అనడు. తను ఒకప్పుడు ఏమన్నా అన్నా అది ఎప్పుడో వాళ్ళ నాన్న మాట్లాడిన విషయమే అయి వుంటుంది. వాళ్ళ నాన్న దగ్గరకు అనేకమంది వొస్తుంటారు. సలహాలు తీసుకుంటూ వుంటారు.

ఆ సలహాలు ఆచరణలో పెట్టి గొప్పవాళ్ళవుతారు. ఈ విధంగా గొప్పవాళ్ళయిన వాళ్ళు అన్ని శాఖల్లోనూ వున్నారు కానిఒక్కరూ కృతజ్ఞతచూపరు. పైగాఎప్పుడైనా తనతండ్రి వాళ్ళను కలవటం తటస్థిస్తే ఎరగనట్టు నటిస్తారు.

"ఏమిటి కారణం?"

"మా నాన్నముందు తమ తక్కువతనాన్ని కప్పి పుచ్చుకోటానికి అది వొక ఎత్తు."

"పోనీ ఎల్లకాలం ఇతర్లను గొప్పవాళ్ళను చేస్తూ కూర్చోకపోతే, తనే గొప్పవాడవగూడదూ?"

"అదే మా నాన్న గొప్పతనం-తనసంగతి ఎప్పుడూ ఆలోచించడు!"

అతని మాటలు వింటూవుంటే, సీతారామారావుకి ఒక్కొక్కప్పుడు కోపం వస్తుండేది. ఒక్కొక్కప్పుడు ఈర్ష్య కలుగుతూ వుండేది: ఇతరుల తండ్రులు సంతలు అయినట్లూ, తన తండ్రే తండ్రి అయినట్లూ మాట్లాడుతూ వున్నందుకు కోపం. తనకూ తండ్రి అంటే భక్తే, దాని బయటకు చెప్పుకోటానికి బాలకృష్ణునికి వున్న ధైర్యం తనకు లేదు. తనకులేని ధైర్యం అతనికి వున్నందుకు ఈర్ష్య.

ఒకరోజు బాలకృష్ణుడు మాట్లాడుతుంటే ఆగలేక "మీనాన్న, మానాన్న గొప్పవాడా?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకు బాలకృష్ణుడు నివ్వెరపడయ్యాడు. తెల్లబోయిన నోరు మూయకుండా చూస్తూ కూర్చున్నాడు. ఏమీ మాట్లాడలేదు. కాని బయటకు వెళ్ళి "అదేమిటోయ్ సీతారామారావు తండ్రిని పొగుడుకుంటాడు!" అని ఎగిసిన

వాళ్ళందరికీ చెప్పాడు. ఒక్క చెప్పటమేకాదు. అలా తండ్రిని పొగుడుకోవటం పశులక్షణమనీ సంస్కారం వున్న వాళ్ళెవరూ ఆ పని చెయ్యరనీ నిరూపించి అందర్నీ ఏక్‌గీ వంగా వొప్పించాడు.

శివరావు మరొకరకం. తన్నుగురించి ఎవళ్ళెవళ్ళు గొప్పగా చెప్పుకుంటూవుంటే ఏకరువు పెడతాడు. వాళ్ళ అభిప్రాయాలకు విలువ రావటానికి, ముందు తన్ను పొగడుతున్న వాళ్ళు ఎంత గొప్పవాళ్ళో నిరూపించి తరువాత తనని గురించి వాళ్ళిచ్చిన అమూల్యాభిప్రాయాలను బయట పెడతాడు.

ఒకతనికి ప్రపంచంలో ఎవరన్నా పడదు. తనంటే మాత్రం అతడు పడిచస్తాడు.

ఒక గొప్పవాడు తిను రెండురోజులు కనబడక పోతే ఉద్యోగానికి సెలవుపెట్టి తన్ను వెతుక్కుంటూ వొస్తాడు.

మరొకడు అతిగోప్యంగా ఉంచవలసిన కుటుంబ వ్యవహారాలు కూడా తనతో చర్చిస్తాడు. తనదగ్గరకు వొచ్చి "ఏమోయ్-నా భార్యసంగతి నాకు అనుమానంగా ఉంది. ఏం చెయ్యమంటావు?" అని అడుగుతాడు.

ఇక ఆడవాళ్ళని గురించి అతను కోసేకోతలు, వేసే అపవాదులు, ఆహ్లాదకరంగా వుంటాయి. చెవులు కోసుకుని వినబుద్ధి అవుతుంది. వూళ్ళో ఆడవాళ్ళంతా తన్ను చూచి ఆగలేక పోతున్నట్లు మాట్లాడుతాడు.

"అదేమిటోయ్, బజార్న నడవ నివ్వరేం!" అని అడుగుతాడు.

"వొద్దు వొద్దన్నకొద్దీ డబ్బు గిరాటువేసి పోతాడే మిటోయ్!" అంటాడు.

చేతి ఉంగరం చూపిస్తూ, "మనం కొనకేం? నిన్న బజారున్నించి ఇంటికి వెళ్ళేటప్పటికి ఒకామె ప్రత్యక్షం... వొద్దన్నకొద్దీ వేలికి తగిలించిపోయింది. అబ్బా! రాత్రంతా నిద్దలేదోయ్ ...." అని ఆవలిస్తాడు, విచారంగా మొహం పెట్టి, "ఆడవాళ్ళని తగిలించుకోవటం తేలికే వొదిలించుకోటం బహ్మప్రళయం"అంటాడు.

అతను మాట్లాడేవస్తి అబద్ధాలేనని మిగిలిన వాళ్ళందరికీ తెలుసు. కాని, ఆ కథలే అతనితో మళ్ళీమళ్ళీ చెప్పించుకొని ఆనందపడుతుండేవాళ్ళు. అపవాదుకున్న ఆకర్షణ ఈ ప్రపంచంలో ఆ పదానికి లేదు. అపవాదు ఇచ్చే ఆహ్లాదం మరొకటి ఇవ్వలేదు.

వీళ్ళంతా జ్ఞాపకం వొచ్చేటప్పటికి సీతారామారావుకి కంపరం పుట్టింది. ఒకప్పుడు తన స్నేహితులుకూడా తనకుమల్లే జీవిత క్లేశాలను లెక్కచెయ్యక సంఘానికి ఎదురు తిరిగిన వాళ్ళేననీ, ఎవ్వర్నీ లెక్కచెయ్యని స్వాతంత్ర్య ప్రియులేననీ సంతోషించేవాడు. ఇప్పుడు వొట్టి మాటలపోగులుగా కనిపిస్తున్నారు. వీళ్ళు, ప్రపంచం నిర్లక్ష్యం చేస్తుంటే, మాటలతో దానిదృష్టిని ఆకర్షించటానికి ప్రయత్నిస్తున్నారు. తమ అసమర్థతలను మాటల తొడుగుతో

కప్పిపుచ్చటానికి ప్రయత్నిస్తున్నారు. జీవితాన్ని అనుభవించలేక, జీవితపు లోతులను తడీవి తడివి చూడలేక, మాటలతో ఆత్మవంచన చేసుకుంటున్నారు. మాటల్ని నమ్మకొని, అమ్మకొని తృప్తిపడుతున్నారు. మాటలు — మాటలు — ఎడతెరిపిలేనిమాటలు. అంతులేని సంభాషణ — విరామంలేని చర్చలూ, వాగ్వివాదాలూ — మాటల్తో ఒకర్నొకరు గెలవాలనే తాపత్రయం-ఇదీ తాము నిత్యం చేస్తున్న పని. పైగా ఏదో ఒక పనిచేస్తున్నవాళ్ళని విమర్శించటం, నిందించటం. ఏదో ఒక పని చెసేవాళ్ళల్లో తప్పులు దొరుకుతాయి; ఏ పనీ చెయ్యనివాళ్ళల్లో తప్పు లేముంటయి? కాబట్టి తాము తప్పులు చేస్తున్నవాళ్ళకంటే అనేకరెట్లు గొప్పవాళ్ళ మనుకునేవాళ్ళు.

ఇవన్నీ జ్ఞాపకంవచ్చి రోడ్డుమీద నడుస్తూ నడుస్తూ వున్న సీతారామారావు టపాలున ఆగిపోయి, అరికాలుతో రోడ్డుని శక్తికొద్దీ ఒక తన్ను తన్ని "నా పతనానికి వీళ్ళే కారణం; నా స్నేహితులే కారణం. సంవత్సరాల తరబడి వీళ్ళు తప్ప నాకు ప్రపంచంలేదు. వీళ్ళనిబట్టి నా స్వభావం మారిపోయింది. వీళ్ళ మూలకంగానే నేను పనికిమాలినవాడి నయ్యాను." అని బిగ్గరగా అరిచాడు.

అరవటం, మరొక నంగతిజ్ఞాపకం రావటం-రెండూ ఒకేసారి జరిగినయి సీతారామారావుకి.

"వాళ్ళ మూలాన నేను చెడిపోయాననుకోటానికి ఎట్లాపీలు? నామూలానే వాళ్ళు చెడిపోయారేమో! వాళ్ళీ స్థితికి రావటానికి నేనే కారణం ఏమో!

వాళ్ళకీ ఇన్నేళ్లుగా నేనే ప్రపంచం అయి, నా సంపర్కంవల్లే వాళ్లు లోకానికి పనికిరాకుండా పోలేదుగదా! ఇంతమంది జనాభాలో వాళ్ళకినేనూ, నాకువాళ్ళూ ఎందుకు తటస్థపడాలి? వాళ్ళకీ నాకూ ఏమి సంబంధం? ఒకరి కొకరికి ఎందుకు స్నేహం ఏర్పడింది?

మా అందరికీ ఒకేగుణం వుండివుండాలి. అంతా ఒక రకం గనకే స్నేహం ఏర్పడింది.

ఇక ఒకరివల్ల ఒకరు చెడటం ఏమిటి? చెడ్డేకలిశాం, కలిసే చెడ్డాం" అనుకున్నాడు.

* * *

దీనికంతా తమ బలహీనత, తమ అల్పత్వమే కారణం అనిపించేటప్పటికి సీతారామారావుకి ఎదురుగుండా వస్తున్న పెద్దమనిషిని అగ్గిపెట్టె నెపంతో ఆపి, కాలికి మెలికవేసి పడేసి, మొహం రక్కాలనిపించింది. వెంటనే మహారణ్యాల్లోకి వెళ్ళి దాపులుకొట్టి బతకాలనిపించింది.... ఆహా. మహారణ్యంలో జీవితం ఎంత స్వేచ్ఛగా ఉంటుంది!... ...

అర్ధరాత్రి రెండెడ్లబళ్లు వొస్తుంటాయి. ఆ బళ్ళల్లో మొగవాళ్ళు, ఆడవాళ్ళు, పిల్లలు, జెల్లలు-అంతాకిక్కిరిసి కూర్చునివుంటారు. ఎడ్ల మెడలకు వున్న గంటలు గణగణ గణగణ మోగుతుంటయి. ఆబళ్ళ తొట్లలో కూర్చుని, బళ్ళుతోలుతున్నవాళ్ళు భయం పోగొట్టుకోడానికి ఆంజనేయ దండకం పఠిస్తూవుంటారు:

"శ్రీ అంజనేయం
ప్రసన్నాంజనేయం
ప్రభాదివ్య కాయం
ప్రశస్త ప్రకాశం...."

అంటూవుంటారు ఎలుగెత్తి. బళ్ళలోవున్న ఆడవాళ్లు భయపడుతూనే దొంగల కథలూ, దెయ్యాల కథలూ చెప్పుకుంటూ వుంటారు. దెయ్యాలు మహా కంత్రీవి. ఒక పల్లకీ బుజాన పెట్టుకొని, 'ఏగోకం బైగోకం' అనిబోయీలకు మల్లే శబ్దాలు చేసుకుంటూ ప్రయాణీకులను మోసం చేస్తాయి. అంతలో దొంగలతోపు వొస్తుంది. ఆ తోపు దొంగతనాలకు ప్రసిద్ధి. ఆ చుట్టుప్రక్కల గ్రామాలకు ఆ పేరు వింటేనే వణుకే! బళ్ళల్లోవాళ్లు ప్రాణాలు బిగపట్టుకుని కూర్చుని వుంటారు. ఎడ్లుకూడా చెవులు రిక్కించి భయం భయంగా ముందుకు అడుగులు వేస్తుంటాయి. ముందుకు చూపకుండా పక్క పొదలవైపుకి చూస్తూ నడుస్తూంటాయి. బళ్ళల్లో వున్న మొగుళ్ళులేని ఆడవాళ్లు-

"రాముడేమున్నాడే
భద్రాచల రాముడేమన్నాడే...."

అని పాడుతూ వుంటారు. అప్పుడు సమయంకోసం పక్క పొదలచాటున ఉండి ఎదురుచూస్తున్న తాము ఒక్కసారి దారిలోకి దూకి—

"ఏముండల్లారా
మాటలెమ్మన్నాడే!"

అంటారు. ఎడ్లు నిలబడిపోతయి. తొట్లలో కూర్చున్న

వాళ్ళ ప్రాణాలు ఎగిరిపోతయి. ఆడవాళ్ళు, పిల్లలు "బే" అంటారు తమ హృదయాలు ఘాతం కరగవు. ఎందుకు కరగాలి? ఒక్కొక్కరిని నిలబెట్టి దోపిడీచేస్తారు. ఎవరైనా యెదురుతిరిగితే యిష్టంవచ్చినట్లు తన్నొచ్చు. అనేవాళ్ళుండరు? ఎక్కడ తమ గౌరవానికి భంగం వస్తుందో అని భయపడవలసిన పనిలేదు. తాను ఆ మహారణ్యానికి కంటక కిరీటధారి-ప్రస్తాన భేరి!

2

రోడ్డుమీద నడుస్తూన్న సీతారామారావు బిగ్గరగా నవ్వుకున్నాడు. ఈ ఆలోచన అతనికి అమితానందాన్ని చ్చింది. సంఘంలోవున్న కట్టుబాట్లు, నియమాలు, ఆచారాలు, న్యాయశాస్త్రాలు-ఏమీ లేకుండా వుండటం అతనికి హాయిగా ఉంది. ఇంకా ఆలోచించాడు.

నిలువుదోపిడీ అయింతర్వాత అతనికి ఒకపని చెయ్యాలి బుద్ధి అయింది. ఆ బళ్ళల్లో మంచివయస్సులోవున్న పిల్లలు ఒక తె ఉంటుంది. ఆపిల్లలు అందరికిమల్లేవుండదు. అతి నిర్మలంగా, కోమలంగా ఉంటుంది. కాని, ఆపిల్ల గూడా భయపడుతూ, వొణికిపోతూ, కన్నీరుకారుస్తూ ఉంటుంది. దూరంగా ఒక చెట్టుకింద నిలబడివుంటుంది. తను ఆమెను చూస్తాడు. దగ్గరకు వెళ్తాడు. ఆమెను ఒక్కసారి నఖశిఖ పర్యంతం చూస్తాడు. ఆమె రెపరెపకొట్టుకుంటూవుంటుంది.

తన వైఖరిచూచి మానభంగం అయిందే అనుకుంటుంది. మానభంగాన్ని గూర్చి అనేక ఊహలు ఊహించుకుంటుంది. అనేక కథలు-తాను విన్నవి-జ్ఞాపకం తెచ్చుకుంటుంది. ఆ ఊహలవల్ల, ఆ జ్ఞాపకాలవల్ల ఆమెకు ఎదురు తిరిగి శరీరం అందుకు సిద్ధపడుతుంది. నరాలు సడలుతాయి. శరీరం పాకానికి వొస్తుంది. రక్షించమని పట్టుకుంటుంది.

"ఊరుకో" అంటాడు తను. ఆమెకు ఆధ్వని మేఘ గర్జనలాగు వినబడుతుంది. ఏ క్షణం ఏం జరుగుతుందో అని ఆపేక్షగా ఉపేక్షిస్తూ వుంటుంది—ఫించం విప్పుకొని.

తను ఏమీ చెయ్యడు. "జావ్" అంటాడు. తన అనుచరులు అంతా చెట్లచాటుకు వెళ్ళిపోతారు. మానభంగాన్ని గురించి అనేకరకాల ఊహలను ఊహించుకున్న ఆమెకు, భయంతో అనేక దృశ్యాలను కలకన్న ఆ పిల్లకు, ఏమీ జరక్కపోయేటప్పటికి ఆశాభంగం అవుతుంది. తీవ్రమైన ఆవేదన బయలుదేరుతుంది. డస్సిపోయి కూల బడుతుంది. ఇంత జరిగిన తర్వాత జన్మజన్మాలకూ తన్ను మరచిపోగలుగుతుందా ఆ పిల్ల? మరచిపోలేదు.

అతని ఆలోచన ఆగిపోయింది. ఎక్కడికి వెళ్తున్నాడు తను? చుట్టూ చూశాడు. రామయ్యతాత ఇల్లు దగ్గర్లోవుంది. అతనికి రామయ్యతాత దగ్గరకు వెళ్ళబుద్ధి అయింది. అతను ఇప్పుడు ఏంచేస్తూ వుంటాడు?

* * * *

అతను వెళ్ళేటప్పటికి రామయ్యతాత మనుమడితో ఆడుకుంటున్నాడు. మనుమడు వీపుమీద ఎక్కి "గుళ్ళం గుళ్ళం ఛల్ ఛల్" అంటున్నాడు.

అంత పెద్దవాడు పసిపిల్లవాడికిమల్లే ప్రవర్తించడం, తన్ను తాను మరచిపోయి, తన వయస్సు మరచిపోయి, తన భావాలు మరచిపోయి తనూ పిల్లవాడికిమల్లే ఆడుకోవటం అతనికి ఏమీ బాగాలేదు. ప్రపంచం ఇంత క్షోభ పడుతుంటే రామయ్యతాత శాంతంగా కాలంగడపటం అతనికి అసహ్యం వేసింది. ఆక్షణం రామయ్యతాత అతని కళ్ళకు మరిగుజ్జుగా, మట్టిపిడచగా, మర్యాద రామన్నగా కనిపించాడు.

రామయ్యతాత అతన్ని చూచి, పిల్లవాణ్ణి దించి, "ఈ జీవితంవుంది చూశావూ...." అని వుపన్యాసం మొదలు పెట్టాడు.

సీతారామారావు వొళ్ళు మండింది. ఈ గుర్రమూ తనకు నీతులు ఉపదేశించేది! జీవితాన్ని గురించి వ్యాఖ్యానం చేసేది! ఈ గుర్రానికి రావొత్తుకూడా లేదే. తనకు తోడు ఇంకొకళ్ళకి హితోపదేశం కూడానా?

"ఆ చూశాను, చూడకేం? పిచ్చివాడి రూపంధరించి ముడ్డిమీద తంతూవుంది" అన్నాడు.

ఈ మాటకు రామయ్యతాత ఉలిక్కిపడ్డాడు. సీతారామారావుని నిశితంగా పరిశీలిస్తూ, "అందర్నీ తంతూనే

ఉంది బాబూ. కాని, ఎంత తిన్నినా కొంతమందికి బుద్ధి రాదు!" అన్నాడు.

అతనికి ఆకస్మాత్తుగా తను భార్యని కొట్టినందుకు ఎత్తిపొడుస్తున్నాడనిపించింది. ఇతనికి అప్పుడే ఎట్లా తెలిసిందీ? తెలిస్తేమాత్రం ఇత నెవ్వరు తన్ను ఎత్తిపొడవటానికి! అతన్ని ఏదోవొకవిధంగా అవమాన పరచాలని బుద్ధి కలిగింది, "రామయ్యతాతా_వీడు సీ కూతురుబిడ్డేగా!" అని అడిగాడు.

"అవును బాబూ!" అన్నాడు.

"ఒక్కసారి నీ కూతురుబిడ్డ ముక్కు తుడుపుతాతా! చూడాలని ఉంది. నువ్వు ఆపనిచేస్తే చూచి చచ్చిపోవాలని ఉంది" అన్నాడు సీతారామారావు.

రామయ్యతాత అతన్ని పరీక్షగా చూశాడు. ఇట్లా అన్నాడు: "చావదలచినవాళ్ళకి కోరిక్కలు ఉంటం మంచిది కాదు బాబూ! కోరిక్కలు ఉన్నవాడు చావటానికి అర్హుడు కాడు. చాపు బ్రతుకులు రెండూ సమాన దృష్టితో చూడగలిగినవాడే ఏపనైనాచెయ్యగలుగుతాడు. చస్తాను చస్తాను అని బెదిరించి, భయపెట్టి, సంఘ దృష్టినీ సానుభూతినీ సంపాదించ దలచినవాడు చావలేడు బాబూ" అన్నాడు.

"మరి నువ్వెందుకు బతుకుతున్నట్టు తాతా! నీకేమీ కోరిక్కల్లేవుగా, మనమడి ముక్కు తుడవటానికా?" అనిఅడిగాడు. అతనికి ఎందుకనో రామయ్యతాతను చూస్తున్నకొద్దీ కోపం ఎక్కువ అవుతూంది. గిల్లి కజ్జా పెట్టుకుని కీండపడేసి

డొక్కలో తన్నాలనిపిస్తూవుంది...." అయితే తాతా! రాములవారు భగవంతుడే అయినప్పటికీ అనేక తప్పులు చెయ్యటానికి కారణం ఏమంటావు? మానవుడుగా వున్నంత కాలం మానవమాత్రులాగే ప్రవర్తించాలికాదూ నువ్వు చెప్పేది? ఎంత తెలివిగలవాడైనా పరిస్థితులకు మించిన తెలివి చూపించగూడదు. తన తెలివిని పరిస్థితులకు సమన్వయం చెయ్యగలగటమే గొప్పవాని లక్షణం....అంతే కాదూ-మొన్న నువ్వు నాకు చెప్పింది?" అని అడిగాడు.

అతను ఏదో ఒక విధంగా తగాదా పెట్టుకోటానికి ప్రయత్నిస్తున్నాడని తాత గ్రహించాడు. సంభాషణ పెంచగూడదనుకొని తలఫూపాడు.

"ఇక నా భార్యను కొట్టడంలో తప్పేముంది తాతా? నా భార్యని కొట్టడం తప్పని నాకు తెలుసు. ఆమెతప్పేమీ లేదనీ, నా మనోవికారమే కారణమనీ నాకు తెలుసు. తెలిసినప్పటికీ మానవులు చేసే పనే నేనూ చేశాను. నా ఆలోచనలు నీవు అన్నట్లు పరిస్థితులకు అతీతంగా వుండకుండా చూచుకున్నాను తాతా! తాతా, రాములవారు సీతాదేవిని చితి ఎక్కించటానికి, మహాకాళ్యాలపాలు చెయ్యటానికి కారణం ఇదేగా! తాతా, నేనుకూడా అవతారపురుషుణ్ణి కాదుకదా!" అని అడిగాడు.

రామయ్యతాత కొంతసేపు ఏమీ మాట్లాడలేదు. ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు కనపడ్డాడు. క్షణక్షణానికీ ముఖ కవళికలు మారుతున్నై. కళ్ళు ఎరుపెక్కినై; కను

బొమ్మలు ముడివడినై. కొంచెంసేపు అయింతర్వాత, సీతా రామారావుని గుచ్చిచూస్తూ-"నా మనుమరాలిని కొట్టావా బాబూ?" అని అడిగాడు. అతని గొంతులో సహజంగా వుండే మార్దవం, చూపులలో సహజంగావుండే సానుభూతీ ఇప్పుడు లేవు.

"అవును తాతా!" అన్నాడు సీతారామారావు. "పెద్దలుసడిచిన దారినేనడిచాను. ఆ శ్రీరామచంద్రమూర్తే నా కాదర్శం..." అన్నాడు చిరునవ్వు నవ్వుతూ. తాత ఉడుకుతున్నాడని, ఇంకా ఉడికించాలని అభిలాష కలిగింది. దేనికే తొణకని తాతని, చలించని తాతని,కదిలించి, కోపం తెప్పించి, అతనిలోని సామాన్య మానవుని లక్షణాలను చూడటం అతనికి ఆక్షణం ఆనందాన్నిస్తూవుంది.

తాత కళ్ళు చింతనిప్పులైనై. "మూర్ఖుడా! శ్రీరామ చంద్రమూర్తితో పోల్చుకుంటున్నావా?" అన్నాడు.

సీతారామారావుకి తాత ఉగ్రనరసింహమూర్తిగా కనుపించాడు. ఇందాకటినుంచీ నిప్పుతో చెలగాటమాడు తున్నట్లు అప్పుడతనికి బోధపడింది. తాత తను అర్థంచేసు కున్న తాతకాదు. ఇన్నాళ్ళూ అయనతో కలసి మెలసి వుంటున్నా, అనేక విషయాలు మాట్లాడుతున్నా, తాతని అర్థం చేసుకోలేదు. తాతలో తాను ఎన్నడూ ఊహించి ఎరగని కొత్తమనిషి కనపడేప్పటికి అతనికి భయం వేసింది.

"గొప్పవాళ్ళని ఆదర్శంగా పెట్టుకొని, వాళ్ళకిమల్లే ప్రవర్తించటానికి నువ్వు ఎన్నడూ ప్రయత్నించలేదు.పైగా నీ దుర్నిర్ణాలను, అవినీతి ప్రవర్తనను, నీ నీచస్వభావాన్ని

సమర్థించుకోడానికి వాళ్ళల్లో నీరూపాన్నే చూస్తున్నావు. మహానీయుల్ని నీస్థితికిగుంజితృప్తిపడుతున్నావు. రామచంద్ర మూర్తి భార్యను కష్టపెట్టిందీ,నీవు నీభార్యను హింసించిందీ ఒక్కటేనా నీచుడా? రామచంద్రమూర్తి సీతమ్మ తల్లిని ఎందుకు చితి ఎక్కించాడు? యెందుకు మహారణ్యాలకు పంపాడు? ఒక ఆదర్శంకోసం. తన ఆదర్శాన్ని త్యజించటమా, భార్యని త్యజించటమా అనే విషమసమస్య వొచ్చినప్పుడు శ్రీరామచంద్రమూర్తి భార్యను త్యజించి ఆదర్శ ప్రాయుడైనాడు. మరి నీవో! ఏ ఆదర్శంతో నీ భార్యను హింసిస్తున్నావు? లోకకళ్యాణం కోసమా? శారీరక తృప్తి కోసం, పశువాంఛలను తీర్చుకోటానికీ, నీ అసమర్థతను కప్పిపుచ్చుకోటానికీ చేస్తున్నావు?

ఇంకా సిగ్గులేక నీదుర్మార్గాన్ని కప్పిపుచ్చుకోటానికి కారణాలు వెతుక్కుతున్నావా,మూర్ఖుడా? తను చేసినతప్పుకి పశ్చాత్తాపపడే వాళ్ళకి ముక్తివుందిగాని, దాన్ని సమర్థించుకోటానికి కారణాలు వెతికే నీచులకు ముక్తిలేదు. చివరికి నీ చదువు, నీ తెలివీ, ఇందుకు, దుర్మార్గానికి రంగు పూసి లోకాన్ని మోసంచేసి బ్రతికేందుకు, ఉపయోగ పడుతూ ఉన్నయ్యా? అంతం దగ్గరకు వొచ్చింది.

నీ ముత్తాత తాతతో ప్రారంభంఅయిన ఈనాటకం ఆఖరి అంకం నీతో ప్రారంభం అయింది. ప్రస్తుతం ఆఖరి ఘట్టం జరుగుతూవుంది. తెర ఏక్షణంపడినా పడొచ్చు.

నీ వంశం ఇట్లా అంత మొందుతుందనీ, ఇంత నీచ స్థితికి వొస్తుందనీ నేను ఎప్పుడూ అనుకోలేదు.నీవంశచరిత్ర

అంతా నేను యెరుగుదును. నీతాత, నీతండ్రి అందర్నీ నేను యెరుగుదును. అంతా ఒక్కటే రకం. ఒక్కడైనా బుద్ధిగల వాడు పుట్టకపోతాడా అని ఆశ పుడుతూవుండేది. నేటితో ఆ ఆశ తీరిపోయింది..." అన్నాడు.

"అయితే మేము అంతా తెలివి తక్కువ వాళ్ళం అంటావా తాతా?" అని అడిగాడు సీతారామారావు.

"ఇప్పుడు ఆ విషయం అప్రస్తుతం" అన్నాడు రామయ్యతాత.

"సరే నువ్వు తెలివిగలవాడవై ఉద్ధరించిన ఉద్ధరింపు ఏమిటో కొంచెం చెపుతావా? నీతండ్రి ఇచ్చిన ఆస్తిఆస్తి గానే ఉంచి అయివేజుమీద బతుకుతున్నానంటావు. అదేనా? మనమడికి గుర్రానివై కళ్ళెం కావాలని కోరుకోవటమేనా నీ గొప్పతనం? రామయ్య తాతా నువ్వు అంటే ఏమిటో అనుకున్నాగాని నువ్వూమాలాంటివాడివే!"

"నోరుముయ్!"

"నేనే లోకాన్ని తాతా. నానోరు మూతపడదు!" ఆచంద్రతారార్కం గణగణ మోగుతూనే వుంటుంది."

"ఇక్కడనుంచి బయటకు వెళ్తావా గెంటించమంటావా?"

"అనుకుంటాంగాని గెంటేవాడొకడూ, గెంటించుకునేవాడు ఎవకడూ వున్నామా తాతా? గెంటించేవాడే గెంటించుకుంటున్నాడు. గెంటించుకునేవాడే గెంటుతున్నాడు? ఈ వేదాంతం ఎట్లావుంది తాతా? చమ్మగా వుందా?"

"నీకేమన్నా పిచ్చెక్కిందా?"

"ఏమిటి తాతా?"

"నీకు పిచ్చా?"

"ఆఁ?-ఏమిటీ?"

"నువ్వు పిచ్చివాడివి!"

"నేను పిచ్చివాణ్ణా ?"

"ఆఁ అవును, మున్నాటికీ!"

"పిచ్చివా డెవ్వడు?"

"నువ్వే"

"పిచ్చి అంటే ఏమిటి ?"

"ఇదే!"

"నేను...పిచ్చివాణ్ణా తాతా?"

"అవును. ఇవ్వాళే పిచ్చివాడవని నీభార్యతో పిటీషన్ పెట్టిస్తాను. నీ భార్యా పిల్లల్ని నీనుంచి రక్షించటం కంటే ఇక చేసేది ఏమీలేదు" అన్నాడు రామయ్యతాత.

తాను పిచ్చివాడా? అనేక విషయాలు ఆలోచించాడుగాని, ఈ విషయం ఎప్పుడూ ఆలోచించలేదు. పిచ్చివాళ్ళు ఏంచేస్తారు? ఇలాగే ఆలోచిస్తారా? పిచ్చివాళ్ళు తాము పిచ్చివాళ్ళో కాదో చర్చించుకుంటారా? అసలు పిచ్చి అంటే ఏమిటి? మేం పిచ్చివాళ్ళం కాదు అనికూడా చెప్పబుద్ధి అవుతుంది కామాలు పిచ్చివాళ్ళకి.

"పిచ్చిమాటలు మాట్లాడతావే తాతా?"

"వెళ్లు...బయటకువెళ్ళు...పద..." అంటున్నాడు తాత.

"నాకేం పిచ్చి తాతా, పిచ్చివాళ్ళకి పిచ్చిగాని?"

రామయ్య తాతని కోపంగా చూట్టానికి ప్రయత్నించాడు. కాని అతని చూపులు నిలవటంలేదు. రామయ్య తాత ఉండ్రాళ్ళతిని పొట్టసవరించుకుంటున్న వినాయకుడికి మళ్లే కనిపించాడు.

"ఎలిక ఏది తాతా?" అని అడిగాడు. వినాయకుడి పొట్టలో పొడిస్తే ఎన్ని వుండ్రాళ్ళు వుంటయ్యో! తాను చిన్నప్పుడు ఒకసారి క్వారీతిరునాళ్ళకు వెళ్లాడు. తిరుమాలిగ అంటేఏమిటి? కత్తితో రామయ్యతాతపొట్ట రెండుగాకోస్తే?

రామయ్యతాత బయటకు నెడుతున్నాడు.

"ఉండుతాతా..."

రామయ్యతాత మనమడి చేతిలో కత్తివుంది. కత్తి పీటతో దోసకాయలూ కత్తితో పొట్లలూ కోస్తారు. ఆ కత్తి తనకు కావాలి. చెయ్యిజాపాడు. ఎంతజాపినా అందటంలేదు.

"తాతో! రామయ్య తాతో!"

ఏమిటి రామయ్య తాత అంటున్నాడు. అదేమిటి? మనమడి చేతిలో కత్తి అతని చేతిలోకి ఎట్లా వొచ్చింది. పొడుస్తాడా ఏమిటి?

"ఓరి పిచ్చి వెధవా!" అన్నాడు. గిరుక్కున తిరిగి బయటకు పరుగెత్తాడు సీతారామారావు.

రామయ్యతాత ఒక్క నిట్టూర్పు విడిచి దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు. మనుమడు 'కల్లెంలేని గుల్లం' అన్నాడు.

సీతారామారావు బజార్నపడ్డాడు. అతనికి బజార్న పడ్డట్లు తెలుసు. తనకు గమ్యస్థానం లేనట్లు తెలుసు. బజారు వెళ్ళటం అవసరమని తెలుసు. కాని తన ప్రమేయం లేనట్లుగా కాళ్ళు మోసుకుపోతున్నయి. "ఆలోచిస్తున్నది తలలోవున్న మెదడు, నడుస్తున్నవి కాళ్ళు. మెదడు చెప్పినట్లు కాళ్లు చెయ్యాలనిఎక్కడుంది?" అనిఅనుకున్నాడు. అతని అవయవాలకు సంపూర్ణ స్వాతంత్ర్యం వొచ్చింది. దేని ఇష్టం దానిదే. ఒక దానిమీద ఒకదానికి పెత్తనంలేదు. మెదడు దారిన మెదడు ఆలోచిస్తూవుంది; చేతులు దారిన చేతులు వూగుతున్నాయి. కళ్ళదారిన కళ్ళు చూస్తున్నయ్. తన ప్రమేయం లేకుండా, అజ్ఞలకోసం తన్ను బాధపెట్టకుండా, ప్రతి చిన్న విషయానికీ తన్ను ఆలోచించేటట్లు చెయ్యకుండా వేటిపని అవి చేసుకుపోతుంటే అతనికి హాయిగా ఉంది. పైకిమాత్రం ఇదివరకంటే — గబగబా నడవటంకంటే ఎక్కువ మార్పేమీ కనబట్టంలేదు.

"ఎక్కడికి?" అని అడిగాడొక పరిచయస్తుడు.

"కాళ్ళనడుగు, నాకు తెలుసా ఏమిటి చెప్పటానికి?" అన్నాడు ఆగకుండా నడుస్తూనే. అతను ఆగుదామని ప్రయత్నించేడు. కాని కాళ్ళు అతనిమాటవినలేదు. ఒడ్డుకు చేరాలని ప్రయత్నిస్తూనే ప్రవాహ వేగంలో కొట్టుకు పోతున్న వాడికిమల్లే కనిపిస్తున్నాడు.

"ఎక్కడా కనపట్టంలేదే!" అని అడిగారు ఒకరు.

"బేకుల్లేవు, నన్నేం చెయ్యమంటావు?" అని ఎదురు అడిగాడు. ఎత్తుమీదనుంచి పల్లానికి దిగే సైకిలుకి మళ్లే వెళ్తున్నాడు. ఎదురుగా వొస్తున్న మనిషితో 'పోతున్నాను' అని చెప్పాడు ఆగకుండానే.

గోడ్డు ప్రక్కన పిల్లలు బిళ్ళంగోడు ఆడుకుంటున్నారు. ఒక కుర్రవాడు "మున్నాంచి" అని కేక వేశాడు.

అతడు నడుస్తూనే "ఎన్నాంచి?" అని రోడ్డుమీద నుంచి బిగ్గరగా కేక వేశాడు.


అతని కాలికి ఏదో తగిలింది. ఠక్కున ఆగిపోయాడు. చూశాడు. మసిబొగ్గు! ఒంటరిగా దిక్కూదివాణం లేకుండా పడివున్న ఆ మసిబొగ్గునుచూస్తే అతనికే అలుసయింది. అటూఇటూ తన్నాడు. అది తను ఎటుతంతే అటువెళ్ళింది. దాని అమాయకత్వానికి అతనికి నవ్వొచ్చింది. చేత్తో తీసుకుని ఎగరవేసి పట్టుకుంటూ నడుస్తున్నాడు. ఎంత ఎత్తుగా గిరాటువేసినా అది మళ్ళీ తన దగ్గరకేవచ్చి పడుతూవుంది.

——

"సిగ్గులేదు. దీనికంటే భార్యేనయం!" అనుకున్నాడు.

కాని వెంటనే జాలివేసింది. 'దెబ్బ తగిలిందా?' అని సిమిరి 'మా బుచ్చే' అని లాలించి ముద్దుపెట్టుకున్నాడు. పెదిమలతో ముద్దుపెట్టుకుంటే చేతులకు మసి అయింది. వెంటనే వూళ్ళోవున్న గోడలన్నీ తెల్లగా కనిపించినై. గోడలనిండా మసిబొగ్గుతో బొమ్మలు గియ్యటం మొదలు పెట్టాడు. ఎక్కడగీసినా కొద్ది మార్పులతో ప్రక్కపుటల్లో

బొమ్మ. అతనిచుట్టూ పిల్లలగుంపు పోగయింది. నాబొమ్మ రాయమంటే నా బొమ్మ రాయమని వెంటపడారు.



"నేను రాయను"

"ఎందుకనోయ్?"

"పిల్లల బొమ్మలు నే రాయకేం? ఎవరి ముక్కుకీ సూటిగా వాళ్ళు పొండి. అక్కడే రామయ్య తాతవుంటాడు. వాడికి కుంచెలాంటి తోకవుంటుంది. ఆ తోకనడగండి... కుంచె రాస్తుంది .... పొండి ... ఊ ...." అని పిల్లల్ని తరిమాడు.

నల్లకోటు వేసుకొని, జరీ తలపాగా ఒకటి చుట్టు

కొని, చేతికర్రపట్టుకొని ఒక పెద్దమనిషి తీవిగా తనముందు నడిచి వెళ్ళటం చూశాడు.

"ఏయ్ ఆగు" అన్నాడు.

ఆ పెద్దమనిషి కంగారుపడుతూ ఆగాడు. సీతారామారావు అతని దగ్గరకు వెళ్ళి భుజంమీద చెయ్యేసి "అది సరేగాని నువ్వు ఎందుకు పుట్టావో నీకు తెలుసా, అని అడిగాడు.

ఆ పెద్దమనిషి అయోమయంగా చూస్తూ నుంచున్నాడు.

"పోనీ, ఆ సంగతి తెలియకపోతే పోయింది. ఎట్లా పుట్టావో ఆ సంగతి అయినా తెలుసా?" అని అడిగాడు.

పెద్దమనిషి కంగారు పడ్డాడు.

"మరి, ఏం చూసుకొని ఈ డాబుసరి?..."అని బిగ్గరగా సవ్వాటం మొదలుపెట్టాడు సీతారామారావు.

ఆ పెద్దమనిషి తప్పించుకు వెళ్ళటానికి ప్రయత్నించాడు.

"నువ్వు గంగిరెద్దుకుమల్లే, చాకలివాని గాడిదకుమల్లే ఇన్ని గుడ్డలు కప్పుకున్నావే! మొన్న ఒక చీర అడిగిందని ఎందుకురా నీ భార్యని కొట్టింది? నీ భార్య నాకు చెల్లెలి వంటిది. గనక అడుగుతున్నాను. ఆడదాన్ని కొట్టటానికి నీకు చేతులెట్టా వొచ్చినయిరా?" అని అడిగాడు.

ఆ పెద్దమనిషి విదిలించుకొని వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూ వెళ్ళిపోయాడు.

అతడు పక్కనున్న కాఫీహోటల్లోకి వెళ్ళాడు. ఫలహారంచేసి, బల్లమీదు కూర్చున్న ప్రొప్రయిటరు దగ్గరకు పచ్చి "ఎంత?" అని అడిగాడు.

"అయిదణాలు"

"పావలా ఇస్తే ఏమవుతుంది?"

అంతలావు ప్రొప్రయిటరూ బెదిరిపోయి చూస్తూ కూర్చున్నాడు.

"అటు సూర్యుడు ఇటు పొడుస్తాడా? మనదేశ ఆర్థిక విధానం తారుమారు అవుతుందా? ఆడవాళ్ళకు సమానహక్కులు వొస్తయ్యా? స్వరాజ్యం రాకుండా ఆగిపోతుందా? ఏమవుతుంది అంటావు?" అని అడిగాడు.

ప్రొప్రయిటరు భయపడుతూ కూర్చున్నాడు. ఆ హోట్లో కాఫీతాగున్న న్యాయవాది ప్రొప్రయిటరుకి జరుగుతున్న అన్యాయం సహించలేక తాగుతూ తాగుతూ ఉన్న కాఫీ ఆపి, "ఇవ్వాళ్టికి మాట్లాడకు" అన్నాడు.

సీతారామారావు ఆ న్యాయవాదిని జాలిగాచూచి, "వాట్ ఏ షేమ్—నువు న్యాయం చెప్పొచ్చావుగాని, నువ్వు చేసేది అంతా న్యాయమేనటరా! నువ్వు ఇన్నిసార్లు కాఫీ తాగుతున్నావే, నీ భార్యకు ఒకసారన్నా జోడు ఇడ్లీ తీసుకువెళ్ళావూ? పాపం వాళ్ళుమాత్రం మనుష్యులు కాదట్రా, వాళ్ళని మనతో సమానంగా చూచుకోకపోతే ఎట్లాగురా, చెప్పు... చెప్పరా నా తండ్రీ" అని బతిమాలుతూ కన్నీరుపెట్టుకొని "పాపం ఆమె కన్నవారి నందర్నీ వొదులుకొని నువ్వే దేవుడవు అనుకొని, పరపురుషుణ్ణి

దగ్గరకు జేరనివ్వకుండా బిగబట్టుకొని నీతో కాపరం చేస్తూ వుండే, అమెను నువ్వట్లా కష్టపెడితే ఎట్లాగురా! చెప్పరా నాతండ్రీ!" అని గడ్డం పట్టుకొని బతిమాలాడు. చుట్టూ పోగైనవాళ్ళు తేరుకోక ముందే బయటకువొచ్చి పోలీసు నుంచునే దిమ్మ్మిమీద నుంచున్నాడు. అక్కడ నుంచునే టప్పటికి అతనికి ఇంగ్లీషులో ఉపన్యాసం ఇవ్వ బుద్ధి అయింది. కాని తెలుగులో పాడాడు.

హరి హరీ ఈ ధరను గుణవతీ
ఆడ దెవరో జూడవ ?
తెరువు: జూపే గురుని జేరి
పదము నొందిన దాడది
ఆత్మమాకు పూజచేసి
ప్రస్తుతించిన దాడది
ముత్తరాలయి ఆత్మమ
మాట వినినిది గాడిది
కుదురుగా భర్తమాటకు
ఎదురుచెప్పని దాడది
బెదురు ఎంతయు లేక పురుషుని
గిదుముచున్నది గాడిది
నిరతమును సద్దోష్టికొరకై
వెతుకుచుండెడి దాడది
భర్తగృహమున లేనియెడల
పరుగు లిడునది గాడిది
కామక్రోధలోభమోహము
కట్టివేసిన దాడది
ప్రేమతో విటకాండ్రగూడను
తామసించును గాడిది

జన్మపావన చేసికొనుటకు
ధ్యానముంచిన దాడది
తన్మయంబును బొందనేరక
తనువు మరవదుగాడిది
ఇంతసద్గుణ మభ్యసించిన
కాంతయే భువి నాడది
సంతసంబున యడ్డ రాదు
దాసుడిది యోచించెర గాడిదీ!

పాట పూర్తయ్యేటప్పటికి జనం పోగయ్యారు. వాళ్ళనుచూస్తే, తను ఉపన్యాసం చెపితే వాళ్ళకు వినాలని వ్రుందని అతనికి అనిపించింది. హరికథ చెపుదామా, బుర్రకథ చెపుదామా అని ఆలోచించి ఉపన్యాసం మొదలుపెట్టాడు—

"ఒరేయ్, నామాట వినండ్రా, నాకు పిచ్చెత్తిందని కొంతమంది చెపుతారు. ఆ మాట నమ్మకండి. మనకు అర్థంకాని వాళ్ళందరికీ పిచ్చెత్తిం దనుకుంటే ఎట్లాగురా!

ఒరేయ్, ఈ ప్రపంచంలోమీరేదో చేద్దామనీ, చేస్తున్నామనీ అనుకుంటార్రా! ఏముందిరా ఈ ప్రపంచంలో చెయ్యడానికీ? ఏమీలేదురా, నామాటనమ్మండ్రా, తండ్రులారా!

మనకు ఏం చెబితే నచ్చుతుందో తెలుసుకొని, అది చెప్పి, దానికోసం పనిచెయ్యమని మనల్ని రేపి, పని చేయించు కుంటున్నార్రా. అంతేరా. అంతకంటే ఏమీలేదురా. అంతా వొట్టి బూటకంరా నా తండ్రుల్లారా!

చూడండ్రా, మొదట్లో దేవుడు మనల్ని పుట్టించాడనీ, కాబట్టి వాళ్ళో ఐక్యం అవటానికి మనం ప్రయత్నించాలనీ చెప్పార్రా, మనం నమ్మ్నాంరా. నమ్మి, అందుకు ప్రయత్నించాం. అప్పుడు వాళ్ళేంచేశాకో విన్నారటరా, 'దేవుడనేవాడు బయటలేడు, మనుష్యుల్లోనే వున్నాడు, కాబట్టి మానవసేవే మాధవసేవ, మీరంతా మానవసేవ చెయ్యండి' అని చెప్పార్రా. మనం ఈ మాట కూడా నమ్మ్నాంరా. నమ్మి మానవసేవ మొదలుపెట్టాంరా. దేవుణ్ణి నమ్మినవాళ్ళందర్నీ తిట్టాం. పాపం—నోటికి వచ్చిన తిట్లన్నీ తిట్టాం. మనం సత్యం తెలుసుకున్నామనీ, వాళ్ళు తెలుసుకోలేదనీ అనుకున్నాంరా. కాని ఇట్లా చూసేటప్పటికి ఏమయిందో చూశారర్రా! 'మానవులంతా ఒకటనుకునేరూ, సంఘంలో అనేకవర్గాలున్నాయి, ఈ వర్గాల కలహంవల్లే సంఘం అభివృద్ధి చెందుతూవుంది, కాబట్టి ఆఖరివర్గాన్ని వెనకవేసుకొని మిగిలిన వర్గాలతో వర్గ పోరాటం సాగించండి' అన్నార్రా, మనం ఇది నమ్మ్నాం. నమ్మి వర్గపోరాటం సాగించాం. మనుష్యుల్లోఉన్న దేవుడు ఈ దెబ్బతో కనపడకుండా మాయం అయ్యాడురా. పోరాటం-పోరాటం-పోరాటం - మనలో మనకే పోరాటం. మనలో మనకే కొట్లాటలు. ఒకరంటే ఒకరికి అనుమానం. ఒకరంటే ఒకరికి ద్వేషం-విరోధం. అరెరే, ఎంతఘోరం అయిపోయిందర్రా నా తండ్రుల్లారా! ఇది ప్రపంచంగా లేదురా, కసాయి కొట్టుగా ఉందిరా.

ఈ దెబ్బతో సంఘసేవ కూడా ఎగిరిపోయిందిరా. సంఘం ఒకరకంగా పరిణామం చెందుతూవుందట? దానికి మనం దోహదం ఇవ్వాలట! ఇంకేముందిరా నా తండ్రుల్లారా, కాలప్రవాహానికి రాళ్ళూ రప్పలూ అడ్డం లేకుండా బాగుచేయ్యటమే నటరా మన పని!

ఈ సంగతి కొంతమంది కనిపెట్టారా. కనిపెట్టి మానవుడికి జ్ఞానం సంపాదించటం ఆదర్శం అని చెపుతున్నారా. వీళ్ళు హేతువాదంమీద, ఆధారపడమంటారా. 'ఎందుకు?' 'ఎందుకు?' 'ఎందుకు?' అని ప్రశ్నించుకోమని చెపుతారా. అన్ని ఎందుకులకీ వాళ్ళు జ్ఞానాన్నిబట్టి జవాబులు చెపుతారు. మనకున్న జ్ఞానాన్నిబట్టి మనము నమ్ముతాం.

కాని ఆఖరికి 'ఎందుకు'కు జవాబు లేదురా నా తండ్రీ.

"జ్ఞానం ఎందుకు?"

జవాబులేదు. లేకపోతే 'ఆనందానికి' అంటారా.

"ఆనందం ఎందుకు?"

జవాబులేదురా నా తండ్రీ! ఎక్కడో ఒకచోట ఈ 'ఎందుకు' ఆగవలసిందేరా తండ్రుల్లారా!!

ఒరేయ్—లేని ఈ 'ఎందుకు' ఎందుకు సృష్టించారో మీకు తెలుసట్రా? ఎందుకో ఒకందుకని చెప్పకపోతే మనం పని చెయ్యమని వాళ్ళ ఉద్దేశంరా. అంతేరా. అంతకంటే ఏమీలేదురా నా తండ్రీ!

తండ్రుల్లారా, ఇవన్నీ అబద్ధాలేరా. అబద్ధాలు చెప్పి మనల్ని మోసంచేసి పనులు చేయించుకుంటారంట్రా వీళ్ళు. ఏమీ లేకపోతే మట్టుకు ఎందుకు పని చెయ్యాంరా ? ఏమీ లేనప్పుడు పని చెయ్యకపోతే మాత్రం ఏంరా? నిజంగా ఏదన్నా ఉంటే క్షణంక్షణం ఇట్లా అదర్శం మారటానికి వీలుంటుందటరా. పైగా ఆదర్శం ఎప్పుడూ మారుతునే వుంటుందట! చూడండ్రా వాళ్ళ ధైర్యం-ఆదర్శంలేదని ఎంత చమత్కారంగా చెపుతున్నాగో !

ఒరేయ్ మనం పుట్టటం నిజం. చావటం నిజం. మధ్యన బతకటం నిజం. పుట్టటం చావటం మనచేతుల్లో లేదురా. ఇక బతకటం ఒక్కటేరా మిగిలింది. బతకటానికి మనకు కావలసింది అన్నమేగదరాం దీనికింత గొడవెందుకురా? మనం నలుగురం కూడాబలుక్కొని బతకలేమటరా? ఈ ప్రపంచంలో ఏమో ఉందని మభ్యపెట్టి దానికోసం పోట్లాడుకు చచ్చేటట్టు చేస్తున్నార్రా. అంతకంటే ఏమీ లేదురా తండ్రుల్లారా. మనం కొన్నాళ్ళు ఇక్కడ బతకాలి. ఎవరైనా అంతే. దీనికి కలహాలూ, రక్తపాతాలూ ఎందుకురా. ఎవరు కట్టుకుపోయేది ఏముందిరా. బతకండ్రా తండ్రుల్లారా, చచ్చేదాకా బతకండి."

అతడు ఉపన్యాసం ముగించాడు ....

"వెళ్ళిపో" అన్నాడు పోలీసు.

"ఎక్కడికి!" అడిగాడు సీతారామారావు.

"వెళ్ళు"

"వెళ్తా. మళ్ళీ వొస్తా"

అతడు గబగబా దిమ్మె దిగి మళ్ళీతిరగటం మొదలు పెట్టాడు. తిరిగి తిరిగి బోగంవాళ్ళ పేటకు వెళ్ళాడు.

4

బోగంవాళ్ళు ప్రత్యేకం ఒక పేట కట్టుకోవటం అతనికి విచిత్రంగా కనుపించింది. ఒకేవృత్తిలోవున్న వాళ్ళకి అంతా ఒక చోట వుండాలనిపిస్తుంది గామాలు - ఏవృత్తిలోను లేని తనకుమల్లే, తన స్నేహితులకు మల్లే ఎందుకనో గాని బోగంవాళ్ళకి, తనకు కొంత పోలిక ఉన్నట్లు కనుపించింది. ఇద్దరూ సంఘానికి పనికిరాకుండా పోయినవాళ్ళే. సంఘంలో ఉన్న కుళ్ళుతో భవంతులు కట్టించుకొని వాట్లల్లో నివసిస్తున్నవాళ్ళే. కాని తమనుచూస్తే ఎవరికీ జాలికలుగదు, ఎగతాళిగాకూడా ఉంటుంది.

ఒక బోగంది గుమ్మంలో నిలబడి విటునితో మాట్లాడుతున్నది.

సీతారామారావుకి వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో తెలుసుకోవాలనిపించింది. గబగబా వాళ్ళ దగ్గరకువెళ్ళి "ఏమిటే వాడితో నీవు మాట్లాడేదీ!" అని అడిగాడు.

వాళ్ళిద్దరూ ఒకళ్ళ మొగం ఒకళ్ళుచూచుకుంటూ నిలబడ్డారు.

"చెప్పవే నాకూ వినాలని వుంది!" అన్నాడు.

"నీ కనవసరం" అంది ఆ పిల్ల.

"అనవసరమా? సంఘంలో ఇద్దరు మాట్లాడుకునే మాటలు, యిద్దరు ప్రవర్తించే ప్రవర్తన, అందరికీ అవసరమే. తెలుసుకోవలసిన బాధ్యత, తెలియచేయవలసిన బాధ్యత అందరిమీదా ఉంది. సంఘం అంటే ఏమనుకున్నావు? అది చేనుకి కంచె. చేలో మంచె. అది ఒక పత్తేదారు. తనలోవుండే ప్రతివ్యక్తి సంగతీ కనిపెడుతూ ఉంటుంది. తన మాట ప్రకారం ప్రవర్తించిన వాళ్ళను సుఖపెడుతుంది: తనమాట విననివాళ్ళని హింసిస్తుంది— తెలుసా?" అన్నాడు.

ఆ కుర్రవాడు యీ మాటలు విని భయపడి మెదలకుండా వెళ్ళిపోయ్యాడు.

అతనికి కష్టంవేసింది. "ఎవరయినా యింతే. ఆపత్కాలంలో అయిపుండరు. డబ్బు తీసుకోవటంవల్ల మీరింత తేలికయ్యారు" అన్నాడు.

"మరి తిండి గడిచేదెట్లా?" అని అడిగిందాపిల్ల.

అతనికి ఆమెను చూస్తుంటే హృదయం జాలితో, ప్రేమతో నిండిపోయింది. తన యింటిముందునుంచి ఊళ్ళో మురికినంతా పోగుచేసుకొని నెమ్మదిగా, నిశ్శబ్దంగా, గర్భిణీ స్త్రీకిమల్లే పారేకాలువ జ్ఞాపకమొచ్చింది. ఆమెకు మనస్సులో నమస్కరించుకున్నాడు

ఆమె ఇంట్లోకెరమ్మని పిలిచింది.

అతన్ని కూర్చోపెట్టి, తమలపాకులు తెచ్చి ముందు పెట్టి తను పక్కనేకూర్చుని చిలకలు చుట్టిస్తూవుంది. అతను తీసుకోబోతే "నేను తినిపిస్తా" అని వొక్కొక్కటీ నోటి కందించటం మొదలుపెట్టింది.

"నాకు డబ్బంటే వ్యామోహం లేదండీ" అంది.

"త్చ్ త్చ్ పాపం!" అన్నాడు.

"నేనసలు బోగందాన్ని కానండీ."

"మహాపతివ్రతవా ఏమిటి? కొంపతీసి" అని లేవ బోయ్యాడు. తమ్మ పుమ్మ వెయ్యబోయ్యాడు.

"నేనుచెబితే మీకు నవ్వులాటగావుంటుందిగానండీ, నేనసలు బోగందాన్ని కాను. నేను చెబితే గొప్పకు చెబు తున్నానని అనుకుంటారుగాని, నేనసలు బాపనపిల్లని"అంది.

అతను నోరు తెరుచుకొని వింటున్నాడు. తమలపాకు లతో ఎర్రబారిన అతనినోరు కాకిపిల్ల నోరుకుమల్లే లక్క చిట్టికిమల్లే వుంది.

"నా తల్లిని ఒక బాపనకుర్రవాడు మోసంచేశాడు. పెళ్ళికాకముందే నేను పుట్టాను. నన్ను నాతల్లి బోగం వాళ్ళకు అమ్మేసింది. నేనీ వృత్తిలోప్రవేశించనని ఎంత పోట్లాడా ననుకున్నారు?" అని కన్నీరు పెట్టుకునేందుకు ప్రయత్నిస్తూవుంది.

"ఎందుకని? ఈవృత్తిలో కష్టం ఏముంది?"

"అదేమిటండీ? మీరుకూడా అట్లా అంటారు? ఇంతకీ మేమంటే అందరికీ అంత చులకన" అని విచారంగా అన్నది.

"నీకు భార్యగా మారాలనివుందా ఏమిటి?"

"ఎప్పుడూ అదేఅనుకుంటూ వుంటాను.ఎవరినయినా పెళ్ళిచేసుకొని హాయిగా కాలంగడపాలనివుంది. ఈవృత్తి చాలా నీచమయిందండీ, నా గుణానికి బొత్తిగా సరిపడదు" అంది.

"ఏం? నీగుణం మంచిదికాదా!"

"అదేమిటండీ?"

"అయితే, భార్యగావుండి నీకు పిల్లల్నికూడా కనాలని వుందా?"

ఆమె సిగ్గు అభినయిస్తూ, చీరె జరీఅంచు చేతివేళ్ళతో సర్దుకుంటూ "ఎంతచెడ్డా, మేం మాత్రం ఆడవాళ్ళం కాకుటండీ? ఏ ఆడదానికుండదండీ ఆ కోర్కె? మీకట్లా అంటారుగాని మేమూ అందరివంటివాళ్ళమే..."అంది.

ఈ మాటకు సీతారామారావు ఉలిక్కిపడ్డాడు.

'మేమూ అందరివంటివాళ్ళమే!' అనుకోవటంలో, పైపైమెరుగుల్లో తప్ప, ప్రపంచంలో అందరూ ఒకటేనా ఏమిటి? అందుకనే కాబోలు ఉద్రేకం వొచ్చినప్పుడు అందరూ ఒకేరకంగా ప్రవర్తిస్తారు. ఆకలి వేసినప్పుడు, కోపంవచ్చినప్పుడు, విచారం కలిగినప్పుడు, ప్రేమ సందర్భాల్లో అంతాఒకేవిధంగా ప్రవర్తిస్తారు. భేదాలు పైపూతలోనే! పూత కరిగిపోతే అంతా ఒకటే సరుకు!

మనస్సులో ఈ ఆలోచనలు చెలరేగుతున్నాయి, కళ్ళతో ఆమెను తీక్షణంగా చూశాడు. మనస్సులో ఆలోచనలు కట్టుబడినై. అతని కళ్ళకు ఆమె ఒకక్షణం

సూర్యారావుగా, ఒకక్షణం శాతవాహనుడుగా, ఒకక్షణం బాలకృష్ణుడుగా, ఒకక్షణం శివరావుగా, ఒకక్షణం తానుగా కనిపించింది.

ఆమె తలచుట్టూ తన స్నేహితుల తలలూ,తనతలా గిరున తిరుగుతున్నై: తమ తలలమధ్యవున్న ఆమెతల, ఒకొక్కప్పుడు పగలబడి నవ్వుతున్నది: ఒకొక్కప్పుడు విరగబడి ఏడుస్తున్నది. తన తలతో సూర్యారావుతల ఇట్లా అన్నది:

సూర్యారావుతల-"మనం ఆంధ్రులం. ఆంధ్రప్రజా నీకం. పంచశిఖరం మనం. ఆంధ్రుల నుడికారం,ఆంధ్రుల సంస్కారం, ఆంధ్రుల ప్రతాపం, ఆంధ్రుల విజ్ఞానం, ఆంధ్రుల భండారం మనలో మూర్తీభవించినై.

ఈమె ఆంధ్రమాత,సాక్షాత్తూఆంధ్రమాత. మనలో ఉన్న గుణాలన్నీ ఈమెలో కరుడుగట్టినై. ఆంధ్రమాతను పూజించాం రండి. పుష్పాలు తెండి, అంధ్రమాతా నీకు జోహారు."

శాతవాహనునితల—"మనం మురికికాలవలం, ఇది మహాసముద్రం. ఆంధ్రదేశంలోవున్న మురికికాలవలన్నీ ఎప్పుడో ఒకప్పుడు ఈ మహాసముద్రంలో కలవవలసిందే! అందువల్ల ఆంధ్రులందరికీ ఇది పుణ్యతీర్థం. ఈ మురికి మహా సముద్రంలో జలక్రీడలాడదాం రండి. ఆంధ్రమహాజను లారా, ఆంధ్ర నుడికార ప్రియులారా! రండి. తీర్థం పుచ్చుకుపొండి."

బాలకృష్ణుని తల - "ఓ మహాజనులారా... మా నాన్న వున్నాడు చూశారు, ఆయన చెప్పనే చెప్పాడు...."

మిగిలిన తలలు-"నోరుముయ్. ఈ పవిత్రస్థలములో మీ నాన్న పేరు ఉచ్చరించకు."

బాలకృష్ణునితల -"నామాట వినండి. లేకపోతే మీ స్నేహం వదులుకొంటూ నేనే ఆంధ్రమాతనై కూర్చుంటా!"

మిగిలిన తలలు బెదిరి వూరుకున్నయి.

బాలకృష్ణునితల-"మానాన్న వున్నాడుచూశారూ, ఆయన చెప్పనే చెప్పాడు-కలియుగంలో మురికి మహాసము ద్రమే ఆంధ్రమాత ఐ కూర్చుంటుందని. ఆయన చెప్పినట్లే జరిగింది. ఈమె ఆంధ్రమాత. ఈ మనమాత ఆంధ్ర దేశంలోవున్న మురికినంతా తన అంకంలోకి తీసుకొని, ఆంధ్రమాతగా ఉబ్బింది. మురికివల్ల మొత్తం సంఘం పాడుగాకుండా, దాని కో ప్రత్యేక స్థలాన్ని నిర్ణయించారు మన పూర్వులు. శివుడు విషాన్ని తన కంఠంలో ఉంచుకుని లోకాన్ని రక్షించినట్లు, ఈమె-ఈ మనమాత-మురికిని తన అంకంలో ఉంచుకొని ఆంధ్రదేశాన్ని రక్షిస్తూవుంది. ఈమెకు నా ధన్యవాదాలు."

శివరావు తల- "ఈమెను మాత అంటున్నామని మీరు శంకిస్తున్నారేమో? అట్లాంటి శంక మీరు పెట్టుకో వద్దు. తల్లయినా, తండ్రయినా, కూతురయినా, భార్య అయినా, సోదరిఅయినా, స్నేహితుడయినా - వీరందరినీ ప్రేమించడానికి కారణం సెక్స్! అసలు ఏవస్తువునైనా

ప్రేమించే శక్తి నిచ్చేది సెక్సే! మానవుల్ని ప్రేమించటానికి, సంఘాన్ని ప్రేమించటానికి, దేశాన్ని ప్రేమించటానికి అన్నిటికీకారణం సెక్సే. ఇటువంటి పవిత్రమైన వాంఛను మీరు దాచుకోగూడదు. తీర్చుకోడానికి వెనుకంజ వేయకూడదు."

ఈ మాటలు విని సీతారామారావు "ఓరి భగవంతుడా" అని ఒక్క అరుపు అరచి బయటకు పరుగెత్తాడు. ఎక్కడా ఆగకుండా రోడ్డు వెంటపడి ముక్కుకు సూటిగా వెళుతున్నాడు.

ఒక ఏనాదివాడు తాగి తూలుతూ ఎదురుగుండా వొస్తున్నాడు. రాగాలు తీస్తున్నాడు. వాడి భార్య రెక్క పట్టుకొని తీసుకువెళుతూ ఉంది. వాడు మధ్య మధ్య విదిలించుకొని "ఉండవే డోఖ్తే" అంటున్నాడు.

"తాగావట్రా?!" అని అడిగాడు సీతారామారావు.

"సెప్పవే ... దొరేందో అడుగుతున్నాడు ..." అన్నాడు పెళ్ళాన్ని.

"నీకేం అయ్యా, తాగితే?" అంది రెక్కపట్టుకొని తీసుకువెళ్తూనే.

సీతారామారావుకి సంఘాన్ని తన్ను బుద్ధి అయింది. కాని ఎట్లా? ఈ సంఘానికి తలెక్కడ? తోక ఎక్కడ? ఉదరం ఎక్కడ? ఎట్లా తన్నేటట్లు?

ఆ రోడ్డు చివరదాకా నడిచివెళ్ళి మలుపు తిరిగాడు. రోడ్డుపక్కనే దేవాలయంవుంది. దానిముందు పూటింగు

జరుగుతూవుంది. జనం తండోపతండాలుగా వున్నారు. వాళ్ళను చూసేటప్పటికి ఇన్నాళ్ళనుంచి తాను వెతుకు తున్న సంఘం, తన్ను హింసించిన సంఘం తనకు కనపడ కుండా తప్పించుకున్న సంఘం అదే అనిపించింది. గబగబా జనం మధ్యకు వెళ్లాడు.

వేదికమీద పరబ్రహ్మశాస్త్రి, నాగలింగం, రాంభొట్లు, విశ్వేశ్వరరావు, చైతన్యస్వామి కూర్చుని వున్నారు. వాళ్ళ మెడల్లో బంతిపూలమాలలున్నాయి. ప్రజలు వాళ్ళను దేవతా ప్రతిమలను చూసినట్టు తన్మయ త్వంతో రెప్పవెయ్యకుండా చూస్తున్నారు.

వాళ్ళు ఒక్కొక్కళ్ళు లేస్తున్నారు. ఉపన్యాలిస్తు న్నారు. ప్రజల్లోవున్న దారిద్ర్యం పోవాలంటున్నారు. అజ్ఞానం నశించాలి అంటున్నారు. ప్రజలు పడుతున్న కష్ట లకు కన్నీరు కారుస్తున్నారు.

వాళ్ళ ఉపన్యాసాలకు ప్రజలు పరవశత్వం పొంది, మాటిమాటికీ కరతాళ ధ్వనులు చేస్తున్నారు. 'జై'లుకొడు తున్నారు.

సీతారామారావుకి ఆశ్చర్యం వేసింది. వాళ్ళ మెడల్లోవున్న పూలమాలలూ, వాళ్ళు కుర్చీలోకూర్చున్న వైఖరీ, ప్రజల కరతాళధ్వనులూ, వాళ్ళ ఆనందం-ఇవన్నీ అతన్ని కలవరపరిచాయి. అతనికి కంపరం కలిగించాయి.

వీళ్ళా ప్రజలకు నీతులు చెప్పేది! వీళ్లు చేస్తున్న దురంతాలు, మోసాలు, అన్యాయాలు ప్రజలు అప్పుడే ఎట్లా మరచిపోయారు?

తప్ప ప్రవర్తనను మార్చుకోకుండా ప్రజలకు ధర్మోపన్యాసాలు చెప్పటానికి వీళ్ళకు ఎట్లా సిగ్గులేదు? అతను తుకతుక ఉడికిపోతున్నాడు. వేడి ఊర్పులు విడుస్తున్నాడు. హృదయంలో బైటికి రావటానికి ఏదో గిలగిల తన్నుకుంటూ వుంది.

నాగలింగం ఉపన్యాసం పూర్తిచేసి కూర్చున్నాడు. కరతాళ ధ్వనులూ, జయజయ ధ్వానాలూ మిన్నుముట్టినై. అధ్యక్షులు నెమ్మదిగా లేచి సవినయంగా "ఇంకెవరయినా మాట్లాడేవాళ్ళుంటే మాట్లాడవచ్చు" అన్నాడు.

"నేను మాట్లాడుతాను" అని జనంలోనుంచి కేక వేశాడు సీతారామారావు. ఆ ధ్వనికి ప్రజలంతా నిశ్శబ్ద పూరితులయ్యారు. ప్రజలదృష్టి అతని వైపుకు వొక్కసారి మరలింది.

అధ్యక్షులు "దయచెయ్యండి" అన్నారు.

సీతారామారావు ప్రజల్ని నెట్టుకుంటూ వెళ్ళి వేదిక ఎక్కాడు. వేదికమీద వున్నవాళ్ళు ఇతన్ని ఎరిగిన వాళ్ళే. సూర్యప్రకాశరావు తనకి దగ్గర బంధువు కూడాను.

అతని ఆకారం భయంకరంగా ఉంది. శరీరం తూలి పోతూ ఉంది. అతన్ని చూచి వేదికమీద వున్నవాళ్ళంతా గాభరాపడి, వాళ్ళలోవాళ్ళు గుసగుస లాడుకోవటం మొదలుపెట్టారు.

అతను జనాన్ని తీక్షణంగా చూస్తూ, "వీళ్ళా మీకు నీతులుపదేశించేవి? వీళ్ళమాటలు వింటానికా మీరింత

తహతహ లాడేది! వీళ్ళనా మీరు గౌరవించేది? వీళ్ళల్లో వొక్కడు ఋజుమార్గాన బ్రతుకుతున్న వాడున్నాడూ వీళ్ళంతా దుర్మార్గులు, ద్రోహులు, మోసగాళ్ళు, అవినీతి పరులు" అని బిగరగా కేకలు వేశాడు.

ప్రజలు నిశ్చేష్టితులై చూస్తూ కూర్చున్నారు. వేదిక మీద కూర్చున్న నాయకులు బిక్కమొఖాలు వేసుకుని వొకరి మొఖాలు ఒకరు చూచుకుంటున్నారు.

"ఇందులో మీకు నీతులు చెప్పదగ్గ వాడెవడు? ఈ పరబ్రహ్మశాస్త్రి? వీడు ఇందాక మీకు శీలాన్ని గురించి అద్భుతమయిన ఉపన్యాసాన్ని యిచ్చాడు. మీరంతా చప్పట్లు కొట్టారు. వీడు చేసే పనేమిటి? వీడి మరదలికి ఎందుకు పెళ్ళికాలేదో అడగండి! ఎప్పుడూ ఇతని ఇంట్లోనే ఎందుకు వుంటుందో అడగండి! ఈ నాగలింగాన్ని మీరు ఎరుగుదురుగా! ఎప్పుడూ తనకు సైపిస్టుగా మళయాళీ కుర్ర వాణ్ణే ఎందుకు పెట్టుకుంటాడో అడగండి. ఎర్రగా, సన్నగా మృదువుగావుండే కుర్రవాళ్ళుతప్ప మిగిలినవాళ్ళు సైపు చెయ్యటానికి పనికిరారా? ఎవరూ లేనప్పుడు తన సైపిస్టు తలనిమురుతూ కూర్చోవటం ఎందుకు? అడగండి. వీడిని చేసేత పరిశ్రమంటే ఎంతఇష్టమో? ఈ రాంభొట్లు వాళ్ళ మ్మాయ్మ గొంతుపిసికి అరవైవేలు కాజేశాడు. ఈ విశ్వేశ్వర్రావు ఇంత పెద్దవాడుగదా! వీడికేమయినా బుద్ధి వుందీ? మొన్న అబం సుబం తెలియని పది సంవత్సరాల పిల్లని తాయం పెడతా రమ్మని ఇంట్లోకిపిలిచి ఏం చేశాడు? వొక నెల రోజులు మీరు ఆ పిల్లయ్మే ఆ గుబ్బుగా చెప్పు

కుంటిరే. వీణ్ణి బహిష్కరించాలని తీర్మానించుకుంటిరే ! అప్పుడే మరచిపోయ్యారా ! ఇతని ఈ సూర్యప్రకాశరావు సంగతి మీ అందరికీ తెలిసిందే! ధర్మప్రభువు డబ్బు పది వేలు తిన్నాడు. వాళ్ళ ఇంటిపక్కనవున్న పాపయ్య ఇల్లు తాకట్టు పెట్టుకొని, డబ్బు వడ్డీకి యిచ్చి ప్రస్తుతం అతని భార్యని వశం చేసుకున్నాడు. పాపయ్యకు తెలుసుకాని, తెలిసి ఏం చేస్తాడు? ఏమన్నా అంటే ఇల్లు వేలం వేయిస్తా నని బెదిరించాడు. ఇప్పుడా పాపయ్యకు పిచ్చెత్తింది. వీళ్ళా మీకు నీతులు చెప్పే ప్రవక్తలు! లోకకళ్యాణార్థం ధర్మోపన్యాసాలు చేసే త్యాగమూర్తులు! ప్రజలను వుద్ధరించే నాయకశ్రేష్ఠులు."

అతను మాట్లాడుతూవుంటే ప్రజలు నోళ్ళు తెరచుకొని వింటున్నారు. వేదికమీద వున్నవాళ్ళు కుంచుకు కుంచుకు పోతున్నారు. ఎవ్వరికీ ముందుకు రావటానికి ధైర్యం చాలటం లేదు. ఎవరికివాళ్ళు తమని గురించి ఏమంటాడో తమ రహస్యాలు ఏం బయట పెడతాడోనని ప్రాణాలు బిగపట్టుకు కూర్చున్నారు.

అధ్యక్షుడితో సూర్యప్రకాశరావు "తాగాడు, దింపండి, దింపండి, అట్లా చూస్తారేం!" అన్నాడు. కాని అధ్యక్షుడికి ఊపిరి సలపలంలేదు. సీతారామారావు మాట్లాడుతూనే ఉన్నాడు. ప్రజలలోనుండి "నీ సంగతే మిటో కూడా కాస్త చెప్పు" అని కేక వేశాడొకడు.

"నా సంగతేదయినా నేను మీకు నీతులు చెప్పటం

లేదు. నేను ఆచరించని సిద్ధాంతాలను మీకు బోధించటం లేదు" అన్నాడు సీతారామారావు.

"మరి ఇందాకటినుంచీ ఏడ్చిందేమిటి?" అని ఇంకొకడు కేక వేశాడు.

"మీకు నీతులు చెప్పేవాళ్ళను చూసి మోసపోవద్దని చెపుతున్నాను. వీళ్ళ కపట ప్రవర్తనలను, వీళ్ళ నీచ స్వభావాలను మీకు ఎరుకపరుస్తున్నాను"

"అన్నీ ఏడ్చాపులే దిగు" ప్రజల్లో గోల బయలు దేరింది. ఈలలు వెయ్యటం, వెకిలిచవ్వులు నవ్వటం, చప్పట్లు కొట్టడం ప్రారంభించారు.

సోడాబుడ్డి కీచుమంది.

అధ్యక్షుడికి ధైర్యం మొచ్చింది. "ఇక కూర్చో" అన్నాడు బుజంపట్టుకు లాగుతూ.

సీతారామారావు విదిలించుకుని "ఇదిగోఇక అధ్యక్షుల వారి సంగతి చెపుతా వినండి. ఈయన స్వాములవారు గదా! శుద్ధచేతన స్వరూపం గదా! సర్వసంగ పరిత్యాగి గదా! ఈయన చేస్తున్న పను లేమిటో కొంచెం తెలుసుకోండి" అని బిగ్గరగా అన్నాడు. చైతన్యస్వామి ముఖాన నెత్తురు లేకుండా పోయింది. అపట్నె కుర్చీలో చతికిల బడ్డాడు.

"చెప్పు, చెప్పాల్సిందే"అని ప్రజలు కేకలువేశారు.

"స్వాములవారు ఈ ప్రపంచం మిథ్య అని చెపుతారు. జీవితమంతా భగవంతుని జేరటానికై ప్రయత్నించాలని బోధ చేస్తారు. కాని వీరేం చేస్తున్నారో అడ

గండి. ఈ బోధలు, ఈ నియమాలు తాము అనుసరించ వలసిన అవసరం లేదంటారు. ఇవన్నీ అజ్ఞానులకోసం ఏర్ప డ్డవి. కాని, జ్ఞాని వీటికి అతీతుడు అంటారు. తాను జ్ఞాని కనుక, ఏం చేసినా తప్పులేదనీ, తనకు అంటవనీ చెపుతారు.

ఒక కుర్రదాన్ని వేదాంతబోధ అని భర్త దగ్గర నుంచి లేపుకొచ్చాడు. అడగండి నామాట అబద్ధమేమో! మొట్లో ఆ పిల్ల అంగీకరించకపోతే 'తప్పేనుంది. దురద పుడితే, గోక్కోవడంలేదా ?' అని బోధచేశాడు.

ఆ కుర్రది ఈ సిద్ధాంతం ఆచరణలో పెట్టింది. స్వాములవారితోనే ఆకర్ష పొయ్యేటప్పటికి స్వామీజీకి ఆగ్రహం వచ్చి ఆశ్రమంలోనుంచి తరిమేశాడు. ఆ పిల్ల తిరిగి తిరిగి ఆత్మహత్య చేసుకుంది. అడగండి నా మాట అబద్ధమేమో?"

జనానికి ఈ విషయం వింటానికి ఆహ్లాదకరంగా వుంది. సంతోషంగా గోలచేస్తున్నారు. చైతన్యస్వామి బుసలు కొడుతున్నాడు. సీతారామా కాపు మాట్లాడుతూనే వున్నాడు.

"ఇక మీ సంగతి చెపుతాను. అసలు తప్పంతా మీదే-ఎవరేం చెప్పినా, చెప్పేది ఎవ్వరైనా వెర్రి మొహాలు వేసుకొని వింటూవుంటారు. మీకు బుద్ధిలేదు. మీరు గొర్రెలు, ఎవ్వరేం చెపుతున్నారా అనే ఆలోచనే మీకు లేదు. అహ్హాహ్హా ఇహ్హిహ్హా అంటారు...."

తన వెక్కిరింపు తనకే సంతోషం కలిగించింది. ప్రజల్లో ఎక్కువమంది నవ్వుతున్నారుగాని, కొంతమంది

ముఖాలు మాడ్చుకుంటున్నారు. "పిచ్చెక్కింది" అని కొందరూ, "మదం దించాలి" అని కొందరూ అనుకుంటున్నారు. తమను మర్దించటం ఆగటంవల్ల, వేదికమీద వున్న పెద్దమనుషులకు కొంచెం వూపిరి సలుపుతూ వుంది. సూర్యప్రకాశరావు కోపంతో ఉపాయం ఆలోచిస్తున్నాడు.

"సంఘసంస్కర్తల ప్రజాహిత జీవితానికీ, వ్యక్తిగత జీవితానికీ సంబంధంలేదు అనే మాటలు మీరు నమ్మకండి. మిమ్మల్ని మోసం చెయ్యటానికి చెప్పేమాటలవి. పెద్దవాళ్ళ వ్యక్తిగత జీవితాలను మీరు జాగర్తగా పరిశీలిస్తూవుండాలి. విమర్శిస్తూ వుండాలి. ఒక వ్యక్తి భావాలను, అభిరుచులను, అభిప్రాయాలను నిర్ణయించేది వ్యక్తిగత జీవితమే అని మరచిపోకండి .... మీరు అజ్ఞానులు, మూర్ఖులు, పందలు...." అని ప్రజలను నోటికివొచ్చినట్టు తిట్టటం మొదలుపెట్టాడు.

అవకాశంకోసం నిరీక్షిస్తున్న సూర్యప్రకాశరావు దిగ్గునలేచి, సీతారామారావుని ఒక పక్కకునెట్టి ప్రజలను ఉద్దేశించి, ఆవేశంతో... "వీడు తాగుబోతు....హంతకుడు. వీడు మిమ్మల్ని ఇంత నీచంగా తిడుతూవుంటే, మీరు ఎలా సహించి వూరుకుంటున్నారు-మీరు ఆంధ్రమాత పుత్రులుకాదా? మీలోవున్న ఆంధ్రరక్తం, ఆంధ్రశౌర్యం ఆంధ్రుల ప్రతాపం ఏమయినవి ? అవమానం సహించి ఎలా వూరుకోగలుగు తున్నారు?"

'తన్నండి' 'పొడవండి', అని బండబూతులుకూస్తూ వేదికమీదకు ఎక్కుతూ ఉంది జనం.

సీతారామారావు గబగబలున బల్లమీదకు ఎక్కి కుర్చీచకటి చేతోపైకి ఎత్తిపట్టుకొని "రండి .... నా వంటి మీద చెయ్యి పడిందా మీ ప్రాణం పోయిందే! ప్రాణాలకు ఆశ వొదులుకున్న వాడెవ్వడో ముందుకురండి...." అని గద్దించాడు.

అతని ఆకారం భయంకరంగా ఉంది. ఏపని చెయ్యటానికైనా వెనుతియ్యడని ముఖకవళికలు చెపుతున్నై. జనం ముందుకు రావటానికి భయపడింది. ఎవరికివాళ్ళు తమనే సంబోధిస్తున్నా డనుకున్నారు. ముందుదెబ్బ తమ మీదే పడుతుందనుకున్నారు. వెనకవాళ్ళు బండబూతులు తిడుతూ ముందువాళ్ళని నేదిక దగ్గరకు తోస్తున్నారు. ముందువాళ్ళు మాత్రం నిగడదన్ని నుంచున్నా రేగాని కదలటంలేదు.

అతడు అలాగే కుర్చీచేతోపైకి ఎత్తిపట్టుకొని "రాకండి. ఒక్క అడుగు ముందుకు వేశారా తలలు పేలిపోతయ్" అన్నాడు. ప్రజలు భయపడుతూ ఉంటే అతనికి కసిఎక్కువ అయింది. "మీరంతా వొట్టి పిరికివెధనలు. రారే? నుంచున్నారేం...రండి...." అని అరిచాడు.

"తన్నండి చూస్తారే! వాడు దుర్మార్గుడు. భార్యనూ పిల్లలనూ బాది బాది వొచ్చాడు. చూస్తూ వూరుకుంటే ఏమైనా చేస్తాడు." అని జనంలోంచి ఎవ్వరో కేకవేశారు. ఆ గొంతు అతనికి బాగా పరిచయం అయిన గొంతుగా కనిపించింది. అటు చూశాడు. రామమూర్తితాత ...జనాన్ని

నెట్టుకుంటూ ముందుకు వొస్తున్నాడు. జనం అతన్ని అనుసరిస్తూ వుంది....

"రామయ్యతాతా, నువ్వా... రా..... ....నీ సంగతి ఒక్కటే ఇక మిగిలివుంది. ఈ రామయ్యతాత వున్నాడు చూశారూ, ఇంత ముసలివాడా ?...."

"పడెయ్యండి... పట్టుకోండి...." అని కేకవేశాడు రామయ్యతాత. చైతన్యస్వామికి ధైర్యం వొచ్చింది. సీతారామారావు నుంచున్న బల్ల పడదోశాడు. బల్లతో పాటు సీతారామారావూ కిందపడ్డాడు. జనం విరుచుకు మీద పడింది.

"తన్నండి"

"కట్టిపడవెయ్యండి"

"ఏం వదిరాడ్రా"

"పెద్దన్ని తిడతాడా పబ్లిక్‌లో పట్టుకుని."

"పిచ్చిగాదురా. వాళ్ళకి వ్యక్తిగత తగాదాలున్నాయట. గసి తీర్చుకోటానికీ, వాళ్ళని అవమానించటానికీ ఇంతపని చేశాడు."

నోటికివచ్చిన బూతులు కూశారు. తలొక తన్నాన్నారు. సీతారామారావుకి కదిలే ఓపిక లేదు. అలాగే మాట్లాడకుండా పడివున్నాడు. రామయ్యతాత దగ్గరకువచ్చి పలకరించాడు.

"బాబూ... ఇప్పుడు ఎట్లావుంది...?"

"బాగానే వుంది తాతా...తాతా! నీమనమడికి ఒక సహాయం చెయ్యవూ ?"

"ఏమిటి బాబూ?"

"నీ మనుమరాలితో నన్ను క్షమించమని చెప్పు తాతా—"

"అదెప్పుడో క్షమించి ఉంటుంది బాబూ"

"తాతా.... ఇంకా నేనుచేసిన తప్పేమిటో నాకు తెలియటం లేదు... ఇంతమంది చెయ్యని పాపం నేనేం చేశాను తాతా? నాకేమీ తెలియటంలేదు తాతా..."

"బాబూ, నీతో మాట్లాడాలి"

"వొద్దుతాతా..... మాట్లాడి మాట్లాడి మొహం మొత్తింది."

"ఫరవాలేదు బాబూ ఆ గన్నేరు చెట్టుకిందకు వెళ్దాంరా. తీరిగ్గా మాట్లాడుకుందాం."

5

అది గన్నేరు చెట్టు. రాత్రుళ్లు నిద్రపోతుంది. అందుకని దాన్ని నిద్రగన్నేరు అంటారు. దాని పక్కన చిన్న వంతెనవుంది. ఆ వంతెనకు ఎదురుగా పిల్లలబడి, దానికి కొంచెం దూరంలో ఒక ఆశ్రమం వున్నాయి.

ఆ గన్నేరు చెట్టుకింద కూర్చున్నారు రామయ్య తాతా, సీతారామారావూను. సీతారామారావు ఆవంతెన మీదనుంచి వెళ్తున్న మనుష్యుల్ని బళ్ళనీ చూస్తున్నాడు. సూటు వేసుకొని బూట్లతో టకటక నడుస్తూ ఒక ఉద్యోగి

వెళ్ళాడు. పంచె ఎగగట్టి, గంధం బొట్టు పెట్టుకొని ఏవో మంత్రాలు గొనుక్కుంటూ ఒక పురోహిత బ్రాహ్మణుడు వెళ్ళాడు. గోచీ పెట్టుకొని ఒక ఎరికలవాడు పందులను "టుర్, టుర్" అని తోలుకుంటూ వెళ్ళాడు. ఒక కారు వెళ్ళింది. ఒక జట్కాబండి వెళ్ళింది. ఒక రెండెడ్ల బండి వెళ్ళింది.

వీటిని చూస్తూంటే సీతారామారావుకి ప్రపంచ స్వభావం - ఇన్నాళ్ళనుంచీ దేనికోసం తాను వెతుకుతున్నాడో అది అర్థమయినట్లు అనిపించింది. అతను పశుదశనుదాటి ఆధ్యాత్మిక వాగ్గంలోకీ, ఆధ్యాత్మికవాదాన్ని దాటి భౌతిక వాదంలోకీ సంఘం అభివృద్ధి చెందుతూ వుంది అనుకున్నాడు. అది నిజమే! కాని సంఘంలో ఈ మూడు దశలకు చెందినవారూ ఉంటున్నారు. ఒకవాదం మరొక వాదాన్ని రూపుమాపటంలేదు. వివిధదశలకు సంబంధించిన కర్మా, గుర్రాలూ, ఎడ్లబళ్లూ అన్నీ సంఘంలో ఉంటూనే ఉన్నై. అన్నిటి అవసరం ఉంటూనే వుంది. వేటిపని అవి చేసుకుపోతూనే వున్నై. ఒకటివచ్చి రెండోదాని అవసరం లేకుండా చెయ్యటంగాని, నామరూపాలు లేకుండా చెయ్యటం గానీ లేదు - జరగటంలేదు, మానవసంఘం ఎన్ని దశలు దాటినా, ఎంత పరిణామం చెందినా, అన్ని దశలకు సంబంధించిన లక్షణాలూ ఎప్పటికప్పుడు సంఘంలో వుంటూనే వున్నై. ఈ అన్ని లక్షణాలనూ కలుపుకునే సంఘం వృద్ధి చెందుతూవుంది.

అయితే ఒక దశనుంచి మరొక దశకు రావటం అంటే ఏమిటి? ఈ ప్రశ్నకు అతనికి వెంటనే జవాబు దొరకలేదు. కాని తనకేదో నూతనదృష్టి ఏర్పడుతూ వున్నట్టు అనిపించింది. కాని ఆలోచించ బుద్ధి పుట్టలేదు. అలాగే చూస్తూ కూర్చున్నాడు. అతన్ని చూస్తూ కూర్చున్నాడు రామయ్యతాత.

నిమిషాలు గడిచిపోతున్నై. రామయ్యతాత సీతారామారావుని తేరిపారజూచి మెల్లిగా మాటలు మొదలు పెట్టాడు.

"జ్ఞానం కావలసిందే బాబూ! జ్ఞానం లేకపోతే అభివృద్ధే వుండదు. మానవుడు ప్రకృతిలో భాగమే అవటం వల్ల జ్ఞానమే లేకపోతే ప్రకృతికి దాసుడుగానే ఉండేవాడు. ప్రకృతినుంచి మానవుణ్ణి వేరుచేసింది జ్ఞానమే. ఈ జ్ఞానం వల్లే మానవుడు ప్రకృతిని విడిగా చూడగలుగుతున్నాడు. ప్రకృతి స్వభావాన్ని అర్థంచేసుకొని, దాన్ని లోబరచుకోగలుగుతున్నాడు. తన భవిష్యత్తుకి తానే కర్త అవుతున్నాడు. కాని జ్ఞానానికి రెండువేపులా పదునువుంది. జ్ఞానభాండారాన్ని ఎప్పటికప్పుడు నింపుకుంటూ వుంటేనే, అది మానవుని అభివృద్ధికి ఉపయోగపడుతుంది. దానికి నిత్య నైవేద్యం అవసరం. లేకపోతే ఎదురు తిరిగి తన్ను సృష్టించిన మానవజాతినే సర్వనాశనం చేస్తుంది.

"నీ దుర్గతికి ఇదే కారణం బాబూ! నీకు జ్ఞానం వుంది. ఇటీవల ప్రచారంలోకి వొచ్చిన సిద్ధాంతాన్ని

అర్థం చేసుకున్నావు. కాని ఇప్పుడు పరిస్థితులు మారినై. ఆ సిద్ధాంతం ప్రచారంలోకి వొచ్చిన తరువాత, అనేక కొ త్తవిషయాలు అనుభవంలోకి వొస్తున్నై. ఇప్పుడు నీకున్న జ్ఞానం నూతన సమస్యల్ని పరిష్కరించటానికి సహాయపడటంలేదు. నీలో నిజమైన మానవత్వం, స్వచ్ఛమైన సంస్కారం వుంటే, నువ్వేమిచేసి వుండేవాడివో తెలుసా? నీ జ్ఞాన భాండారాన్ని కొ త్త విషయాలతో నింపేవాడివి. ఇప్పటికున్న జ్ఞానంతో, సమస్యల వొత్తిడితో, కొ త్తమార్గాన్ని అన్వేషించే వాడివి. సలక్షణంగా అభివృద్ధి చెంది లోక కళ్యాణార్థం పాటుపడే వాడివి.

"కాని నువ్వలా చెయ్యలేదు. అలా చెయ్యక నీకున్న జ్ఞానంతో ఈనాటి సమస్యలు పరిష్కారం కావని తేల్చి, అనాదిగుంచీ వొస్తున్న సిద్ధాంతాలన్నీ ఏ విధంగా తప్పో నిరూపించి, "ఈ ప్రపంచంలో చేసేది ఏమీ లేదు!" అని తేల్చావు.

"నువ్వేమన్నా అనుకోగానీ, ఇందులో నువ్వు కొ త్తగా కనిపెట్టిందీ, అద్భుతంగా నిరూపించిందీ ఏమీ లేదు, బాబూ. పాత సిద్ధాంతాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి అసంపూర్ణం అని తెలుసుకునేగదా ఎప్పటికప్పుడు మనం కొ త సిద్ధాంతాన్నీ, కొ త్తజ్ఞానాన్నీ తెచ్చుకుంటూవుంది? ఇక నువ్వు పాతసిద్ధాంతాలన్నీ తప్పు అని బుజువు చెయ్యగలగటంలో ఆశ్చర్యంగానీ, గొప్పగానీ ఏముంది? అదే విధంగా అనుభవంవల్ల ఇప్పుడున్న జ్ఞానం కూడా అసం

పూర్ణం అని తెలుసుకునే స్థితికి రావడంలో కూడా ఆశ్చర్యం ఏమీ లేదు. మానవుడికి ఆ స్థితి కలగటం మంచిది కూడా. కాని ఈ స్థితి కొత్తమార్గాలను అన్వేషించటానికీ, కొత్త విషయాలను తెలుసుకోటానికీ ప్రోత్సాహం ఇవ్వాలి. అలాకాక ఆ జ్ఞానాన్ని తన్నుతాను నాశనం చేసుకోవానికి ఉపయోగించే వ్యక్తి మానవుడు కాదు - పరమ కిరాతకుడు, ఘోరరాక్షసుడు.

"బాబూ! ఇప్పుడు నీమనస్సుని కలవర పెడుతున్న సంశయం ఏమిటో నాకు తెలుసు. 'తాతా, నాకుజ్ఞానం వుందని అంగీకరించావుగదా! మరి నేను ముందుకు పోక వెనక్కి రావటానికి కారణం ఏమిటి?' అని అడగదలుచుకున్నావు చెపుతాను బాబూ; దానికి కూడా కారణం చెపుతాను

"జ్ఞానం ఒక్కటే మానవుని అభివృద్ధికి సహాయపడదు. దాన్ని సంక్షేమయస్సుకి ఉపయోగపడేటట్టు చేసే మనస్తత్వం కూడా వుండాలి.కత్తి ఉంది. దాన్ని ఉపయోగించే ఉత్తమ సంస్కారం గలవాని చేతులో పడితే, సంక్షేమయస్సుకి ఉపయోగ పడుతుంది. లేకపోతే సర్వనాశనానికి ఉపయోగపడుతుంది. అధికాగంవుంది. అదీ అంతే. జ్ఞానం కూడా అంతే!

"నీ కో విషమావస్థే వొచ్చింది. ఈ విషమావస్థలో పడే ఇన్నాళ్ళూ నువ్వు దారీ తెన్నూ లేకుండా కొట్టుకుంటున్నావు. నీవు కొద్దో గొప్పో జ్ఞానాన్ని సంపాదిం

చావు. కాని జీవితపు లోతులు అనుభవంలోకి రాలేదు. జీవితప్రవాహం మొడ్డున నిలబడి పుస్తక జ్ఞానంతోనే తృప్తి పొందడంవల్ల, జ్ఞానానికి తగిన మనస్తత్వం నీకు ఏర్పడలేదు. అందువల్లే జ్ఞానసముపార్జన దానంతట అదే నీకు ఆనందాన్ని, తృప్తినీ ఇవ్వలేకపోయింది. జ్ఞానసముపార్జనకు నీ ఆనందం కాక మరొక ఆధారం నీకు కావలసి వొచ్చింది. దానికోసం వెతికావు, వెతికావు, అహర్నిశలూ వెతికావు. నీకు అవసరమైన ఆధారం దొరకలేదు. నీకంటే తక్కువజ్ఞానం కలవాళ్ళకు పట్టుగొమ్మలుగా పనికి వొచ్చినవి నీకు పనికిరాలేదు. నీకు ఊతం ఇవ్వలేదు. నీ పట్టు తప్పింది నీ జీవితానికే ఆధారం లేకుండా పోయింది. నీ పతనప్రారంభం అయింది. అడుగు తగిలేవరకూ వెళ్ళావు.

"పోనీ అంతటితోనైనా ఆగావా? లేదు. ప్రపంచంలో ఏమీ లేదని చెప్పే నీకూకూడా నీ పతనాన్ని సమర్థించుకోటానికి కారణాలు కావలసివచ్చినై. కారణాలు ఊహించావు. వెనకజరిగినదంతా తప్పే! ముందుకు ఆలోచించావు. జరగబోయే దాంట్లో కూడా మానవుడు కోరదగినది ఏమీ లేదని తేల్చివేశావు.

"జ్ఞానానికి తగిన మనస్తత్వం లేకపోవటంవల్ల ఇంత దారుణమైన సంఘర్షణ, పతనం, భీభత్సం జరుగుతుంది గనుకనే, సంఘాన్ని మెట్టు తర్వాత మెట్టు పైకి తీసుకు వెళ్తున్నాం. పరిణామం కప్పదాట్లు వెయ్యదు అని చెపుతున్నాం.

"మానవుడు తనకున్న జ్ఞానాన్నిబట్టి ముందుకు చూడగలడు. ఈ నాటి సంఘంలో ఉన్న మంచీ, ఈనాటి సంఘంలో ఉన్న చెడుని నిర్మూలించే మంచీ కలిసినచ్చే సంఘం ఏర్పడుతూ ఉంది. దాన్నిబట్టి తరువాత యేం జరుగబోయేదీ కూడా ఊహించవచ్చు. కాని ఈ వూహలు యథాతథంగా జరగవు. ప్రకృతి శక్తుల్నీ, సంఘంలోఉన్న శక్తుల్నీ, మానవునిలో ఉన్న శక్తుల్నీ మనం ఇంకా పూర్తిగా మన అధీనంలోకి తెచ్చుకోలేదు. మనకున్న అనుభవాన్నిబట్టి, మనకున్న జ్ఞానాన్నిబట్టి ఒకఆదర్శాన్ని పెట్టుకొని దాన్ని పొందటానికి కృషిచేస్తున్నాం. ఈ కృషిలో మనం అనుకోని అడ్డంకులు అనేకం వొస్తాయ్. మనకు తెలియని విషయాలు అనేకం తెలుస్తాయ్. వీటితో ఎప్పటికప్పుడు మన జ్ఞానకోశాన్ని నింపుకుంటూ ఉంటాం. ఈ విధంగా క్షణక్షణం జ్ఞానం మారుతూ ఉంటంవల్ల ఎల్లప్పుడూ మన ఆదర్శం కూడా కొద్దో గొప్పో మారుతూనే ఉంటుంది. కాబట్టి ఎంతో ముందుకు వూహించి, నిక్కచ్చిగా ఇలా జరుగుతుందని తేల్చుకొని దాన్నిబట్టి మన జీవితాలను నిర్ణయించుకోవటం అర్థంలేని పని.

"ఈ విధంగా ఊహించగలగటం నీ ప్రత్యేకత కాదు. అనేకమంది ఊహించగలరు ఊహించారు. ఊహిస్తున్నారు. సంఘ పరిణామాన్ని గురించి నాకుండే ఊహలు నాకున్నై. కాని ఈ ఊహల సన్నిటిసి సంఘంమీద రుద్దటానికి నేను అంగీకరించను. ఎందుకో తెలుసా నీకూ?

"మానవ మనస్తత్వం పరిపక్వ దశకు రానప్పుడు ఎటువంటి ఉత్తమ బీజమైనా వెర్రితలలే వేస్తుంది. రోగాన్నిబట్టి గదా ఔషధాన్ని నిర్ణయించ వలసింది. అందుకని ఈ సంఘంలో ఉన్న మానవుడికి అనేకదశలు దాటిం తర్వాత సంఘం ఎలా ఉంటుందో చెప్పటం, అసత్యం చెప్పటమే కాక అతని మనస్సుని చిందరవందర చెయ్యటం అవుతుంది, ఈనాటి సమస్యలమీద బుద్ధి నిలవ కుండా చేస్తుంది, కాబట్టి మొచ్చేదశను గురించే చెపు తున్నాం. ఆ దశ ఎలా మొచ్చేదీ చెపుతున్నాం. అబద్ధం చెపుతున్నామని నువ్వు విచారపడవలసిన అవసరంలేదు. అప్పటికది నిజమే. అనుభవంవల్ల ఆ జ్ఞానం అసంపూర్ణం అని తెలుసుకున్నప్పుడు మరికొన్ని విషయాలను కలుపు కుంటున్నాము. అంతేబాబూ...అంతే...అంతకంటే ఏం లేదు....ఇప్పుడు వెనక్కి తిరిగిచూచి జరిగిందంతా మోసం అని నీచార్థం కలిపించింటం నీమనస్తత్వాన్ని తెలియ జేస్తుంది. అంతేబాబూ ...అంతే!"

రామయ్యతాత ఆగాడు. సీతారామారావుని పరీ క్షగా చూశాడు. అతడు ఇంకా వంతెనవైపే చూస్తు న్నాడు. జనం వంతెనమీద అటూ ఇటూ తిరుగుతున్నారు. తనచూపు మరల్చకుండానే ప్రశ్నించాడు.సీతారామారావు "ఎందుకు? దేనికోసం ఈ మన ప్రయత్నం అంతా?"

"చెబుతా బాబూ, చెబుతా" అన్నాడు రామయ్య తాత. చెప్పటం మొదలుపెట్టాడు.

'ఏమిటి?' 'ఎందుకు?' అనే ప్రశ్నలు ఎలా పుట్టి నయ్యో ఎందుకుపుట్టినయ్యో తెలుసుకుంటేగాని సరైన జవాబులు దొరకవుబాబూ. అందుకని మొదటినుంచీ మొదలు పెడతాను.

"మానవుడు ఆలోచించడం మొదలుపెట్టినప్పుడు ఈ ప్రశ్నలు పుట్టినై. ప్రకృతి చర్యలను అర్థంచేసుకో టానికి సహాయపడినై.

"అనేకసార్లు నీవు చెప్పినట్లు ప్రాణం నిర్నిమిత్తంగా పుట్టింది. ఒక ప్రయోజనాన్ని సాధించాలని రాలేదు. ప్రకృతి కూడా అంతే. ప్రకృతి ఉంది. దానికి కొన్ని నియమాలున్నాయి. ఆ నియమాలనుబట్టి నడుస్తూ ఉంది. అంతేకాని దానికొక ఆదర్శంలేదు. ఆదర్శాన్ని సాధించ డానికే అదిపరిశ్రమం చెందటంలేదు. ఇటువంటి ప్రకృతిలో భాగంగా మానవుడు ప్రబలకవలసివచ్చింది. ప్రకృతి చేష్ట లకు తట్టుకోలేని జీవాలు నశించినై. తట్టుకోగలిగినవి వృద్ధిచెందినై. అంటే ఇలా బ్రతికితే అపాయంలేకుండా ఎక్కువ రోజులు బ్రతకగలం అనిగానీ, ఏ ప్రకృతిభావం యిదికాక యిలా చేస్తే అపాయం తప్పుకోగలం అని గానీ, ఏ ఆలోచనా లేకుండా, బ్రతికినన్నాళ్ళు బ్రతికినై.

"ఇటువంటి జీవకోటిలోకి జ్ఞానం వొచ్చింది. 'ఇలా ఎందుకుజరుగుతూ ఉంది? అలా ఎందుకుజరుగుతూ వుంది?' అనే ప్రశ్నలు బయలుదేరినై. ఈ ప్రశ్నలు ప్రకృతిని అర్థం చేసుకోటానికి ఉపకరించినై. ప్రకృతిస్వభావం అర్థం

చేసుకోవటం మొదలుపెట్టగానే జీవకోటిస్వభావం మారవలసిన అవసరంకలిగింది. అంతకుముందు తన ఇష్టంవచ్చిన పనులు చేసుకుంటూపోతున్న జీవకోటి, ఇప్పుడు కొన్ని పనులుమాత్రమే చెయ్యవలసి వచ్చింది. వెంటనే 'ఎందుకు?' అనే ప్రశ్న ఉదయించింది. ప్రకృతినుంచి తప్పించుకోటానికి, దాన్ని అర్థంచేసుకొని అనుకూలంగా పనిచేయించుకోటానికి ఆదర్శం అవసరం అయింది.

"ఈ ఆదర్శం ఏ విధంగా నిశ్చయింప బడిందో తెలుసా బాబూ? చెపుతా విను.

"మానవులు పదిమంది ఒకచోటచేరి ఒక పద్ధతిగా బ్రతకటం మొదలు పెట్టారు. ఈ పద్ధతే మానవుని భవిష్యత్తుని నిర్ణయించింది. మానవుడు ఓ ప్రథమంలో మరొక పద్ధతి అవలంబిస్తే పరిణామం మరొక రకంగా ఉండి ఉండేదేమో? అలా జరగలేదు. ఆచరణలోవున్న పద్ధతి ఎక్కువమందిని బాధపెట్టే స్థితికి వొచ్చినప్పుడు, ఆ బాధలు ఏం చేస్తే పోతయ్యో, ఆ బాధలులేని సంఘం ఎలా ఉంటుందో ఊహించుకొని దానికోసం పాటుపడటం మొదలు పెట్టాడు. అభివృద్ధి చెందటానికి ఈ విధంగా మానవుడికి ఆదర్శం ఒకటి అవసరం అయింది.

"మనం సౌలభ్యంకోసం మానవ పరిణామం దశలుగా వర్గీస్తున్నాం గాని, ఇవి ముక్కలు కావు. మనం ఒక ఆదర్శం సాధించటానికి చేసే ప్రయత్నంలో పొందే జ్ఞానాన్నిబట్టి మన ఆదర్శం అనుక్షణం పరిణామం చెందుతూనే ఉంటుంది. ఈ పరిణామం ఒక ప్రవాహం వంటిది

బాబూ! దీనికి కొండలు గుట్టలు అనేకం అడ్డు రావొచ్చు. ఈ అడ్డంకులను తొలగించు కోటానికి అది ఒకొక్కసారి ప్రబల ప్రయత్నం చెయ్యవలసిన అవసరం కలగవొచ్చు. అది ఒకసారి పుందరంగా, ఒకసారి ఉధృతంగా ప్రవహించ వచ్చు. కాని అది ఎడతెగిపిలేని ప్రవాహం.

"చూశావా బాబూ! మానవుడు తాత్కాలికంగా తను పడుతున్న బాధలను నివారించుకోటానికై ఈ పరిణామానికి దోహదం చేస్తున్నాడు. అందుకుగాను ఈ పరిణామానికి దోహదం ఇచ్చే గుణాలను బలవత్తరం చేసుకొని ఈ పరిణామానికి అపకారం చేసే గుణాలను అణగదొక్కుకుంటున్నాడు, అరికడుపుతున్నాడు. ఇప్పుడీ ప్రయత్నపూర్వకంగానే జరుగుతూ ఉంది. ఈ పని చెయ్యటం ఇప్పటికి బాధాకరంగా కూడా వుండొచ్చు. కాని ఎప్పటికీ ఉండవలసిన అవసరంలేదు. మానవుడీ విధంగా అభివృద్ధి చెందుతూ పోతే ఒకప్పటికి సంఘానికి దోహదం ఇచ్చే పనులే వ్యక్తికి ఆనందాన్ని, తృప్తిని ఇచ్చే స్థితి వొస్తుంది. అప్పుడు మానవుడు ఆ పనులు తప్ప మరొక పనులు చెయ్యలేడు. అప్పుడు, 'ఎందుకు?' అనే ప్రశ్నకు తావులేదు. ఎందుకనే ప్రశ్న మానవునిచేత మంచి పనులు చేయించటానికి సహాయకంగా ఉంటానికి పుట్టింది. మానవునికి మంచి పనులు చెయ్యటమే స్వభావం అయినప్పుడు ఈ 'ఎందుకు?' యొక్క అవసరం క్షీణిస్తుంది. లేకుండా పోతుంది.

"బాబూ! ఒక్క సంగతి ఆలోచించు. ఇప్పుడు నీ లాంటి వాడూ నా లాంటివాడూ దొంగతనం చెయ్యడు, వ్యభిచారం చెయ్యడు, అబద్ధాలాడడు. ఎందుకు? సంఘం హింసిస్తుందనా? కష్టాలు వొస్తయ్యనా? కాదు. ఒకప్పుడు సంఘం బెగరించి, భయపెట్టి మానవుణ్ణి ఈ పనులు చెయ్యకుండా చేసినమాట వాస్తవమే. కాని ఇప్పటికది మన స్వభావం అయింది. మనం ఆ పనులు చెయ్యం. ఎందుకు? మనం గడించిన సంస్కారానికి ఆ పనులు సుఖం ఇవ్వవు. పైగా విపరీతమైన మానసిక బాధను కలిగిస్తయ్.

"మానవుని కొన్ని గుణాలనూ, వాంఛలనూ మార్చలేమని నేనూ వొప్పుకుంటాను. కాని ఆ వాంఛలు అనాదినుంచీ ఏ విధంగా ఉరుగుతున్నయ్యో ఆ విధంగానే తీరాలంటే మాత్రం నేను వొప్పుకోను. మానవుని కోర్కెలను ఉదాత్త పరచటంవల్ల మరొక రకంగా మనకు తృప్తికలుగుతూ ఉంది. స్త్రీ వ్యామోహాన్ని దేశంమీదకు తిప్పవొచ్చు, విశ్వమానవ ప్రేమగా మార్చవచ్చు. ఈ విధంగా ఉదాత్తం చేసే శక్తి మానవుడికి ఉండబట్టే సంఘ పరిణామానికి సహాయం చెయ్యటంలోనే ఆనందం పొందగలుగుతున్నాడు. అదే అతని స్వభావం అవుతుంది ఏనాటికైనా.

"అప్పటికి, ప్రకృతిని మానవుడు లోబరుచుకోగలుగుతాడు. ప్రకృతికీ మానవుడికీ సంఘర్షణ వుండదు. మానవునిలో విరుద్ధశక్తుల ఘర్షణ ఉండదు.

"బాబూ! నువ్వు 'మానవుడు పరిస్థితులకు బానిస' నుకుంటున్నావు. అందుకనే 'నాదేముంది? నేనలా చెయ్యక

తప్పింది కాదు. పరిస్థితులు భావాలను కలిగిస్తున్నై, భావాలు పనులు చేయిస్తున్నై. ఇక నా దేముంది?' అని మాటిమాటికీ అంటూ ఉండేవాడివి. అలా కాదు బాబూ ! ఒకప్పుడు అంతేగాని, మానవుడు క్రమక్రమేణా ప్రకృతి శృంఖలాలలో నుంచి బయటపడుతున్నాడు. ప్రకృతి నియమాలను అర్థం చేసుకొని, తన అభివృద్ధికి ఉపయోగించుకోవటం ద్వారా, ప్రకృతిని జయించి తన స్వతంత్రత చూపుతున్నాడు.

"ప్రకృతిశక్తుల్ని పూర్తిగా అర్థం చేసుకున్నాక ప్రకృతికీ మానవుడికీ సంఘర్షణ వుండదు. సాంఘిక పరిణామమే మానవునికి ఆనందం ఇచ్చే మనస్తత్వం కలిగినాక సంఘానికీ మానవునికి సంఘర్షణ ఉండదు. మానవునిలో విరుద్ధశక్తుల సంఘర్షణ ఉండదు. మానవుడు పరిపూర్ణ మానవుడవుతాడు.

"బాబూ, ఈ దృష్టితో ఆలోచించు. సంగతులన్నీ నీకు తెలిసినవే. కాని దృష్టిమాత్రం భేదం. వ్యక్తిగత దృష్టివల్ల విరుద్ధశక్తులు ప్రకోపించటం, మానవకోటి నాశనం అవటం తప్ప మరొకటి జరగదు. సాంఘిక దృష్టి అలవరచుకొని, ముందుకు చూడు. సంఘాన్ని ముక్కలుగా చూడక, మొత్తంగా చూడటం నేర్చుకో.

"సంఘంలో భిన్నవర్గాలున్నమాట నిజమే బాబూ! ఈ వర్గాల పోరాటం పరిణామానికి దోహదం ఇస్తున్న మాటా నిజమే! కాని యీవర్గాలు ఒకదానికొకటి సంబం

ధం లేని ముక్కలుకాక ఒకదానిమీద ఒకటి ఆధారపడి వుంటున్నై. వీటి కలయికే సంఘం అనే మాటమాత్రం మరచిపోకు బాబూ! ఇప్పుడు నువ్వు తరువాత మెట్టుకు వెళ్ళవలసిన స్థితికి వొచ్చావు. ధైర్యంగా ముందుకు వెళ్ళు. నువ్వు సుఖపడు, నీకుటుంబాన్ని సుఖపెట్టు, లోకాన్ని సుఖపెట్టు" అని ముగించాడు రామయ్యతాత.

సీతారామారావు మాట్లాడలేదు. వొక్కక్షణం రామయ్య తాతని ఎగాదిగా చూచి మళ్ళీ తన దృష్టిని వంతెన వైపుకి తిప్పాడు. వంతెన మీదనుంచి వెళ్తున్న వొక మూలవాడు ఎదురుగా వస్తున్న ఆశ్రమవాసుల్ని చూచి, దూరంగా వెళ్ళి నిలబడ్డాడు. ఎదురుగా వస్తున్న ఇద్దరు విద్యార్థులు ఆశ్రమవాసుల్ని హేళన చేశారు. ఆశ్రమవాసులు తమ సత్వగుణాన్ని వొదిలి తమ చేతుల్లో ఉన్న దండాలు వైకెత్తారు. విద్యార్థులు పకపక నవ్వుతూ పారిపోయారు.

సీతారామారావు అలాగే చూస్తూ కూర్చున్నాడు. క్రమక్రమేణా ఆ ప్రదేశం నిర్మానుష్యం అయింది. వంతెన బావురుమంటూ ఉంది. అర్ధచంద్రాకారంగా ఉంది: అంతులేని సొరంగంలాగు ఉంది.

రామయ్య తాత సీతారామారావుని చూస్తూ కూర్చున్నాడు.

నిశ్శబ్దం—నిశ్శబ్దం - అంతులేని నిశ్శబ్దం. రామయ్య తాతకి ఆ అంతులేని నిశ్శబ్దంలో సీతారామారావు వొక

భాగం అయినట్లూ, నిశ్శబ్దమే అవుతున్నట్లూ కనిపించాడు.

"ఇక వెళ్దాం బాబూ, ఇంటికి" అన్నాడు.

సీతారామారావు నెమ్మదిగా రామయ్య తాత వైపుకి తిరిగి, విచిత్రంగా చూచి, తల వొంచుకుని, "నువ్వు వెళ్ళు తాతా" అన్నాడు.

"ఇద్దరం వెళ్దాం బాబూ"

"నన్నిక్కడ కాసేపు ఉండినివ్వు తాతా! ప్రపంచంలో ఉన్న ఈ నిశ్శబ్దాన్నంతా నాలోకి తీసుకోనివ్వు"

రామయ్యతాత ఏమనుకున్నాడో నెమ్మదిగా నడిచి వెళ్ళాడు

సీతారామారావు వంతెన వైపుకి తిరిగి మెదలకుండా కూర్చున్నాడు. మూర్తీభవించిన నిశ్శబ్దంలా కూర్చున్నాడు. అర్ధచంద్రాకారాన్ని అంతులేని సౌరంగాన్ని చూస్తున్నాడు. అతని కళ్ళవెంట కన్నీటి చుక్కలు రాలుతున్నై.

ఉండి ఉండి అకస్మాత్తుగా "మిథ్య, మిథ్య, అంతా మిథ్య!" అని తన విశ్వాసాన్ని నిలబెట్టుకోటానికి అరిచాడు. "మిథ్య గనకనే ఎటుతిప్పి చెప్పటానికైనా వీలవుతుంది" అని తన్నావరించిన నిశ్శబ్దం బద్దలయ్యేటట్టు అరిచాడు.

చీకటిపడింది. తుమ్మబీడుకీ, ఏనాదివాళ్ళ గుడిసెలకీ అట్టే భేదం కనపట్టంలేదు. అన్ని కొన్ని మైళ్ళదూరంగా వున్న కొండల పంక్తికి మల్లే కినిపిస్తున్నయి. కారుమబ్బులకు మల్లే వున్నయి.... సీతారామారావు కాళ్ళీడ్చుకుంటూ శ్మశానం దగ్గరకు వొచ్చాడు. ఒక్కసారి శ్మశానాన్ని పారజూచాడు. దూరంగా ఒక చితి మండుతూ వుంది. అతడు ఒక నిట్టూర్పు విడిచి అక్కడే కూర్చున్నాడు.

పొద్దున్నుంచీ వున్న ఆరాటం, ఆవేదనా తగ్గినై. ఆ చీకటీ, ఆ శ్మశానం, దూరంగా మండుతున్న చితీ - అతనికి మనశ్శాంతిని చేకూర్చినయి. తా నిన్నాళ్ళూ ఆరాట పడింది, వెతికింది, ఈ శ్మశానం కోసమే కాబోలు: అనుకున్నాడు. ఆచితిని తదేకదృష్టితో చూస్తూకూర్చున్నాడు.

ఒక వ్యక్తి అతని దగ్గరకు వొచ్చి, "నేను చేసింది తప్పా!" అని అడిగాడు.

సీతారామారావు ఉలిక్కి పడ్డాడు. ఆ వ్యక్తిని చూశాడు. అతడు అరవై ఏళ్ళ ముసలివాడుగా కనిపిస్తున్నాడు. శరీరం శుష్కించి వుంది.

"ఏం నాయనా, నేను చేసింది తప్పా?"

"ఏది తప్పో ఎవరు చెప్పగలరు? ఎవరి మనస్సు వాళ్ళకే సాక్షి" అన్నాడు సీతారామారావు.

స్మశానమంతా కదులుతున్నట్టు కనిపించింది. దిబ్బలుకదులు తున్నయి. చీకటి వ్యాగింది. తన తండ్రిని ఎక్కడ సమాధి చేసిందీ అతనికి తెలుసు. నెమ్మదిగా మిగిలిన దిబ్బలను తప్పు కుంటూ అక్కడికి వెళ్ళాడు. అక్కడ ఏమీ లేదు - దిబ్బ హరించుకుపోయి నేల మట్టమైవుంది. జిల్లేడు మొక్కలు దట్టంగా పెరిగివున్నయి. అతనికి ఈ జిల్లేడు మొక్కలకు తన తండ్రి ఎరువయ్యా డనిపించింది. తాను అదర్శంగా వుంచు కున్న తన తండ్రి, అనేక ఘనకార్యాలకు కారణభూతుడైన తన తండ్రి, ప్రస్తుతం ఈ జిల్లేడు మొక్కలకు ఎరువుగా వుండి వాటి పోషణకు ఆధారంగా వున్నాడు. ఎంత ప్రాణం లేకపోతే మట్టుకు ఇటువంటి పనికి వ్యానుకుంటాడా తన తండ్రి! అతనికి తండ్రిమీద కోపమొచ్చింది. తన పుటకకు తన తండ్రే కారణం. ఈ జిల్లేడు మొక్కల పుటకకూ తన తండ్రే కారణం! బతికి ఉన్నంతకాలమూ తన్ను పోషించాడు మరణించి యీ జిల్లేడు మొక్కలను పోషిస్తున్నాడు. అయన రక్తంలో, అయన ఆలోచనల్లో ఏనో చెడు వుండి వుండకపోతే జిల్లేడు మొక్కలకు కారణభూతుడవ్వరా? అయనలో నుంచి జిల్లేడు మొక్కలకు బయలు గుల్మాబీ మొక్కలు పుట్టగూడదమా? మల్లెపొదలు పెరగగూడదమా? తనకు బయలు వొక గొప్పవ్యక్తి కొడుకు కాగూడదమా!

ఉన్న మొక్కలో పెద్ద మొక్క కదిలింది. తన్ను పలకరించింది. "అన్నాయ్!" అంది. అతడు ఉలిక్కిపడ్డాడు. ఆ మొక్కసీడ కదలి కదలి చితివేడివల్ల వుబికి వుబికి తన

తండ్రి ఆకారం ధరించింది. తనతండ్రి తనను క్రూరంగా చూస్తున్నాడు. గుడ్లు ఉరుముతూ, పండ్లు కొరుకుతూ యిలా అన్నాడు: "ఇదట్రా నువ్వు చేసినపని! నీ మీద ఎంతో ఆశ పెట్టుకున్నానే! చివరకు నువ్వు చేసినపని యిదా! నా గౌరవాన్ని, నా వలన ప్రతిష్టనూ, నా కుటుంబ బొన్న త్యానీ బుగ్గిపాలు చేశావు" అన్నాడు.

అతనికి కోపమొచ్చింది. " డబ్బు అయిపోయింది నాన్నా—నన్నేం చెయ్యమంటావ్!" అన్నాడు.

"డబ్బు డబ్బు డబ్బు—ఎప్పుడూ డబ్బే! నేను నువ్వు పుట్టినప్పుడే అనుకున్నాను, నీకు నీ మేనమామపోలిక వచ్చిం దని. డబ్బు లేకపోతేమాత్ర మేమిరా! చెడిబతికావా బతికి చెడ్డావా! అన్నారు పెద్దలు. తరతరాలనుంచీ మేం కాపా డిన అచారాలను వమ్ముచేశావు. నే నెంత చెప్పినా నీకు నీతల్లే ఆదర్శమయింది" అన్నాడు.

తల్లి పేరెత్తేటప్పటికి అతనికి కోప మెక్కువయింది. తండ్రిమీద అంతకుముందు అతనికిఉన్న గౌరవమూ, అభి మానమూ అన్నీ ఆ వొక్కమాటతో ఎరిగిపోయినయి. హృదయం మీదనుంచి ఒకపెద్ద బరువు తొలిగిపోయినట్ల యింది. "ఏమిటి నువ్వు మాట్లాడేది! నీవూ నీ వంశం పోగుచేసి కాపాడిన సాంప్రదాయాలు ఏమిటి! ఏమిటి నీ వంశానికి ఉన్నగౌరవం, నా తల్లి వంశానికి లేని గౌరవం! ఎవరికి ఉండే గౌరవం వాళ్ళకుంది. నీ వంశ గౌరవం అనే గానుగలో ఎంతమంది పిప్పి అయ్యారో, అవుతున్నారో నువ్వు ఎప్పుడయినా ఆలోచించావా! నీ వంశం, నీసాంప్ర

దాయాలేనన్నీస్థితికి తీసుకొచ్చినయి. పోతున్నాను.పాతాళానికి పోతున్నాను. ఈ అగాధానికి అంతున్నట్టులేదు. ఇదివరకు ఎన్నికష్టాలు వచ్చినా నిన్ను తృప్తిపరుస్తున్నాగదా, నీ ఆత్మకు శాంతిని చేకూరుస్తున్నాగదా అని సంతోషపడే వాణ్ణి ఇప్పుడు నువ్వుకూడా నన్ను నిందించటానికి పూనుకున్నావా? నా స్థితికి నేనేనా కారణం? నువ్వుకాదూ?" అని అడిగాడు.

"నేనా!" అని ఆశ్చర్యపడ్డాడు తండ్రి.

"ఆఁ నువ్వే. ముమ్మాటికీ నువ్వే. నీ గుణాలు నాకు కొన్ని సంక్రమించినయి. నీ చేతులతో, నీఅభిరుచులకు అనుకూలంగా నీయిష్టప్రకారం పెంచావు. నా చుట్టూవున్న వాతావరణం నువ్వు నిర్మించిన వాతావరణమే! ఇక నా యిష్టమనేది ఎక్కడ వచ్చింది? నీ యిష్టం వచ్చినట్టు పెరిగి పెద్దవాణ్ణయ్యాను. నీ యిష్టమొచ్చిన పూహలే పూహించాను.నీ యిష్టానికి వ్యతిరేకంగా,నీ సంస్కారానికి భిన్నంగా ఎవరయినా బతుకుతుంటే వాళ్ళు దుర్మార్గులనీ, నీచులనీ, అవినీతి పరులనీ నాకు నూరిపోశావు. నా తల్లిని, నా సొంత తల్లిని, నాకుకాకుండా చేశావు. ఇప్పుడు నీకృషి ఫలితాన్ని చూచి నివ్వే భయపడుతున్నావా? బెదిరిపోతున్నావా? నింద నా మీద మోపుతున్నావా?" అన్నాడు.

కొడుకుని చూచి భయపడ్డాడు తండ్రి. అతనికి ఏమీ తోచలేదు. తన వంశంలో పుట్టిన ఒకడు తనతండ్రికి ఎదురు తిరిగి తన వంశాన్ని నిందించేవాడుగా తయారు అవుతాడని జన్మలోనైనా అనుకొని ఉండడు అలాగే

నిర్ఘాంతపడి చూస్తున్నాడు. అతని కళ్ళకి అతని కొడుకు నీడ కనిపించింది. అదే తన కొడుకు అనుకున్నాడు. అది కదిలింది. నిఠారుగా నిలబడ్డది, మాట్లాడింది. "వొట్టిది. అన్నీ అబద్ధాలు చెప్పుతున్నాడు. అతను చేతులారా చేసుకున్నాడు. తన తప్పును నీ మీద పెట్టి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. అతను మొదటినుంచీ అంతే! తన తప్పులను ఇతరులకు అంటగట్టడం, తన బలహీనతలకు ఇతరులను హింసించడం - నువ్వు మరణించినప్పటినుంచి అతను చేస్తున్న పనే ఇది. ఇందులో నీ బాధ్యత యేమీ లేదు" అంది.

సీతారామారావు మాట్లాడుతున్న తన నీడను చూస్తూ నిర్వీణుడై నిలబడ్డాడు.

తండ్రి మొహం విప్పారింది. "నిజంగా నా బిడ్డవు నీవు, రా నాయనా!" అని తనకొడుకునీడను కౌగలించుకొని "వాడు నిజంగా నా కొడుకనుకొని భ్రమపడ్డాను. ఎంత వేదన పెట్టాడు! వాడి మాటలు నా హృదయాన్ని ముక్కలు ముక్కలుగా తరిగాయి" అన్నాడు

"వాడు అంతే నాన్నా, వాడికొక ఆదర్శం లేదు. ఎందులోనూ నమ్మకంలేదు. జీవితానికొక ఆదర్శం పెట్టుకోనివాడు, దేన్నో ఒకదాన్ని నమ్మి పనిచెయ్యనివాడు, చివరికి అంతే!" అంది నీడ.

"అదుగదీ-బాబు, సత్యం చెప్పావు. నూరేళ్ళు వర్ధిల్లు!

పరిస్థితులు తెలియని వాళ్ళు ఏమైనా అంటారు. తప్పు అంటారు. దుర్మార్గుడు అంటారు. ఘోరపాపం అంటారు. దేనికైనా మనుష్యులు ముందు బతకాలిగా బాబూ! నీతి, ధర్మశాస్త్రం-అన్నీ బతికే వీలున్న వాళ్ళకి, బతకటమే కష్టమైన వాళ్ళకి బతకటమే నీతి, బతకటమే ధర్మం, బతకటమే శాస్త్రం."

"ఇట్లాగే కనిపిస్తూ వుంది. బతకాలి అనుకోటం మనుష్యులకు తప్పించుకోలేని వ్యసనం అయింది. "ఎందుకు బతకాలి?" అనే ప్రశ్న వేసుకొనే ధైర్యం ఇంకా మనుష్యులకు అలవడలేదు..." అన్నాడు సీతారామారావు.

"మరి ఆ అవసరం తీరడానికి ప్రయత్నిస్తే తప్పేముంది"

"లేనట్టే వుంది. అంతా ఆపసులు చేస్తూనే ఉన్నారు. అబద్ధాలు ఆడుతూనే వున్నారు. మోసాలు చేసినవాళ్ళు చేస్తూనే వున్నారు. ఇతరులను హింసించేవాళ్ళు హింసిస్తూనే వున్నారు. ఎవరి ప్రపంచం తెరువని వాళ్ళు నిర్దాక్షిణ్యంగా చూసుకుంటూనే వున్నారు...." అన్నాడు.

"ఇక నే జేసిన పాపమేమిటి బాబూ! తిండికి కష్టం అయింది. ఎన్నాళ్ళుడొక్కలుమాడ్చుకొనివలవల యేడుస్తూ కూర్చున్నామో ఎవడికి తెలుసు? ఒకరోజు నా కూతురు పదిరూపాయలు తెచ్చి నాచేతిలో పెట్టింది. 'ఎక్కడివి' అని అడిగాను. అని చెప్పింది. నాదగ్గర ఏమీదాయలేదు బాబూ-అంతా చెప్పింది. నాకు కోపం వచ్చింది. ఎట్లా కొట్టానను

కున్నావు! ఎముకలు విరగగొట్టాను. కాని, ఏంలాభం? మళ్ళీ మర్నాటినుంచి యధాప్రకారం అయింది మాబ్రతుకు. నేను చూస్తూవూరుకున్నాను, అదే సంపాదించి కుటుంబం పోషించింది. ఇప్పుడు దాని తమ్ముడు అది సంపాదించిన డబ్బుతో చదువు పూర్తిచేసుకున్నాడు. ఉద్యోగంలో ప్రవేశిస్తున్నాడు. ఇంతకంటే ఏంకావాలి బాబూ! బతికిన నాలుగు రోజులు అది సుఖపడింది. మమ్మల్ని సుఖపెట్టింది. దాని దారిన అది పోయింది. అదిగో బాబు! మట్టిలో కలిసి పోతూ వుంది.... " అని మండుతున్న చితిని చూస్తూ అన్నాడు. "బాబూ నూరేళ్ళు వర్ధిల్లు " అని దీవించి వెళ్ళి పోయాను.

సీతారామారావు ఆలోచిస్తూ కూర్చున్నాడు. రక రకాల ఆలోచనలు చెలరేగినై. తరచినకొద్దీ అతనికి ప్రపంచం కొత్తగా కన్పిస్తూఉంది. ఇటీవల తన అనుభవం లోకి వొచ్చిన ప్రపంచం అతనికి వింతగా ఉంది. కాని, ప్రస్తుతం బాధపడే ఓపికకూడాలేకుండాఉంది. అలాగే నిర్జీవ ప్రతిమలాగు కూర్చున్నాడు.

కోలాహలంగాఉన్న ప్రపంచాన్ని, ప్రశాంతంగా ఉన్న శ్మశానాన్ని పోల్చిచూసుకుంటే, అతని మనస్సు చల్ల బడింది. తనకు సరిపోయిన చోటుకి,తన మాతృదేశానికి,తన స్వగృహానికి-వొచ్చినట్టు అనిపించింది. ఇక్కడ ప్రపంచంలో ఉన్న భేదాల్లేవు.కీచులాటల్లేవు.హెచ్చుతగ్గుల్లేవు.సంఘర్షణ

లేవు. మోసాలూ, కుట్రలూ, తాపత్రయాలూ లేవు. ఇక్కడ అంతా ఒక్కటే. కూలివాళ్ళు, పావుకార్లు, అడవాళ్ళు, మొగవాళ్ళు, పిల్లలు, పెద్దలు, నీతిపరులు, అవినీతిపరులు-అంతా ఒక్కటే. శ్మశానానికి పాపిక బుద్ధిలేదు. అందర్నీ సమానంగా చూస్తూంది. తన తండ్రీ, తన మేనత్తా ఇక్కడే ఉన్నారు. తనతల్లి ఇక్కడే ఉంది. రామయ్యతాతా తొణకుకుండా కబుర్లు చెబుతాడుగాని, తనకు అస్తమానం నీతులు ఉపదేశిస్తాడుగాని-ఆయనా ఇక్కడకు రావలసినవాడే. తన్ను మోసంచేసి ఆస్తి సంపాదించిన మేనమామకు మాత్రంతప్పే దేముంది! ఆస్తిని అక్కడే వొదిలి చేతులుజాడించుకుంటూ ఇక్కడకు రావలసిందే. ఇక ఎందుకు వీళ్ళకి ఆరాటం!

మేం తెలివిగలవాళ్ళం అనీ, ధనవంతులమనీ కొందరు విర్రవీగటం, బీదవాళ్ళం అనీ, మందబుద్ధులం అనీ కొందరు విచారపట్టం ఎందుకు?

ఇలా ఆలోచించుకుంటూ ఉండేప్పటికి శ్మశానం చాలా ఆకర్షవంతగా కనిపించింది. ప్రపంచంలో ఉన్న కష్టాలనూ సుఖాలనూ అన్నిటినీ భరించే మాతృదేవిలాగు, భూదేవిలాగు కనిపించింది.

దూరంగా మండుతున్న చితి ప్రపంచాన్ని దగ్గం చెయ్యటానికా అన్నట్లు మంటలరూపంలో గుప్పుని పైకి లేచింది. ఆర్భాటం చేసింది. టపటపా ధ్వనిచేసింది. ఆ చితి తన్ను ఆహ్వానిస్తూ వుందనుకున్నాడు. దగ్గరకు రమ్మని తన్ను పిలుస్తూ వుందనుకున్నాడు. తనకేదో రహస్యం చెప్పటానికి

వుబలాటపడుతూ వుంది. పాపం! ఆ చితికి కాళ్ళులేవు, తన దగ్గరకు రావటానికి! నోరులేదు, తన్ను బతిమాలటానికి! అగ్ని శిఖలను తనవైపుకు పంపుతూవుంది. అంతలో మళ్ళీ ఉపసంహరించుకుంటూ ఉంది. ఆటూ పోటూతో బాధపడు తున్న సముద్రపు అలలు జ్ఞప్తికి వచ్చినయి. చేత్తో పిలుస్తూ వున్నట్టనిపించిందతనికి, నెమ్మదిగా లేచి చితిదగ్గరకు వెళ్ళాడు. చూడగా చూడగా ఆ చితి ముసలివాని కూతురు రూపం ధరించినట్లుగావుంది. చిటచిటలాడింది. టపటప ధ్వనిచేసింది ఆమె ఏదో మాట్లాడుతున్నదనుకున్నాడు. "సుఖంగా నా బతుకు వెళ్ళమారిపోయింది. ఈ ప్రపంచంలో మిగిలేది సుఖమూ, దుఃఖమే. సుఖించినవాళ్ళూ, దుఃఖించిన వాళ్ళూ అంతా మట్టి కావలసిందే. ఎందుకు దుఃఖపడాలి? దేని కోసం?" అని అడిగింది.

అతడు కళ్ళు తెరుచుకొని వింటూ కూర్చున్నాడు. "ఇదుగో-నా యీపక్క సమాధిలో స్త్రీవ ర్తనే ఆదర్శంగా పెట్టుకోవటంవల్ల తిండిక గడవక, కోర్కెలు తీరక కుళ్ళికుళ్ళి చచ్చిపోయిన ఒక పుణ్యాత్మురాలు వుంది. ఆమె ప్రవ ర్తన ఆమెను ఏం సుఖపెట్టింది? ఆమె పడిన బాధలూ, సహించిన కష్టాలూ ఎవర్ని వుద్ధరించను?" అని అడిగింది.

పక్కనున్న సమాధి యీ మాటలకు ఎక్కిఎక్కి ఏడుస్తున్నట్టు కదిలింది.

అతడు స్మశానాన్ని మరొకమారు పరిచూచాడు.

సీతారామారావుకి కోపం వచ్చింది. ఒక అడుగు ముందుకు వేసి "ఎవరు నువ్వు?" అనిఅడిగాడు.

"నీ తండ్రి కొడుకుని."

"మరి నేనూ?"

"నా సేడవి."

"ఆ!!"

"మరేమనుకున్నావు? హృదయంలేని ఆకారానివి, ఆకారంలేని అస్తిపంజరానివి!" అంది నీడ.

సీతారామారావుకి ఊపిరాట్టంలేదు. తండ్రి ముఖం లోకి చూస్తూ..."నాన్నా... నేను నీ కొడుకుని....చూడు" అన్నాడు.

"పో....పో..." అని గద్దించాడు తండ్రి. "ఇంకా నన్ను మోసం చేద్దామనుకున్నావా ? నా కొడుకుని నేను గుర్తుపట్టలేనూ! నా చేతులారా పెంచానే! వాణ్ణి నేను ఎరుగనూ!...నీవా నా కొడుకువి! అహ్హాహ్హా బాబూ, వీధిశ పీడకలగా వున్నాడు!" అని నీడతో చెప్పి బిగ్గరగా నవ్వాడు. నవ్వుతూనే తన నీడను తీసుకొని అదృశ్యం అయ్యాడు.

సీతారామారావు కూలబడ్డాడు. అతని కేమీ అర్థ మవటం లేదు. తల పేలిపోతూ ఉంది.

"బాబూ!" అని పిలిచింది పక్కనున్న సమాధి. ఉలిక్కిపడి చూశాడు. పిలిచేది తన తల్లే. అందులో సందేహంలేదు. "నువ్వు మారావు నాయనా!" అంది.

"నేను మారానా అమ్మా? నామారు నీకు ఆనందా

ఖిన్నస్తూవుందా? నేను నిన్ను సంతోష పెట్టగలిగానా అమ్మా?"

"అవును నాయనా, నువ్వు మారుతున్నావ్!" అంది తల్లి. ఆమె ఆనందాశ్రువులు రాలుస్తూవుందని అతను ఊహించాడు. "అమ్మా, నేను ఈ విశ్వప్రపంచంలో ఒక ప్రాణికి_అందులో తల్లికి సంతోషాన్నివ్వగలిగానా నాకిం కేం కావాలి?"

"నాకుచాలా సంతోషంగా ఉంది నాయనా!"అంది తల్లి.

"అమ్మా... అమ్మా... అమ్మా..." అని ఆసమాధి పాదాల దగ్గరపడి భోరున ఏడ్చాడు." మరి లాభంలేదమ్మా! అలస్యం అయిపోయిందమ్మా!"

అలాపడి ఎంతసేపు ఏడ్చాడోగాని, తల పైకెత్తి చూసేటప్పటికి చితి ఆరిపోతూవుంది. చీకటి దట్టం అవుతూ ఉంది. స్మశానం యథారూపం ధరించుతూవుంది. నల్లకుక్క ఒకటి అతనికాలు నాకుతూ వుంది. అతడు కదలకుండా ఆ కుక్కను చూస్తూ వెల్లికిలా పడుకున్నాడు. చూడగా చూడగా ఆ కుక్క ఆకారం తనఆకారంగానే కనిపించింది.

తన ఆకారం తనకు ఎదురుగా నిలబడింది.

తన ఆకారాన్ని చూసుకునేటప్పటికి అతనికి భయం వేసింది. మొహం ముడతలు పడివుంది. జుట్టు పండి రెల్లు దుబ్బులాగుంది. కళ్ళు చింతనిప్పుల్లా ఫున్నాయి. శరీరం అస్థిపంజరం లాగున్నది. వొంగిపోయివుంది. ఊగులాడుతూ

నడుస్తూవుంది. నుంచోలేక కూర్చొని కడుపు చేత్తోపట్టుకుని దగ్గుతూ వుంది.

సీతారామారావుకి తనే దగ్గుతున్నట్టు బాధకలిగింది. ఆకారం దగ్గి దగ్గి, తోకతొక్కిన పామల్లెలేచి సీతారామారావుకి ఎదురుగా నిలబడి, "నా జీవితం భగ్నం అవటానికి నువ్వే కారణం మూర్ఖుడా! బంగారంవంటి జీవితాన్ని బుద్ధిలేని ఆలోచనలతో నలిపి నలిపి నాశనం చేశావు. నన్నీస్థితికి తీసుకువొచ్చింది ఎవ్వరు? నీ తెలివితక్కువతనం, నీ అహంకారం, నీ మూఢత్వం" అని అరిచింది.

దగ్గుతెర వొచ్చింది. కుక్కిమంచంలో కూలబడింది. లుంగలుపడి దగ్గుతూ ఉంది.

తనభార్య ముసలిద్దైంది. తన ఆకారం పడే బాధని గమనించకుండా మనుమలకు చొక్కాలు కుడుతూ ఉంది. తనకొడుకు వొచ్చాడు. పెద్దవాడయ్యాడు. తీనిగావున్నాడు. వాళ్ళెవరూ కుక్కిమంచంలో తన ఆకారం పడుతున్న బాధలు గమనిస్తున్నట్టు లేదు.

"బాబూ...మందిస్నీళ్ళు!" అని అడిగింది తన ఆకారం.

"ముంచుకు తాగు...." అన్నాడు కొడుకు.

"కన్నతండ్రినే...." అంది ఆకారం.

"తండ్రి....ఉదరించావుకదూ కుటుంబాన్ని....సర్వ మంగళంచేసి!" అని చీదరించుకున్నాడు. భార్య కొడుకుని

వారించలేదు. మాట్లాడకుండా లేచి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది.

తన ఆకారం మంచినీళ్ళు తాగబోతూ ఉండగా మళ్ళీ దగ్గుతెర వొచ్చింది. గ్లాసు వొదిలి మంచంలోపడి గిలగిల తన్నుకుంటూ ఉంది. నెత్తురు కక్కుతూ ఉంది. అంతా నెత్తురే! తన ఆకారం పడే బాధని సహించలేక పోయాడు.

తనే దగ్గుతున్నట్టూ, తనే నెత్తురు కక్కుతున్నట్టూ తన నరాలే లుంగలుపడి, జివ్వున లాగుతున్నట్టూ అనిపించింది అతనికి.

తన ఆకారం మళ్ళీ లేచింది. లేచి మంచంపట్టె పట్టుకొని కూర్చుంది. తన్నే చూస్తూ ఉంది. ఆ చూపులు అతన్ని చురచురా కాలుస్తున్నయి. లోపల అగ్నిజ్వాలలు విజృంభించినై.

"మళ్ళీ కూర్చున్నావే...పడుకో....నీకు చెయ్యలేక మూ నరాలు తెగుతున్నయి" అన్నాడు కొడుకు.

తన భార్య మనమణ్ణి ఎత్తుకొని కొడుక్కు అందించింది. కొడుకు చేతులలోకి తీసుకొని ముద్దు పెట్టుకున్నాడు. పసివాడి చేష్టలకు తల్లి కొడుకులు పరవశులయ్యారు.

తన ఆకారం మళ్ళీ దగ్గుతూ ఉంది. "చూశావా నువ్వు చేసినపని! నన్ను, నా భార్యకూ పిల్లలకూ కాకుండా చేశావు. ఆ పసివాడిని నా కివ్వరు. ఎందుకో తెలుసా? నేను చెడగొడతానని, పనికిమాలిన మాటలన్నీ చెప్పి చిన్నతనంలోనే వాడి మనస్సు పాడుచేస్తానని, వాళ్ళ

భయం.... పరమచండాలుడా ! ఇంత చేసి ఇంకా సిగ్గుపడ కుండా, కించపడకుండా బతుకుతున్నావా? ఎందుకు బతుకు తున్నావు? ఇంకా ఎవర్ని నాశనం చెయ్యటానికి ? ఎవ్వరి జీవితాలను హతమార్చటానికి?" అని మంచం మీదనుంచి హఠాత్తుగా లేచి, మీదకు రివ్వున దూకింది.

అది విషం కక్కుతూ ఉంది. కళ్లు జ్యోతుల్లా మండు తున్నయి, కళ్ళల్లోంచి కత్తులు కఠారులు వచ్చి తన్ను ముక్కలు ముక్కలుగా చేస్తున్నయి. తను సహాయం కోసం భార్యనీ తన కొడుకునీ ప్రార్థించాడు. వాళ్ళు తన మొర ఆలకించలేదు .... తన భార్య కొడుకుకి భోజనం వడ్డించి ఎదురుగా కూర్చొని కబుర్లు చెపుతూ ఉంది. కొడుకు నవ్వుకుంటున్నాడు.

అతనికి కోపం వచ్చింది. తనకు సహాయం చేసే వాళ్ళు ఎవ్వరూ లేరు. తన్ను జాలి తలిచేవాళ్లూ లేరు. తనకు సానుభూతి చూపేవాళ్ళు కూడా లేరు. తన్ను తానే రక్షించుకుంటాడు. తానే ఎదుర్కుంటాడు, తానే పోట్లాడు తాడు. తన ఆకారాన్నుంచి తన్ను తాను రక్షించుకో లేడూ! తన ఆకారాన్ని తాను జయించలేడూ? తన ఆకా రంతో తాను పోట్లాడలేడూ ?

తన ఆకారం తనమీదకు దూకింది. ఎముకల కాళ్ళతో డొక్కల్లో తంతూ ఉంది. గుప్పిళ్ళు బిగబట్టి మొహం మీద గుద్దుతూ ఉంది. గోరలతో కండలు కండలు పీకుతూ ఉంది. విచ్చుకత్తులవంటి గోళ్ళతో వళ్లు

పీకుతూ ఉంది. రక్తం, కండలూ, ఎముకలూ, పేగులూ— శ్మశానం అంతా భీభత్సం అయింది. రాబందులు ఎగురుతున్నై. కుక్కలు తిరుగుతున్నై. కాకులు చెంగు చెంగున దూకుతున్నై.

సీతారామారావు పళ్ళు బిగించాడు. పిడికిలి బిగబట్టాడు: మిగిలివున్న శక్తినంతా కేంద్రీకరించాడు. అమాంతంగా నిలబడ్డాడు. తన ఆకారం మీదకు చూశాడు. రెండు చేతులతో గొంతు పట్టుకున్నాడు. నొక్కాడు, పిసికాడు. తన శక్తికొద్దీ పిసికాడు. తన ఆకారం నెత్తురు కక్కుతూ ఉంది. మెడ నులిమాడు. తన ఆకారం కళ్ళు నెత్తురుగుడ్లుగా ఊడిపడినయి. తన ఆకారాన్ని లోబరుచుకున్నాడు. తన ఆకారాన్ని జయించాడు. తన ఆకారాన్ని నామరూపాలు లేకుండా చేస్తున్నాడు. అతనికి కసి ఎక్కువైంది. అతనిలో ఉన్న రాక్షసత్వం ప్రకోపించింది. మెడ గోడిమెడ విరిచినట్లు విరిచాడు. ఒక సన్నని భయంకరం అయిన ఎలుగుతో కూలబడ్డాడు. తన్ను తానే హత్య చేసుకున్నాడు.

తెల్లవారి శ్మశానంలో ఎవ్వరో చచ్చి పడి ఉన్నారని ఊరంతా లబుబ్బుగా చెప్పుకున్నారు. జనం తండోప తండాలుగా శ్మశానంచుట్టూ పోగయ్యింది. శవం పడిఉన్న చోట నెత్తురు గుంట ఉంది. నెత్తురు గడ్డకట్టి కొని ఉంది. శవానికి కళ్ళులేవు. ఒంటినిండా దెబ్బలే. వొళ్ళంతా బదాబదలుగా చీలివుంది. మెడ మెలితిరిగి

వుంది. అయిదారుగురు కలబడి యుద్ధం చేసినట్లు శ్మశానం అంతా తసాపిసా తొక్కబడి వుంది.

"ఎవ్వరో పొడిచి చంపారు" అనుకున్నారు అంతా.

రామయ్యతాత వొచ్చి చెప్పేవరకూ ఆ శవం గారావుదని బాగా ఎరిగిన వాళ్ళుకూడా గుర్తు రాలేదు.

రచయిత యితర నవలలు

పండితపరమేశ్వరశాస్త్రి వీలునామా

మొరుపుల మరకలు

గడియపడని తలుపులు

పిల్ల తెమ్మెర.

పరివర్తనం

213

RSKOLA149

214

ASAMARDHUNI JEEVAYATRA RS. 3-50

మేము ప్రచురించిన

రచయిత యితర రచనలు

నవలలు: పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా

యమపాశం

వ్యాసాలు: గోపీచంద్ సలహాలు

నాటిక: జీవితావకాశాలు



Printed at Venkataratna Printers, Vijayawada-2.

మనసు ఫౌండేషన్
పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	Rsk01A149
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	03/06/23
ముందు అట్ట	ఉంది
వెనుక అట్ట	ఉంది
మొత్తం పేజీలు	217
పెద్ద సైజు పేజీలు	లేవు
ఖాళీ పేజీలు	1, 213
లేని పేజీలు	లేవు
తయారు చేసినది	[illegible]
పేజీలు విడదీసినది	Chaitanya
స్కాన్ చేసినది	Ch.Ramya
పరీక్ష చేసినది	hema
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	
పరిస్థితి	

మనసు ఫౌండేషన్